19-4Pg1exHMNWJQE.qxd:19-4Pg1exHMNWJQE.qxd 1/1/02 6:01 AM Page 1




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విశాఖపట్నం

: fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-4-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 78 పేజీలు: 16 వెల: 8.00



ఐఎఎస్ అధికారుల బదిలీ

హార్ముజ్ జలసంధి మళ్లీ మూసివేత 2లో


# మహిళలకు క్షమాపణ చెబుతున్నా..

బిల్లును ఓడించి మహిళల స్వప్నాలను చిదిమేశారు..

రిజర్వేషన్ల కోసం మహిళలు 40 యేళ్లుగా ఎదురుచూస్తున్నారు

పార్లమెంటులో ఏం జరిగిందో దేశం మొత్తం చూసింది

విపక్షాలు చేసిన తప్పునకు నన్ను క్షమించండి

మహిళా లోకం వారిని శిక్షించి తీరుతుంది

జాతినుద్దేశించి ప్రధాని మోడీ



శనివారం జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

నారీశక్తిని అడ్డుకోవాలని విపక్షాలు యత్నించడం బాధాకరం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించి విపక్షాలు తప్పుచేశాయని ప్రధానిమోడీ ధ్వజమెత్తారు. బిల్లు అమలు చేయనందుకు మహిళలను క్షమాపణ కోరుతున్నానన్నారు. మహిళా రిజర్వేషన్లకు తాము కట్టుబడి ఉన్నామని, కొందరు మాత్రం నారీ శక్తిని ఎదగకుండా మహిళల స్వప్నాన్ని చిదిమేశారని, బిల్లును ఎలా అడ్డుకున్నారో దేశం మొత్తం చూసిందన్నారు. అన్ని రాజకీయపార్టీలతో తాను స్వయంగా మాట్లాడానని, బిల్లుకు మద్దతి వ్వాలని స్వయంగా కోరానని, మహిళా రిజర్వేషన్ల పరంగా అవసరమైతే మీరే ఆ క్రెడిట్ తీసుకున్నా పర్వాలేదని చెప్పానని గుర్తుచేసారు. అయినా కూడా కుటుంబ రాజకీయ పార్టీలు ఈ బిల్లును అడ్డుకున్నాయని ఆవేదన వ్యక్తంచేసారు. దేశ మహిళాలోకానికి క్షమాపణలు చెపుతున్నానని మోడీ పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు తమకు చేసిన అవమానాన్ని మహిళలు ఎన్నడూ మర్చిపోరు, మహిళా మనసులో వాళ్లు చేసిన పని ఎప్పటికీ నిలిచిపోతుందని, మహిళ రిజర్వేషన్ల బిల్లును అడ్డుకున్న నాయకులకు క్షేత్రస్థాయిలో మహిళలే సమాధానం చెప్తారని ప్రధాని అన్నారు. కొందరికి దేశం కంటే రాజకీయాలే ఎక్కువని కానీ తమకు మాత్రం దేశ ప్రయోజనాలే ముఖ్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. పార్లమెంటులో ముందురోజు జరిగిన వ్యవహారంపై ఆయన శనివారం జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆ క్రమంలోనే విపక్షాలపై ఆయన విరుచుకు పడ్డారు. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, సమాజ్‌వాదీ వంటి కుటుంబ వారసత్వ పార్టీలు బిల్లుకు వ్యతిరేకంగా చప్పట్లు కొట్టి మహిళల ఆత్మాభిమానంపై దాడి చేశాయన్నారు. మహిళా రిజర్వేషన్లను ఆపి సంబరాలు చేసుకున్నారని మండిపడ్డారు. వారిని మహిళా లోకం >>2

# మరో 2 రైల్వే లైన్లు



రూ.9,889 కోట్లతో నిర్మాణానికి కేంద్రం ఆమోదం

198 కి.మీ మేర నిడదవోలు, దువ్వాడ మధ్య నిర్మాణం

గోదావరిపై మరో వంతెన

కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** నిడదవోలు-దువ్వాడ మధ్య మూడు, నాలుగు రైల్వే లైన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. మొత్తం 198 కిలోమీటర్ల నిర్మాణానికి 9,889 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఎక్కువ రద్దీ ఉన్న చెన్నై- హౌరా మధ్య నాలుగు లైన్లు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏపీలోని తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాలను కవర్ చేస్తుందని పేర్కొన్నారు. ఈ మార్గం సామర్థ్యం ఇప్పటికే 130 శాతానికి చేరుకోవడంతో తరచూ రద్దీ, ఆలస్యం పెరుగుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా కొత్త రైల్వే ప్రాజెక్టులు, విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అందులో భాగంగా నిడదవోలు -దువ్వాడ మధ్య మూడు, నాలుగు రైల్వే లైన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. ఎక్కువ రద్దీ ఉన్న చెన్నై హౌరా మధ్య నాలుగు లైన్లు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏపీలోని తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాలను కవర్ చేస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టులో భాగంగా గోదావరి నది మీద 4.3 కిలోమీటర్ల రైలు వంతెన, 2.67 కిలోమీటర్ల వయాడక్ట్, 3 బైపాసులు నిర్మాణం జరగనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. తూర్పు తీరంలోని విశాఖ, గంగవరం, మచిలీపట్నం, కాకినాడ ప్రధాన పోర్టులకు అనుసంధానం పెరుగుతుందని వివరించారు. అన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం వంటి కీలక ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలకు ఎక్కువ అనుసంధానం పెరుగుతుందని స్పష్టం చేశారు. రోడ్డు రవాణాతో పోలిస్తే ఏటా సుమారు రూ.1,150 కోట్ల మేర ఆదా అవుతుందని, డీజిల్ కాలుష్య >>2

# అమరావతి రైతులకు పదేళ్లు కౌలు



శనివారం అమరావతి రైతులతో సిఎం చంద్రబాబు నాయుడు

రూ.40వేల చొప్పున చెల్లిస్తామన్న సిఎం చంద్రబాబు

వారి త్యాగాలను ప్రభుత్వం మరువదు..

ఒక్కో కుటుంబానికి రూ.1.5లక్షల వ్యవసాయ రుణమాఫీ

యేడాదికి రూ.3వేలు కౌలు హెచ్చింపు

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రైతుల త్యాగాలను ప్రభుత్వం ఎన్నటికి మరవదని ఏపీ చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. వారి చేయూతతోనే అమరావతి విశ్వనగరంగా ఎదుగుతుందన్నారు. అమరావతి రైతులకుఎకరానికి 40 వేల చొప్పున పదేళ్లపాటు కౌలు చెల్లిస్తామని రాజధాని రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక్కో కుటుంబానికి 1.50 లక్షల మేర వ్యవసాయ రుణ మాఫీ చేయనున్నట్లు రెండో విడత భూ సమీకరణపై రాజధాని రైతులతో సమావేశమైన సీఎం చంద్రబాబు వెల్లడించారు. సీఎంతో భేటీలో తాడికొండ, పెద కూరపాడు నియోజకవర్గాలకు చెందిన 10 గ్రామాల రైతులు పాల్గొన్నారు. శనివారం తొలిగంటల వరకు ఈ సమావేశం జరిగింది. రెండో విడత భూ సమీకరణకు భూములిచ్చిన రైతులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కౌలును ప్రకటించారు. అంతేకాకుండా ఏడాదికి రూ. 3 వేలు చొప్పున కౌలును పెంచేందుకు అంగీకరించారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులెవరికీ అన్యాయం జరగదని సీఎం చంద్రబాబు రైతులందరికీ హామీ ఇచ్చారు. ఈ భూముల్లో ప్రపంచస్థాయి రాజధాని నగరాన్ని నిర్మించే బాధ్యత తనదని చెప్పారు. రైతులే బ్రాండ్ అంబాసిడర్లుగా మారి భూసమీకరణ ప్రక్రియను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సీఎం కోరారు. హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ నిర్మాణం, అదే విధంగా ఆ తర్వాత ఆ ప్రాంతాన్ని సైబరాబాద్‌గా అభివృద్ధి చేయడంతో అక్కడ జరిగిన అభివృద్ధి, అప్పట్లో రూ.లక్షల్లో ఉన్న భూముల విలువ ఇప్పుడు రూ.కోట్లలోకి చేరడం వంటి పరిణామాల్ని సీఎం చంద్రబాబు ఉదహరించారు. అదే రీతిలో అమరావతి సైతం అంతకుమించి అభివృద్ధి చెందుతుందని సీఎం తెలిపారు. అమరావతికి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకూడదనే చట్టబద్ధత కల్పించామని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని భూ సమీకరణకు సహకరించాలని రాజధాని రైతులకు సీఎం చంద్రబాబు కోరారు. కేంద్రం పూర్తి సహాయ సహకారాలు అందించడంతో అమరావతి నిర్మాణం మరింత రెట్టింపు వేగంతో జరుగుతోందని చంద్రబాబు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎండ్రాయి, పెదమద్దూరు, వైకుంఠపురం, కర్లపూడి, పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాలకు చెందిన 70 మంది >>2



# డి.సిఎం పవన్‌కు శస్త్రచికిత్స

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రికి పవన్‌కు శనివారం సాయంత్రం శస్త్రచికిత్స జరిగింది. శుక్రవారం ఉదయం తన అధికారులతో పాలనాపరమైన విషయాలపై చర్చిస్తున్న సందర్భంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొద్ది నెలలుగా ఆరోగ్యపరంగా పవన్ కల్యాణ్ ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆయన వ్యక్తిగత వైద్యుల సలహాతో శుక్రవారం అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకుని ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలతోపాటు ఎం.ఆర్.ఐ. కూడా నిర్వహించారు. వాటిని పరిశీలించిన వైద్యులు శస్త్ర చికిత్స చేయవలసి ఉంటుందని నిర్ణయించి, శస్త్రచికిత్స చేశారు. వారం నుంచి పదిరోజులపాటు విశ్రాంతి తర్వాత ఆయన అధికారిక పాల్గొనవచ్చని డాక్టర్లు తెలిపారు. అయితే దీర్ఘకాలం తగిన జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుందని, పూర్తి స్వస్థత చేకూరడానికి ఎక్కువ కాలం పడుతుందని డాక్టర్లు చెప్పారు.

# పరిమళించిన మానవత్వం



శనివారం హైదరాబాద్‌లో చిన్నారి పునర్విక‌ను పరామర్శిస్తున్న మంత్రి లోకేష్

పునర్వికకు పునర్జన్మ

దాతల దాతృత్వంతో రూ.16కోట్ల ఇంజెక్షన్

విదేశాల నుంచి తెప్పించేందుకు మంత్రి లోకేష్ సాయం

హైదరాబాద్‌లో మంత్రి సమక్షంలో ఇంజెక్షన్ ఇచ్చిన వైద్యులు

చిన్నారి క్షేమం: మంత్రి లోకేష్

**కర్నూలు, ఏప్రిల్ 18ప్రభాతవార్త:** ప్రపంచంలో స్వార్థం, ఈర్ష్యా, ద్వేషాలు నిండిపోయాయని భావిస్తున్న సమయంలో మానవత్వం ఇంకా బ్రతికే ఉందని నిరూపించిన సంఘటన ఇది. యేడాది వయసున్న చిన్నారికి భయంకరమైన రోగం, కోట్లు ఖర్చు పెడితేగాని నయం కానీ వైనం. కోటి రూపాయలు అంటేనే.. అమ్మో అని పేద కుటుంబం. అలాంటి కుటుంబంలో జన్మించిన చిన్నారి పునర్విక కు 16 కోట్ల రూపాయల విలువ చేసే ఇంజక్షన్ వేయించాల్సిన పరిస్థితి. ఆటపాటల సరదాలతో అలరించి సోషల్ మీడియా ఆ సమస్యను భుజానికి ఎత్తుకుంది. అంతే సోషల్ మీడియా వేదికగా ఎన్నో దయార్ద్ర హృదయాలు స్పందించాయి, సాయం చేశాయి.. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 10 కోట్ల రూపాయలు అందించాయి. ప్రభుత్వం సైతం కదిలింది. మంత్రి నారా లోకేష్ రూ.6 కోట్లు అందించడమే కాక తన వ్యక్తిగత సిబ్బందిని రంగంలోకి దింపి.. చికిత్స చేయించాడు. విదేశాల నుంచి కోట్ల రూపాయల విలువ చేసి ఇంజక్షన్ వచ్చింది. వైద్యులు చిన్నారికి అందించారు. పునర్వికకు పునర్జన్మ వచ్చింది. ఓ మంచి పని చేయడంలో స్పందించిన అన్ని మనసులు ఆనందంతో వికసించాయి. సమస్య ఎవరిదైనా.. ఎక్కడున్నా స్పందించే హృదయాలు ఉన్నాయని చాటి చెప్పాయి. ఏడాదిన్నర వయసు ఉన్న ఓ చిన్నారి ప్రాణం నిలిపేందుకు తెలుగు ప్రజలు చేసిన ప్రయత్నం ఫలించింది. కర్నూలు చిన్నారి పునర్విక మృత్యువును జయించింది. పునర్వికకు పునర్జన్మ లభించింది. చిన్నారి మోముపై మళ్లీ చిరునవ్వులు విరబూశాయి. తెలుగు ప్రజల గొప్ప మనసు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన సాయంతో చిన్నారి పునర్వికకు కావాల్సిన రూ.16కోట్ల విలువైన ఇంజెక్షన్ ఆమెకు అందింది. అత్యంత అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ వ్యాధితో బాధపడుతున్న పునర్వికను కాపాడేందుకు మంత్రి నారా లోకేష్ విదేశాల నుంచి ఈ ఇంజెక్షన్ తెప్పించారు. శనివారం ఉదయం హైదరాబాద్‌లో ఉన్న రెయిన్‌బో ఆసుపత్రిలో మంత్రి నారా లోకేష్ సమక్షంలో రెయిన్‌బో ఆస్పత్రి డాక్టర్లు విదేశాల నుంచి తెప్పించిన రూ. 16 కోట్ల ఖరీదైన జోల్‌జెన్‌స్మా ఇంజెక్షన్ >>2

# డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.1.6కోట్ల భారీ మోసం

ఇండస్‌ఇండ్ బ్యాంకు అధికారి సహా ముగ్గురి అరెస్టు

ఎపి, తెలంగాణలో సిబిఐ విస్తృత సోదాలు

**విజయవాడ,ఏప్రిల్18,ప్రభాతవార్తప్రతినిధి:** డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న భారీ కుంభకోణాన్ని ఛేధించే దిశలో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ దూకుడు పెంచింది. శనివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఐదు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, ఓ బ్యాంకు అధికారితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసింది. ఓ సీనియర్ సిటిజన్‌ను డిజిటల్ అరెస్ట్ చేస్తామంటూ బెదిరించి, ఆయన నుంచి రూ. 1.6 కోట్లకు పైగా వసూలు చేసినట్లు ఈ కేసు నమోదైంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ కేసు దర్యాప్తు చేపట్టింది. అరెస్టయిన వారిలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ నాటి అసిస్టెంట్ మేనేజర్ దుబ్బాక మహేశ్‌తో పాటు రాజేశ్ కన్న, వాయల శ్రీనివాస్ ఉన్నారు. నిందితులు ఓ కంపెనీ పేరుతో నకిలీ బ్యాంకు ఖాతాను తెరిచి, మోసం చేసిన డబ్బును అందులోకి మళ్లించినట్లు సీబీఐ గుర్తించింది. ఆ తర్వాత నేరం మూలాలను దాచిపెట్టేందుకు, ఆ డబ్బును పలుఖాతాలకు బదిలీ చేసినట్లు తేలింది. నకిలీఖాతా తెరవడంలో బ్యాంకు అధికారి మహేశ్ సహకరించాడని, మిగిలిన ఇద్దరు నిందితులు మ్యూల్ అకౌంట్లను ఏర్పాటు చేయడం, నిధుల తరలింపును నిర్వహించడం వంటి పనులు చేశారని అధికారులు తెలిపారు. నిందితులకు సంబంధించిన ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో కీలక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ వెల్లడించింది. వాటిని విశ్లేషించి మరిన్ని ఆధారాలు సేకరిస్తు న్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా ప్రజలకు సీబీఐ కీలక సూచనలు జారీ చేసింది. చట్టంలో ఖడిజిటల్ అరెస్ట్ఖ అనే పదం ఎక్కడా లేదని, అలాంటి బెదిరింపులకు ఎవరూ భయపడొద్దని స్పష్టం చేసింది. పోలీసుల పేరుతో గానీ, ఇతర అధికారుల పేరుతో గానీ వచ్చే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏదైనా అనుమానాస్పద లావాదేవీని గమనిస్తే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరింది.

# ఒంటిమిట్టలో $45^0$ ఉష్ణోగ్రతలు

గూడూరు, ఆళ్లగడ్డలో $44.3^0$

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఈ నెల 19,20 తేదిల్లో కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. కొన్ని ప్రాం తాల్లో ఎండతీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన అకాలవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. >>2

# విపక్షాల తీరు జాతికి ద్రోహం

మహిళా బిల్లును అడ్డుకోవడం చరిత్రలో బ్లాక్ డే

మహిళా సమాజానికి ఆ పార్టీలు క్షమాపణ చెప్పాలి

నిడదవోలులో జరిపిన నిరసన ర్యాలీలో సీఎం చంద్రబాబు

**నిడదవోలు,ఏప్రిల్18,ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష పార్టీలు జాతికి ప్రత్యేకించి మహిళలకు ద్రోహం, అన్యాయం చేశాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. ఈ బిల్లును అడ్డుకున్నందుకు నిరసనగా నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు నిర్వహించిన ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నేతలతో కలిసి సీఎం ఈ నిరసన ర్యాలీలో ప్లకార్డులు చేతపట్టుకుని నడిచారు. ధనమ్మ గుడి సెంటర్ నుంచి సభాస్థలి సుబ్బరాజు నగర్ వరకు జరిగిన ఈ నిరశన ర్యాలీలో మహిళలతో కలిసి పాల్గొన్నారు. మహిళా బిల్లును అడ్డుకున్న రోజును ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు మహిళా ద్రోహులని పేర్కొన్నారు. మహిళా సమాజానికి ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ పార్టీలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల్ని ఓటు బ్యాంకుగా చూసే రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని సీఎం అన్నారు. మూడు దశాబ్దాల మహిళా రిజర్వేషన్ కలను ప్రతిపక్ష పార్టీలు చెరిపేశాయని పేర్కొన్న ముఖ్యమంత్రి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవటం మహిళలకు ద్రోహం చేయడమేనని అన్నారు. ఎన్డీఏ పక్షాలతో కలిసి నిరసన ర్యాలీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో నిన్నటి రోజు ఓ బ్లాక్ డే అని మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయని సుదీర్ఘ కలసాకారం అవుతుందని భావించామన్నారు. పార్లమెంటు, >>2




శనివారం నిడదవోలులో జరిగిన నిరసన ర్యాలీలో సీఎం చంద్రబాబు, మంత్రులు, బిజెపి అధ్యక్షుడు మాధవ్

19-4pg2exHMNWJQE.qxd:19-4pg2exHMNWJQE.qxd 1/1/02 6:13 AM Page 1



# విపక్షాల తీరు జాతికి ద్రోహం



శనివారం జరిగిన నిరసన ర్యాలీలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, ప్రజాప్రతినిధులు, మహిళలు

>> అసెంబ్లీలోనూ 33 శాతం మంది మహిళల్ని ప్రజాప్రతినిధులుగా చూస్తామని అనుకున్నామని మహిళల్ని గౌరవించటం భారత సంస్కృతి లో భాగమని నిన్న పార్లమెంటులో దీనికి భిన్నంగా జరిగిందని మండిపడ్డారు. విపక్షాల వైఖరికి నిడదవోలులో ఎన్డీఏ పక్షాలు నిరసన ర్యాలీ నిర్వహించాం. మహిళలంతా బయటకు వచ్చి వారికి నిరసన తెలియాలని పిలుపు ఇస్తున్నానని దక్షిణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని, హోం మంత్రి పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చారన్నారు. 50 శాతం మేర సీట్లు పెరుగుతాయని స్పష్టంగా చెప్పారు. ఏపీలో కూడా 50 శాతం మేర సీట్లు పెరుగుతాయి. ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ అజెండా కోసం ఈ దుర్మార్గం చేశాయని దుయ్యబట్టారు. దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ కోసం పోరాడుతున్నాం. దీనిని అడ్డుకోవటం క్షమించరాని నేరం. ఆడబిడ్డలంటే కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలకు ఇంత చులకనా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఈ బిల్లు ని అడ్డుకున్న పార్టీలు ఎన్నికల్లో మహిళా ఓట్లను అడిగే హక్కు లేదని చంద్రబాబు తేల్చి చెప్పారు.

**విద్రోహంపై ఇంటింటికీ ప్రచారం:** నిన్న జరిగిన విద్రోహాన్ని ప్రతీ ఇంటికి తీసుకెళ్తాం. ఇవాళ చేపట్టిన నిరసన ఆరంభం మాత్రమే. దీనిపై పవన్ కల్యాణ్‌తో మాట్లాడాను. ఎన్డీఏ పక్షాలతో పాటు ఇతర పార్టీలు కూడా కలిసి రావాలి. మహిళలను ఓటు అడిగే పార్టీలు మహిళా సాధికారతను అడ్డుకుంటాయా? 2017లో టీడీపీ అధికారంలో ఉండగా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించాం. కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు బిల్లు కూడా తీసుకు రాలేక పోయారు. 2029లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశంతోనే సవరణ బిల్లు తీసుకు వచ్చారు. కాంగ్రెస్ నేతృత్వంలోని పార్టీలన్నీ ఈ బిల్లుకు 2/3 మంది సభ్యుల మద్దతు రాకుండా అడ్డుకున్నాయి. దక్షిణాదికి, ఉత్తరాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఏవోవో ఆరోపణలు సాకులు చెప్పారు. లేని పోని సాకులతో బిల్లును డిఫీట్ చేయటం శోచనీయం. ప్రజలు ఎన్నుకుంటేనే చట్టసభల్లోకి వచ్చిన వారు మహిళలకు ద్రోహం చేయటం సరికాదని సిఎం చంద్రబాబు గట్టిగా చెప్పారు. జనాభాలో సగం ఉన్న మహిళలు ఏ రంగంలో అయినా సమర్ధంగా పనిచేస్తున్నారు. అలాంటి మహిళలు చట్ట సభలకు వస్తే న్యాయం జరుగుతుందనే ఈ సవరణ బిల్లు తీసుకువచ్చారు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా బిల్లును అడ్డుకున్నారు. ఏ ముఖం పెట్టుకుని మహిళల్ని ఆ పార్టీలు ఓట్లు అడుగుతాయన్నారు. ఆ పార్టీలు చేసిన ద్రోహానికి డిపాజిట్ కూడా రాకుండా చేయాలి. ఆడబిడ్డలు పైకి వస్తే చూడలేకే ఈ బిల్లును అడ్డుకున్నారు. ఈ వ్యవహారంపై ప్రతీ ఒక్కరిని చైతన్యం చేసేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతాం". అని ముఖ్యమంత్రి అన్నారు. ఎన్డీఏ పక్షాలు నిర్వహించిన నిరసన ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, జనసేన తరపున మంత్రి కందుల దుర్గేష్, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.



శనివారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో మంత్రి పయ్యావుల భేటీ దృశ్యం

## ఆర్థిక బలోపేతానికి కేంద్రం సహకరించాలి: మంత్రి పయ్యావుల

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీకి ఆర్థికంగా బలీయమయ్యేందుకు కేంద్రం పరిపూర్ణ సహకారం అందించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విజ్ఞప్తి చేసారు. కేంద్రం ఏపీ అన్ని విధాలుగా పరిపుష్టం కావడానికి కేంద్రం అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. అమరావతి రాజధాని నగరం, పోలవరం నిర్దిష్ట లక్ష్యాలకు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఈ దిశలో కేంద్రం పలు పథకాలకు నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేసారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు ఆర్థిక అంశాలు, అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర సహకారం గురించి పయ్యావుల నిర్మలా సీతారామన్‌తో చర్చించారు. ఈ సందర్భంగా విభజన హామీ నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఆయన ప్రస్తావించారు.

# పరిమళించిన మానవత్వం

>> పునర్విక‌కు అందించారు. కర్నూలు జిల్లాలోని వెల్దుర్తికి చెందిన సురేష్ కుమార్, పుష్పావతిల కుమార్తె పునర్విక. పుట్టిన ఆరు నెలలకే పునర్విక శరీరంలో కదలికలు తగ్గిపోయాయి. తల్లిదండ్రులు డాక్టర్లను సంప్రదిస్తే.. పునర్వికను పరీక్షించిన వైద్యులు.. ఆమె అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యాధి కారణంగా పునర్విక వెన్నెముక కండరాలు క్షీణించి, శ్వాస తీసుకోవడం కష్టమయ్యే పరిస్థితి. దీని నుంచి బయటపడాలంటే పునర్వికకు రూ. 16 కోట్ల ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉంటుందని సూచించారు. అయితే సెలూన్ షాపులో పనిచేసే సురేష్ కుమార్‌కు.. అంత మొత్తాన్ని ఎలా సేకరించాలో అర్థం కాలేదు. ఓ వైపు చిన్నారి ప్రాణం.. మరోవైపు అంతంత మాత్రంగా ఆర్థిక పరిస్థితి. ఈ సమయంలో తెలుగు రాష్ట్రాల ప్రజల చిన్నారి పునర్వికకు అండగా నిలిచారు. సేవ్ పునర్విక హ్యాష్ ట్యాగ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యింది. పునర్విక కథ ప్రతి ఒక్కరినీ కదిలించింది. పసిపాప ప్రాణాన్ని నిలబెట్టేందుకు తెలుగు ప్రజలు తమ ఉదారతను చూపించారు. లక్షలాది మంది దాతలు స్పందించారు. తమకు తోచిన సాయం అందించటంతో రూ. 10 కోట్లు సమకూరాయి. ఇంకో రూ. 6 కోట్లు అవసరం కాగా.. చిన్నారి పరిస్థితిని తెలుసుకున్న నారా లోకేష్ ఆ కుటుంబానికి అండగా నిలిచారు. రూ.6 కోట్లు ప్రభుత్వం తరుపున సమకూరుస్తామని మాటఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం విదేశాల నుంచి ఇంజెక్షన్ తెప్పించేందుకు తన వ్యక్తిగత సిబ్బందిని రంగంలోకి దించారు నారా లోకేష్. అన్ని అనుమతులు వేగంగా మంజూరయ్యేలా చూశారు. దీంతో చిన్నారి పునర్వికకు పునర్జన్మ లభించింది. శనివారం ఆమెకు కావాల్సిన ఇంజెక్షన్ వైద్యులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు నారా లోకేష్. పునర్వికను ఎత్తుకుని లాలించారు. వందేళ్లు చల్లగా ఉండు తల్లీ అంటూ దీవించారు. తమకుమార్తె ప్రాణాలను కాపాడినలోకేష్‌కు, తెలుగు ప్రజలకు పునర్విక తల్లిదండ్రులు కృతజ్ఞతతో ధన్యవాదాలు తెలియజేశారు.

# మహిళలకు క్షమాపణ చెబుతున్నా..

>> ఎప్పటికీ మర్చిపోదని 21వ శతాబ్ధపు మహిళలు చూస్తూ ఉపేక్షించరని పేర్కొన్నారు. రిజర్వేషన్లు అడ్డుకున్నవారికి ఎప్పటికైనా శిక్ష తప్పదన్నారు. పార్లమెంట్ సాక్షిగా మహిళా లోకాన్ని అవమానించారని, నారీశక్తి ఎవరి హక్కులనూ లాక్కునేది కాదన్నారు. 40 ఏళ్లుగా ఆగిపోయిన మహిళా రిజర్వేషన్లను 2029 నుంచే అమల్లోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం కృషిచేసిందని, దేశంలోని సగం జనాభాకు అధికారం కల్పించకుండా పవిత్ర ప్రయత్నాన్ని దెబ్బకొట్టారన్నారు. ఉత్తర, దక్షిణ, ఈశాన్య ప్రాంతం అనే తేడా లేకుండా ప్రతి మహిళకు మరింత శక్తి కల్పించాలని తాము చూశామని చిన్న, పెద్ద రాష్ట్రం అనే తేడా లేకుండా అందరికీ సమాన హక్కులు కల్పించే ఆలోచన చేశామని మోడీ అన్నారు. కాంగ్రెస్, వారి మిత్రపక్షాలు భ్రూణ హత్యకు పాల్పడ్డాయని వారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. మహిళా రిజర్వేషన్లపై విద్వేషం ప్రదర్శిస్తూనే ఉన్నారని మహిళా రిజర్వేషన్లు తెచ్చే ప్రయత్నం ఎప్పుడు చేసినా కాంగ్రెస్ అడ్డుకుంటూనే ఉందని మండిపడ్డారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ పాపాలు కడిగేసుకుంటుందని అనుకున్నామని కానీ అలా జరగలేదని అన్నారు. దేశంలో కాంగ్రెస్ తన ఉనికి కోల్పోతున్నదని, తన ఉనికి కాపాడుకునేందుకు ప్రాంతీయ పార్టీలతో చేతులు కలిపిందన్నారు. ట్రిపుల్ తలాఖ్, ఆర్టికల్ 370 రద్దునువ్యతిరేకించారు, అక్రమ వలసదారులను వెనక్కి పంపే ప్రయత్నాలు చేశారు. నక్సలిజాన్ని అంతంచేసే ప్రయత్నాలను అడ్డుకున్నారు. దేశం కోసం చేసే మంచిపనులను అడ్డుకున్నారుని మండిపడ్డారు. సంస్కరణలను కాంగ్రెస్ అడ్డుకుంటూ రావడంతోనే అనేక దేశాలు భారత్ కంటే ముందుకు దూసుకెళ్లాయన్నారు. అడ్డుపుల్లలు వేయడమే కాంగ్రెస్ సిద్ధాంతమని, పొరుగుదేశాలతో ఉన్న వివాదాలను పరిష్కరించకుండా కాంగ్రెస్ అవే కొనసాగిస్తూ దేశానికి తీరని నష్టం చేసిందన్నారు. ఇది ఒక బిల్లుకు సంబంధించిన అంశం కాదని కాంగ్రెస్ విధానం, వ్యవహారశైలికి సంబంధించిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, టీఎంసీ, డీఎంకేలు పదే పదే అదే పనిచేస్తూ వచ్చాయన్నారు. సాంకేతిక అంశాలను సాకుగా చూపుతూ మహిళల అధికారం లాగేసుకుంటున్నారని ప్రధాని అన్నారు. మహిళలకు అధికారం ఇస్తే తమ ఉనికి దెబ్బతింటుందని కుటుంబ వారసత్వ పార్టీలకు భయంపట్టుకుందని మండిపడ్డారు. గ్రామ పంచాయతీల్లో మహిళలు సత్తా చాటారని చట్టసభలకు రావాలని మహిళలు కోరుకున్నారని కానీ కొందరు మాత్రం వారి కలల నిజం కాకుండా చిదిమేసారని మోడీ ఆరోపించారు. కాంగ్రెస్ ఆపార్టీ మిత్రపక్షాలు భ్రూణ హత్యకు పాల్పడ్డాయని ఆరోపించిన ప్రధాని తగిన మూల్యం చెల్లించుకుంటాయన్నారు. కాంగ్రెస్ పార్టీప్రస్తుతం పరాన్నజీవిగా మారిందని, ప్రాంతీయ పార్టీలపైనే ఆధారపడి కొనసాగుతోందని, ఆపార్టీలతో కలిసి ఈ కుట్రచేసిందన్నారు. కాంగ్రెస్ నిజస్వరూపం ప్రజలకు తెలిసిందని అన్నారు. ఎన్డీయే కూటమికి జాతీయ ప్రయోజనాలే సర్వోత్తమమైనవని, అయితే ప్రతిపక్షాలకు పార్టీప్రయోజనాలే సర్వస్వం అయ్యాయని ఎద్దేవాచేసారు. 131 రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం తనకు ఎంతో ఆవేదన కలిగించిందని, విపక్షాలు క్షమించరాని నేరంచేసాయని అన్నారు. దేశానికి కాంగ్రెస్ ఆపార్టీ మిత్రపక్షాలు అత్యంత ప్రమాదకరమని, దేశ అభివృద్ధి సంక్షేమానికి విఘాతం కలిగిస్తాయన్నారు.

## కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాజమండ్రి(నిడదవోలు) - విశాఖపట్నం (దువ్వాడ) 3వ, 4వ రైల్వేలైన్లకు ఆమోదం తెలపడంపై కృతజ్ఞతలు తెలిపిన సీఎం ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై 4.3 కిలోమీటర్ల రైల్వే వంతెనతో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి ప్రయాణ సమయాన్ని కూడా ఆదా చేస్తుందని ట్వీట్ లో పేర్కొన్న ముఖ్యమంత్రిఈ ప్రాజెక్టులు వివిధ ప్రాంతాల్ని అనుసంధానించి ప్రయాణికులకు, సరుకు రవాణాకు దోహదం చేస్తాయన్న ముఖ్యమంత్రిఅన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం లాంటి ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను కలుపుతూ భక్తులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్న ముఖ్యమంత్రి పారిశ్రామిక వృద్ధి, ఓడరేవు ఆధారిత ఆర్థిక వ్యవస్థల అభివృద్ధికి ముఖ్యం అన్న సీఎం స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాధన దిశగా ఈ ప్రాజెక్టులు మరో ముందడుగు అని ట్వీట్ లో పేర్కొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.

## పదవీ విరమణ ప్రయోజనాలు నిలిపివేయడంపై హైకోర్టు ఆగ్రహం

**విజయవావాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** శాఖాపరమైన విచారణ, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్న కారణంతో 79 ఏళ్ల మాజీ ఉద్యోగికి రెండు దశాబ్దాలుగా ఉద్యోగ విరమణ ప్రయోజనాలు నిలిపివేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జీవనాధారం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, భార్యతో పాటు 24 ఏళ్ల కుమారుడు మరణించారని 79 ఏళ్ల వృద్ధుడు దాఖలు చేసిన పిటిషన్‌పై సానుకూలంగా స్పందించింది. ఉద్యోగ విరమణ ప్రయోజనాలను నిలిపివేయడం వ్యక్తి జీవించే హక్కును భంగం కలిగించడమేనని స్పష్టం చేసింది. పెన్షన్ డబ్బు దానం సొమ్ము కాదని, ఉద్యోగి సంపాదించిన హక్కు, ఆయన ఆస్తి అని తేల్చిచెప్పింది. అది గ్రాట్యూటీ లేదా ఎక్స్‌గ్రేషియా కాదని కూడా పేర్కొంది. కేసు వివరాలను పరిశీలించిన హైకోర్టు, 2004లో నమోదైన క్రిమినల్ కేసులో పిటిషనర్‌పై ఇప్పటి వరకు ఆరోపణలు రుజువు కాలేదని గమనించింది. శాఖాపరమైన విచారణలోనూ పిటిషనర్ దోషిగా తేలలేదని, ఈ రెండు విచారణల్లో ఏవిధమైన పురోగతి లేదని పేర్కొంది. 31.8.2006న ఉద్యోగ విరమణ చేసిన అనంతరం కూడా ఆయనకు టెర్మినల్ బెనిఫిట్స్, పెన్షన్ నిలిపివేయడం సముచితం కాదంది.

ఎనిమిది వారాల్లోపు బకాయిలతో సహా అన్ని ఉద్యోగ విరమణ ప్రయోజనాలు చెల్లించాలని దేవదాయశాఖ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ నూనెపల్లి హరినాథ్ తీర్పు వెలువరించారు. తిరుపతికి చెందిన బి రామయ్య, హథీరామ్‌జీ మఠంలో సూపరింటెండెంటుగా పనిచేశారు. 2004లో మఠం పాలనాధికారి ఫిర్యాదు మేరకు ఆయనపై క్రిమినల్ కేసు నమోదు కాగా, అనంతరం సస్పెన్షన్‌కు గురయ్యారు. అదే సమయంలో శాఖాపరమైన విచారణ కూడా ప్రారంభమైంది. ఈ రెండు విచారణలు పెండింగ్‌లో ఉండగానే 2006లో ఆయన ఉద్యోగ విరమణ చేశారు. అయితే కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్న కారణంతో ఆయనకు టెర్మినల్ బెనిఫిట్స్, పెన్షన్ చెల్లింపులు నిలిపివేశారు. ఈలోగా ఆయన భార్య, కుమారుడు మరణించడంతో జీవనం కష్టమైంది. దీంతో 2014లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తుది విచారణ జరిపిన న్యాయస్థానం, రామయ్యకు చెల్లించాల్సిన అన్ని ఉద్యోగ విరమణ ప్రయోజనాలను బకాయిలతో సహా చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పు చెప్పింది.

# ఒంటిమిట్టలో 45$^{0}$ఉష్ణోగ్రతలు

>> ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో ఆది, సోమవారాల్లో మన్యం, అల్లూరి, పోలవరం, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పని చేసే రైతులు,పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు. శనివారం గరిష్ఠంగా కడపజిల్లా ఒంటిమిట్టలో 45డిగ్రీలు నమోదైందని తెలిపారు. 244 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు ఎపిఎస్డీఎంఎ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. అలాగే అల్లూరి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడినట్లు తెలిపారు. ఆదివారం పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైందుకు అవకాశం ఉందన్నారు. రేపు తీవ్ర వడగాల్పులు వీచే మండలాలు విజయనగరం జిల్లాలో బాడంగి, బొబ్బిలి, దత్తిరాజేరు, మెంటాడ, రామభద్రాపురం, తెర్లాం, వంగర మండలాలు,..పార్వతీపురంమన్యం జిల్లాలో బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీ మ్మపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, సీతంపేట, సీతానగరం, వీరఘట్టం మండలాల్లో తీవ్ర వడగాలులు.. ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. విజయనగరం 7, మన్యం 1, అల్లూరి 2, పోలవరం 7, కాకినాడ 3, తూర్పుగోదావరి 4, ఏలూరు వేలేరుపాడు మండలాల్లో (25) వడగాల్పులు వీచేందుకు అవకాశం ఉందన్నారు. శనివారం కడప జిల్లా ఒంటిమిట్టలో 45 డిగ్రీలు, కర్నూలు జిల్లా గూడూరు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 44.3 డిగ్రీలు,అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 44.1 డిగ్రీలు తిరుపతి జిల్లా వరదయ్యపాలెం 43.5 డిగ్రీలు మార్కాపురం జిల్లా కొమరోలులో 43 డిగ్రీలు , కాకినాడ జిల్లా కరప, శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో 42.9 డిగ్రీలు ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 42.5 డిగ్రీలు,పల్నాడు(జి) గురజాలలో 42.3 డిగ్రీలు,అన్నమయ్య జిల్లా నూలివీడులో 41.9 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్తపడాలని, గుండెసంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

## శాంతిని మరో రెండు రోజులు కస్టడీ కోరిన ఎసిబి

**విజయవాడ,ఏప్రిల్18,ప్రభాతవార్తప్రతినిధి:**దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి ని మరో రెండు రోజులు కస్టడీ ఇవ్వాలని ఏసీబీ అధికారులు సంబంధిత కోర్టును అడిగారు. ఆదాయానికి మించి ఆస్తులన్నాయనే నేపథ్యంలో ఏసీబీ గుంటూరు, విజయవాడల్లోని ఆమె, రక్త సంబంధీకుల ఆస్తులని విచారణలో శాంతి తెలిపినట్లు సమాచారం. ఆఖరికి ఆమె స్వయంగా తన వ్యక్తిగత బ్యాంకు లాకరు చూపించి ఆస్తులు వివరించారంటున్నారు. ఏ తమన ఆస్తులపైన అభియోగాలు చేసినా అవి నిజం కాదని వాటికి ఆధారాలున్నాయని శాంతి వాదించారంటున్నారు. తనను రిమాండ్‌లో ఉంచి కస్టడీకి విచారణ పిలవడంపై శాంతి నఅసహనం వ్యక్తం చేసారంటున్నారు. ఈ క్రమంలో ఏసీబీ ఆమెను మరో రెండు రోజులు కస్టడీకి కోరింది.

# హార్ముజ్ మళ్లీ మూసివేత

## ఇచ్చిన హామీలను విస్మరించిన ట్రంప్: ఇరాన్



**టెహ్రాన్, ఏప్రిల్ 18:** ప్రపంచానికి ఇరాన్ మళ్లీ షాకిచ్చింది. హార్ముజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ప్రకటించిన కొన్ని గంటల్లోనే తిరిగి మూసేసింది. అమెరికా అనుసరిస్తున్న విధానమే దీనికి కారణమని ఆరోపించింది. హార్ముజ్ జలసంధిని మూసేస్తున్నట్లు ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) ప్రకటించింది. ఇటీవల హార్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించిన సంగతి తెలిసిందే. అయితే, ఇరాన్ హార్ముజ్ జలసంధిని తెరిచినప్పటికీ, అమెరికా మాత్రం ఈ దిగ్బంధనాన్ని తొలగించలేదు. పైగా తమ నౌకల్ని అమెరికా అడ్డుకుంటోందని ఇరాన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో హార్ముజ్ జలసంధిని తిరిగి మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దిగ్బంధనం పేరుతో సముద్రంపై అమెరికా దోపిడీ, దౌర్జన్యానికి పాల్పడుతోందని ఇరాన్ ఆరోపించింది. అమెరికాతో కుదిరిన ఒప్పందం మేరకు హార్ముజ్‌ను తెరిచామని, అయితే, ఈ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ విమర్శించింది. హార్ముజ్‌ను ఇరాన్ తిరిగి మూసేయడంతో మళ్లీ గతంలోలాగే ఇరాన్ సెంట్రల్ మిలిటరీ కమాండ్ పూర్తి పర్యవేక్షణ చేపడుతోంది. సముద్ర జలాలపై గట్టి నిఘా ఉంటుందని తెలిపింది. ఇరాన్ నిర్ణయంతో ఈ జలసంధి నుంచి నౌకల రవాణా నెమ్మదించింది. హార్ముజ్‌ను అమెరికా దిగ్బంధించినంత కాలం తాము జలసంధిని మూసివేసి ఉంచుతామని ఇరాన్ ప్రకటించింది. అయితే, ఈ విషయంలో అమెరికా వైఖరి భిన్నంగా ఉంది. తమరో ఒప్పందం కుదుర్చుకునే వరకు హార్ముజ్ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇదే సమయంలో ఇరాన్ తమ దేశంలోని పలు ఎయిర్‌పోర్టులను తిరిగి తెరుస్తున్నట్లు ప్రకటించింది. తూర్పు మార్గంలో అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అనుగుణంగా అనుమతులిస్తున్నట్లు ఇరాన్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ ప్రకటించింది. హార్ముజ్‌కు సంబంధించి.. దీన్ని ఇంకొంతకాలం ఇలాగే మూసి ఉంచితే ప్రపంచం మళ్లీ సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయం. చమురు ధరలు కూడా భారీగా పెరుగుతాయి.

# దేశ సమగ్రతను కాపాడిన ప్రతిపక్షాలు

## సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** నిన్న పార్లమెంట్లో ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా మోడీ, అమిత్ షా కుట్రలను తిప్పికొట్టి, భారతదేశ ప్రజాస్వామ్యాన్ని, దేశ సమగ్రతను కాపాడాయని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. నిన్న పార్లమెంట్లో, ప్రత్యేకంగా లోక్ సభలో బిల్లు వీగిపోవడం అనేది నిజంగా భారత దేశంలో ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవడానికి వచ్చిన అవకాశంగా అందరూ భావించాల్సి ఉంది. నరేంద్ర మోడీ, అమిత్ షాలు అత్యంత ప్రమాదకరమైన గేమ్ ఆడినట్లుగా గోచరిస్తున్నది. మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపచేసుకొని భారత దేశంలో అసమానతలకు పెద్దపీట వేసేందుకు ప్రయత్నించారు. తమ స్వార్థ రాజకీయాల కోసం, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం ఈ ప్రయత్నం చేశారు. ఒకవైపు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశం పేరుతో ఈ చర్య చేపట్టడం దుర్మార్గం. నిన్న లోక్సభలో అమిత్ షా డీలిమిటేషన్ బిల్లు మహిళా బిల్లు రెండు ముఖ్యమేనని మాట్లాడారు. ప్రతిపక్షాన్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. బిల్లు ఆమోదం కాకపోతే ప్రతిపక్షాలను బద్నాం చేయాలని అమిత్ షా చూశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉత్తరాది రాష్ట్రాలలో దాదాపు 78శాతం సీట్లు పెరుగుతాయి. నార్త్ ఈస్ట్, సౌత్ ఇండియా ప్రాంతాల్లో 33 శాతమే పెరుగుతాయి. ఎక్కడైతే బిజెపి సీట్లు గెలిచే అవకాశం ఉన్నదో ఆయా ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లుభారీగా పెరుగుతాయి. పైగా దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలుగకుండా 50సీట్లు పెంచుతా మని కేవలం నోటిమాట గానే అమిత్ షా చెబుతున్నారు. భారతదేశ ఎన్నికల మ్యాపును మార్చడానికి, పొలిటికల్ మ్యాప్‌ని మార్చడానికి మోడీ ప్రభుత్వం మహిళలను అడ్డుపెట్టుకొని ఒక తీవ్రమైన ప్రయత్నం చేసింది. 2023లో అన్నిపక్షాలతో ఆమోదం పొందిన మహిళ బిల్లును అమలు చేయకుండా, ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లును మహిళా బిల్లుతో కలిపి ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నాం. డీలిమిటేషన్ ద్వారా పెరిగిన స్థానాలలో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని బిజెపి చేసిన వితండవాదాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# మరో 2 రైల్వే లైన్లు

>> ప్రభావం గణనీయంగా తగ్గనున్నట్లు కేంద్రం అంచనావేసినట్లు అశ్విని వైష్ణవ్ వివరించారు.

**11 మార్గాల్లో కొత్త లైన్ల నిర్మాణం :** ఇప్పటివరకు రైలు అనుసంధానం లేని 11 మార్గాల్లో కొత్త లైన్ల నిర్మాణంపై రైల్వేశాఖ దృష్టిపెట్టింది. వీటికి గతంలోనే సర్వేలు చేయగా, రైల్వే బోర్డు ఆమోదం నేపథ్యంలో డీపీఆర్‌లు రూపొందించారు. కొన్నిచోట్ల బైపాస్ లైన్లు, రైల్ ఓవర్ రైల్ వంతెనల నిర్మాణంపైనా దృష్టిపెట్టారు. హైదరాబాద్‌బెంగళూరు మధ్య నిర్మించే హైస్పీడ్ కారిడార్‌లో ఏపీలో 300 కి.మీ., హైదరాబాద్ చెన్నై హైస్పీడ్ కారిడార్‌లో ఏపీలోని 464 కి.మీ.కు డీపీఆర్‌లపై దృష్టిపెట్టారు.

**సరకు రవాణాకు మూడు, నాలుగో లైన్లు :** విజయవాడచెన్నై, విజయవాడహైదరాబాద్, విజయవాడవిశాఖపట్నం మార్గాల్లో సరకు రవాణా రైళ్ల రాకపోకలు అంతకంతకు పెరుగుతున్నాయి. దీంతో ఈ మార్గాల్లో మూడు, నాలుగో లైన్ల నిర్మాణంపై దృష్టిపెట్టారు. ఇప్పటికే కొన్ని మార్గాల్లో మూడో లైను నిర్మిస్తున్నారు. ఒడిశా వైపు నుంచి కొత్తవలస మీదుగా విశాఖపట్నానికి బొగ్గు, వివిధ ఖనిజాలు రవాణాచేసే రైళ్లు భారీగా ఉంటున్నాయి. దీంతో విశాఖపట్నంలోని సింహాచలం నార్త్ నుంచి కొత్తవలస వరకు ఐదు, ఆరో లైన్ల నిర్మాణానికి డీపీఆర్‌లు రూపొందించారు.

ప్రాజెక్టులో భాగంగా గోదావరి నది మీద 4.3 కిలోమీటర్ల రైలు వంతెన, 2.67 కిలోమీటర్ల వయాడక్ట్, 3 బైపాస్‌లు నిర్మాణం జరగనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. తూర్పు తీరంలోని విశాఖ, గంగవరం, మచిలీపట్నం, కాకినాడ ప్రధాన పోర్టులకు అనుసంధానం పెరుగుతుందని వివరించారు. అన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం వంటి కీలక ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలకు ఎక్కువ అనుసంధానం పెరుగుతుందని స్పష్టం చేశారు. రోడ్డు రవాణాతో పోలిస్తే ఏటా సుమారు రూ.1,150 కోట్ల మేర ఆదా అవుతుందని, డీజిల్ కాలుష్య ప్రభావం గణనీయంగా తగ్గనున్నట్లు కేంద్రం అంచనా వేసినట్లు అశ్విని వైష్ణవ్ వివరించారు.

## సదవకాశాన్ని దూరం చేశారు: డి.సిఎం పవన్

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** చట్ట సభల్లో మహిళా శక్తిని పెంపొందించే సదవకాశాన్ని దూరం చేశారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు ఆమోదించి ఉంటే వారికీ గౌరవం దక్కేదని పవన్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లోనైనా మహిళా శక్తికి చట్ట సభల్లో సముచిత స్థానం దక్కుతుందని ఆశిస్తున్నట్లు పవన్ అభిప్రాయపడ్డారు. ఎన్డీయే భాగస్వామ్య పార్టీగా బిల్లులను స్వాగతిస్తున్నామని మరోసారి తెలిపారు. బిల్లు ఆమోదం పొంది ఉంటే భారత మహిళలు సంతోషించి ఉండేవారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశ అభ్యున్నతి కన్నా రాజకీయ ప్రయోజనాలే ముఖ్యంగా విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

# ఐఎఎస్ అధికారుల బదిలీ

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలనలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. నలుగురు ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధి (ఐటీడీఏ), జిల్లా పరిపాలనలో సమర్థత పెంచే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా చేపట్టిన ఈ బదిలీల్లో యువ ఐఎఎస్ అధికారులకు కీలకమైన ఐటీడీఏ , జాయింట్ కలెక్టర్ బాధ్యతలను అప్పగించింది. సురపాటి ప్రశాంత్ కుమార్‌కు పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కొత్త బాధ్యత అప్పగించింది. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా .అదనపు బాధ్యత నిర్వహించనున్నారు. వైభోమ్ నిడియా దేవికి కొత్త బాధ్యత ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్. జిల్లా పరిపాలనలో కీలకమైన రెవెన్యూ, అభివృద్ధి పనులను ఈమె పర్యవేక్షించనున్నారు. బచ్చు స్మరణ్ రాజ్ బదిలీ చేసి ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖలో (రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. తదుపరి పోస్టింగ్ ఇచ్చే వరకు ఆయన జీఏడీ పరిధిలో ఉంటారు. వైశాలికి కొత్త బాధ్య తను అప్పగించింది. పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్. వెనుకబడిన గిరిజన ప్రాంతాల అభివృద్ధి బాధ్యతను ప్రభు త్వం ఆమెకు అప్పగించింది. శుభమ్ నోఖ్వా ల్‌కు ప్రభుత్వం కొత్త బాధ్యత అప్పగిం చింది. చింతూరు ఐటీడీఏ (ఐటీడీఏ) ప్రాజెక్ట్ ఆఫీసర్. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన దృష్టి సారించనున్నారు.

# పదేళ్లు కౌలు

>> రైతులు పాల్గొన్నారు. ఈ భేటీలో కౌలు పెంపు, రుణమాఫీ వంటి అంశాలపై వారి డిమాండ్లను చంద్రబాబు ప్రధానంగా ప్రస్తావించారు. దానిపై పురపాలకశాఖ మంత్రి నారాయణ, తాడికొండ, పెదకూరపాడు ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, భాష్యం ప్రవీణ్‌లతో సీఎం చంద్రబాబు విడివిడిగా సమావేశమై చర్చించారు. కౌలు పెంపు, రుణమాఫీ ప్రకటన చేయడంతో రైతుల చప్పట్లతో వారి హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. తమకు అభివృద్ధి చేసిన స్థలాల్ని ఇన్నర్ రింగ్ రోడ్డుకు లోపల ఇవ్వాలని కర్లపూడి గ్రామస్థులు కోరారు.

## వారం - వర్జ్యం

19-04-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, అశ్విని కార్తె
విదియ ఉ.10.49
భరణి ఉ.7.10, కృత్తిక తె.4.35
వర్జ్యం : సా.5.52-రా.7.18
దు.సా.4.39-సా.5.29
శుభసమయం: ఉ.9.00-ఉ.10.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:**రావలసిన మొత్తాలు క్లయిములు చెల్లించవలసిన వద్దులు పరిష్కారమవుతాయి. మిత్రుల కలయిక.

**వృషభం:** పిల్లల విద్య, వివాహ, ఉద్యోగ విషయాలలో శుభ పరిణామాలు కనిపిస్తాయి. వ్యాపారాలలో అనుకూలం.

**మిథునం:**అనేక లాభదాయక వ్యవహారములు మీకు అనుకూలముగా మారుట వలన సాటివారికి అసూయ పెరుగుతుంది.

**కర్కాటకం:**సహోదర, సహోదరీ వర్గీయులు కొన్ని కారణముల వలన దూరంగా ఉంటారు. ప్రమోషన్లుకు అవకాశం.

**సింహం:**స్వజనుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. కాంట్రాక్టులు కలిసి వస్తాయి. బంధువుల కలయిక.

**కన్య:** విద్యా సారస్వత, రాజకీయ రంగాలలోని వారికి వివాదాలు రావచ్చు. విక్రయ ప్రదర్శనలు, అగ్రిమెంటు కలిసి వస్తాయి. వస్త్రలాభం.

**తుల :** సందర్భోచితంగా వ్యవరించి కార్యక్రమాలను సానుకూల పరచుకోగలుగుతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**వృశ్చికం:** పెద్ద స్థాయిని కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**ధనుస్సు:** అన్నీ అనుకూలముగా వున్నా తెలియని చికాకు ఉంటుంది. సోదరుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** ఇచ్చిన ఋణములు తిరిగి వసూలు అవుట కష్టమవుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**కుంభం:** మిత్రులతో చేయు నూతన కార్యక్రమములు ఉత్సాహకరముగా, లాభకరముగా వుంటాయి. ధనలాభం.

**మీనం:**మీరు చెబితేనే గాని అభివృద్ధి పనులు మీ కార్యాలయములోని వారికి తెలియవు. విందు, వినోదాలు పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

19-04Pg3fVS.qxd:19-04Pg3fVS.qxd 1/1/02 6:03 AM Page 1





19-4pg4.qxd:19-4pg4.qxd 1/1/02 6:14 AM Page 1



ప్రకృతి సిద్ధంగా రావాల్సిన కాలాలు వెనకబడిపోతున్నాయి. వాతావరణంలో సంభవిస్తున్న అనూహ్యమార్పులు సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి. నిన్నమొన్నటివరకు చలితో వణికిన ప్రజలు, ఒక్కసారిగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలను చూసి ఆందోళన చెందుతున్నారు. ఈఏడాది ప్రారంభంలోనే శీతాకాలం తన ప్రభావాన్ని కోల్పోయి, ఫిబ్రవరి నుండే వేసవి ఛాయలు మొదలయ్యాయి. గత 11 ఏళ్లుగా దేశంలో ఉష్ణోగ్రతలు వరుసగా రికార్డుస్థాయిలో నమోదవుతుండటం వాతావరణ మార్పుల తీవ్రతకు అద్దం పడుతోంది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడినఎల్‌నినో ప్రభావం వాతావరణాన్ని చల్లబరచాల్సి ఉన్నప్పటికీ, గ్లోబల్ వార్మింగ్ ఆ ప్రభావాన్ని పూర్తిగా అధిగమించింది. సముద్రపు ఉష్ణోగ్రతలు కూడా ఈ నెలకుగాను ప్రపంచవ్యాప్తంగా రెండవ అత్యంతవేడిగా నమోదయ్యాయి, ఫలితంగా ఫిబ్రవరిలోనే ఎండతీవ్రత పెరిగి, అనేక రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 5నుండి 7డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. వర్షపాతం విషయానికి వస్తే, ఫిబ్రవరిలో ఏకంగా 81శాతం లోటు నమోదైంది. కేవలం ఎండ మాత్రమేకాకుండా, గాలిలో తేమశాతం పెరగడంవల్ల వెట్‌బల్బ్‌టెంపరేచర్ స్థాయిలు పెరుగుతున్నాయి. సాధారణంగా గాలిపొడిగా ఉన్నప్పుడు ఎండను తట్టుకోవచ్చు.కానీ, తేమపెరిగితే చెమట ద్వారా శరీరం చల్లబడే శక్తిని కోల్పోతుంది. దీనివల్ల వడదెబ్బ, తీవ్రమైన డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ముంబై వంటి తీరప్రాంత నగరాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. మార్చి ప్రారంభంలోనే ముంబైలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం దీనికి నిదర్శనం. ఇప్పుడది 45 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ పట్ల ఇప్పటికైనా అప్రమత్తం కాకపోతే, భావితరాలకు మండుతున్న భూమిని కానుకగా ఇవ్వాల్సి వస్తుంది.

# నిప్పుల కొలిమిలా తెలుగు రాష్ట్రాలు

సిహెచ్ వి వి రఘుబాబు

ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వేసవిలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణంగా మే నెలలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ ఈసారి ఏప్రిల్ లోనే ఎండలు ముదిరాయి. ఇండియాలో అత్యధిక ఉష్ణోగ్రతలు రాజస్థాన్ థార్ ఎడారి ప్రాంతంలో నమోదవుతుంటాయి. ఇక్కడ 50 డిగ్రీలకు పైగా ఉంటాయి. 2024లో ఢిల్లీలోని ముంగేష్‌పూర్‌లో 52.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డైనట్లు వార్తలు వచ్చాయి. రాజస్థాన్‌లోని ఫలోడిలో 19 మే 2016న 51 డిగ్రీల ఉష్ణోగ్రత అత్యధిక రికార్డుగా పరిగణించబడుతోంది. అయితే ఈ రికార్డును ఈసారి తెలుగు రాష్ట్రాలు బద్దలుకొడతాయా అనే స్థాయిలో టెంపరేచర్స్ నమోదవుతున్నాయి. ఎండలు, వడగాలుల విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు పోటీ పడుతున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఒకచోటుకు మించి మరోచోట అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దేశంలో ఎండల తీవ్రత పెరిగి పలు చోట్ల 44 డిగ్రీల నుండి 45డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మహారాష్ట్రలోని అకోలా, కర్ణాటకలోని కలబురగి ప్రాంతాల్లో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భానుడు తీవ్రరూపం దాల్చుతున్నాడు. రెండు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 45డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ వేడితో పాటు వడగాల్పులు, ఉక్కబోతతో జనాలు భయపడిపోతున్నారు. రానున్న కొద్ది రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఒంటిమిట్టలో 45 డిగ్రీలు, నంద్యాల జిల్లా సంజామలలో 44.2 డిగ్రీలు, తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 43.8డిగ్రీలు వంటి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల నుండి 48 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని, ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా ఉష్ణోగ్రత రికార్డవ్వగా, 200కు పైగా మండలాల్లో 43 డిగ్రీలకు పైగా ఎండలు మండుతున్నాయి. రాబోయే రోజుల్లో 46మండలాల్లో తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం, పోలవరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 301 మండలాల్లో తీవ్ర వడగాల్పులు



వీస్తాయని హెచ్చరికలు జారీ చేసింది. ఇక 55 మండలాల్లో సాధారణ వడగాలులు ఉంటాయని తెలిపింది. ఇక పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు,రాయలసీమ, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 43 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తాజాగా అధికారులు హెచ్చరించారు. ఇక తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలునగరాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 నుంచి 44 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. అత్యధికంగా వరంగల్ జిల్లాలో 44 డిగ్రీలు నిర్మల్ జిల్లా తానూరులో 43.5 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో 43.5 డిగ్రీలు నమోదయ్యాయి. ఇక రాబోయే రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని కొన్ని జిల్లాల్లో ప్రస్తుత ఉష్ణోగ్రతల కంటే 2,3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వివిధ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయబడింది. ఎండల తీవ్రత క్రమంగా పెరగడంతో జిల్లాల్లో వడగాలులు నమోదయ్యాయి. మల్కాజిగిరి (మేడిపల్లి), దుండిగల్ (గండిమైసమ్మ, బాచుపల్లి), సంగారెడ్డి (హత్నూర, వట్పల్లి, సిర్గాపూర్, జిన్నారం, అమీన్‌పూర్), సిద్దిపేట (అక్కన్నపేట, సిద్దిపేట గ్రామీణం, అర్బన్) ,రంగారెడ్డి (కందుకూరు, యాచారం, గండిపేట, షాబాద్), కామారెడ్డి (పాల్వంచ,దోమకొండ), నల్గొండ (దేవరకొండ, అడవి దేవులపల్లి, చింతపల్లి), మెదక్ (కుల్చారం, చేగుంట), నిజామాబాద్ (బాల్కొండ, ముప్కల్), జిల్లాల్లో హీట్ వేవ్స్ నమోదయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో 44.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠఉష్ణోగ్రత నమోదయింది. ఈఏడాదిలో ఇంతవరకు ఇదే రికార్డు స్థాయిలో నమోదుకావడంగమనార్హం. మరో 9 జిల్లాల్లో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేటలో 44 డిగ్రీల సెల్సియస్ దాటింది. 8 జిల్లాల్లో 43 నుంచి 43.8 డిగ్రీల మధ్య 11 జిల్లాల్లో 42 నుంచి 42.9 మధ్య, 4 జిల్లాల్లో 41.541.8 మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఈమేరకు జిల్లాలకు తక్షణ చర్యలకు ఆదేశాలను జారీ చేసింది. జిల్లా కలెక్టర్లను నోడల్ ఆఫీసర్లుగా నియమిస్తూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.దానకిశోర్ ఆదేశాలు జారీచేశారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి వైద్య, రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, నగరపాలక, మిషన్ భగీరథ, అగ్నిమాపక,కార్మిక తదితర శాఖల ఆధ్వర్యంలో ఉపశమన చర్యలు చేపట్టాలని ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ఉమ్మడి ఖమ్మం, నిజామాబాద్,వరంగల్, నల్గొండ జిల్లాల్లో వడగాలులతో, సంబంధిత రుగ్మతలతో 10 మందికిపైగా మృత్యువాత పడ్డారు.రానున్న 6రోజులు మరింత అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.30వరకు హీట్‌వేవ్స్ వీచే అవకాశాలున్నాయి. ఈ హీట్ వేవ్స్ నమోదైన ప్రాంతాలను రెడ్ అలెర్ట్ జోన్లుగా పరిగణించాలని నిర్ణయించారు. ఈ ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకునేవిధంగా ప్రభుత్వ శాఖలు దృష్టికేంద్రీకరించాల్సి ఉంటుంది. ప్రధానంగా పాఠశాలల పనివేళలు కుదించాలి. లేదా తరగతులను రద్దు చేయడం ఉత్తమం. విద్యార్థులు సమయానికి నీళ్లు తాగేలా విద్యాలయాల్లో నీటి గంటలు కొట్టాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, చల్లదనం విషయంలో చర్యలు తీసుకునేవిధంగా విద్యాశాఖను అప్రమత్తం చేయాలని విపత్తుల నిర్వహణశాఖ కలెక్టర్లను ఆదేశించింది. దీంతోపాటు పలు చర్యలను సూచించింది. పలుచోట్ల కూలింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలి. బస్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో షెడ్లను నిర్మించాలి. వడగాలుల ముప్పున్న ప్రాంతాలు, అధిక ఉష్ణోగ్రత నమోదయ్యే చోట్ల చలివేంద్రాలు (మంచినీళ్లు), మజ్జిగ పంపిణీని చేపట్టాలి. వడగాలులకు సంబంధించిన కేసులు హాస్పిటల్‌లో నమోదైతే ప్రభుత్వానికి వెంటనే సమాచారం ఇవ్వాలి. బాధితులకు ఐస్‌ప్యాక్స్, కూలర్లు, ఏసీలు ఏర్పాటు చేసి ఉపశమనం కల్పించాలి.ఎండవేళ కార్మికులు విశ్రాంతి తీసుకునేలా చర్యలు చేపట్టాలి. భవన నిర్మాణాలు,ఇతర నిర్మాణ ప్రదేశాల్లో చల్లని నీళ్లు, నీడప్రాంతాలను ఏర్పాటు చేయాలి.వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు హీట్‌వేవ్స్ బారినపడే ప్రమాదం ఉన్నందున స్త్రీ,శిశు సంక్షేమ, వైద్య శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాలని విపత్తు నిర్వహణశాఖ అప్ర మత్తం చేసింది. ఇదే సమయంలో తెలంగాణ జిల్లాలకువర్షాల పైన అలర్ట్స్ జారీఅయ్యాయి. దక్షిణ తెలంగాణలోనిజిల్లాలపై వర్ష ప్రభావం ఎక్కువగా ఉండనుంది. జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్, నల్గొండ,రంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడాఉరుములు, మెరు పులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈజిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లోఅలర్ట్ జారీచేసింది. రానున్న ఆరు రోజుల పాటు అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని హైదరాబాద్ వాతావరణశాఖ స్పష్టం చేసింది.19వ తేదీన ఖమ్మం, మెదక్, జగిత్యాల, ములుగు, కామారెడ్డి, భద్రాద్రికొత్తగూడెం, భూపాలపల్లి జిల్లాల్లో వర్షాలు పడనుండగా 20న నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారా బాద్, కరీంనగర్ జిల్లాల్లో వానలు పడతాయని అంచనా వేసింది. మొత్తంగా ఈ ఏడాది రోహిణీ కార్తె రాకుండానే భానుడి నిప్పుల వర్షానికి

బీహార్

ఎన్నో యేళ్ల కల మొత్తానికి ఫలించింది. మూడున్నర దశాబ్దాల క్రితం జరిగిన ఒక పరాభవం.. ఎట్టకేలకు అధికార పీఠాన్ని అందించింది.బిజెపి ఎంతో వ్యూహాత్మకంగా తన 'సమ్రాట్టు'ను అందలంపై నిలిపింది. ఒకప్పుడు బీహార్ అనగానే గుర్తొచ్చే పేరు లాలూయే. ఆయన హవా సాగిన కాలంలో బిజెపి ఎన్నో ఎదురు దెబ్బలు తింది. 1990 అక్టోబర్‌లో అద్వానీ రథయాత్రతో దేశమంతా సంచలనం సృష్టిస్తున్నపుడు ఆ యాత్రను అడ్డుకొనడానికి లాలూ అద్వానీ అరెస్టుకు ఆదేశించి అంత సంచలనాన్నీ సృష్టించారు. అది మొదలు బీహార్‌లో పట్టు పెంచుకొనడానికి ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేసింది బిజెపి. స్థాన బలాన్ని క్రమంగా పెంచుకుంటూ వచ్చింది. తొలుత నితీష్ జెడియుతో పొత్తు కుదుర్చుకోవడం ద్వారా వేళ్లను విస్తరించిన బిజెపి ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి సీటునే కైవసం చేసుకొంది. అనారోగ్య కారణాలు కావొచ్చు,లేక ఇతరేతర ప్రయోజనాలు కావొచ్చు. నితీష్ సిఎం పదవి త్యజించడానికి నిర్ణయించడం బిజెపికి బాగా కలిసి వచ్చింది. ఆ నిర్ణయం ఆయన వ్యక్తిగతంగా తీసుకున్నదా, లేక ఒత్తిడులకు తలొగ్గారా అన్నది వేరే విషయం. ఇప్పటికే ఆయన ఓ పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అనేక సార్లు రాజీనామాలు చేసి పొత్తులు మార్చారు,అధికారం కొనసాగించారు.ఎన్నిరంగులు మార్చినా అధికార హంగు జారకుండా జాగ్రత్త పడ్డారు. అందుకు ఆయన అనుసరించే వ్యూహాలు లాలూ వంటి ప్రత్యర్థులను సైతం ఆశ్చర్యపరిచేవి. తన అధికారం నిలుపుకొంటూనే,బిజెపితో పొత్తుతో ఆ పార్టీ బలపడడానికి కూడా ఆయనే దారులు వేశారు. ఇప్పుడు పూర్తిగా అధికారాన్ని అప్పగించి తాను రాజ్యసభలో 'పెద్దరికం' ప్రదర్శించడానికివెళ్లారు. అద్వానీకి జరిగిన అవమానం తర్వాత నుంచి బిజెపి చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తూ క్రమంగా రాష్ట్రమంతా తన బలాన్ని పెంచుకొంది.పార్టీ గత మూడున్నర దశాబ్దాలలో పెంచుకొన్న ఓట్ల శాతం చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. 1990లో కేవలం 11శాతం ఉన్న ఓట్లు 2025 నాటికి 20శాతానికి పెరిగాయంటే చిన్నవిషయం కాదు. 2015లో 24 శాతం దాకా కూడా వెళ్లి

# 'కమలం' కమతం!

ఎ.వి.వి ప్రసాద్

తర్వాత కొంత మేరతగ్గి, మళ్లీ పెరిగాయి.2020లో ఓట్లు19శాతానికి తగ్గినా,సీట్లు74కు చేరాయి. బీహార్ బిజెపి చరిత్రలో ఇది కీలక పరిణామం. క్రమంగా లాలూ ఆర్జేడీ బలహీనపడడం బిజెపి పరిధిని బాగా పెంచింది.గత బుధవారం (14, ఏప్రిల్) ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన సమ్రాట్ చౌధరి కూడా అప్పట్లో ఆర్జేడీలోనే రాజకీయ జీవితం ఆరంభించారు. తర్వాతనితీష్ నాయకత్వంలోని జెడియులోకి, ఆ తర్వాత బిజెపిలోకి వలస బాట పట్టారు. ఈ మధ్యలో ఆయన ఏ పార్టీలోఉన్నా కీలకమైన పదవుల్లోనే కొనసాగడం గమనించవలసిన అంశం. ఆర్జేడీ హయాంలో మంత్రిగా ఉన్న ఆయన నితీష్ పంచన చేరాక డిప్యూటీ సీఎం అయ్యారు. 2014 లో బిజెపిలోకి వచ్చిన తర్వాత కొంత కాలానికి పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు స్వీకరించి చక్రం తిప్పడం మొదలు పెట్టారు. బీహార్‌లో రాజకీయంగా బలమైన కుష్వాహ్ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం, తండ్రి, తల్లి కూడా పట్టు ఉన్న రాజకీయ నేతలుకావడంతో తేలికగానే పలుమెట్లు ఎక్కగలిగారు. యాదవుల తర్వాత ఒబిసిలలో కుష్వాహాలు బలమైన సామాజిక వర్గం కావడంతో, ఆ వర్గం నేతగా సమ్రాట్టుకు బిజెపి తగిన ప్రాధాన్యం ఇవ్వడమే గాక అత్యున్నత స్థానాన్ని అందించింది. కొన్ని సందర్భాల్లో నితీష్‌తో పూర్తిగా విభేదించిన సమ్రాట్టు ఆయననుముఖ్యమంత్రి పీఠం నుంచి దింపేదాకా తాను ధరించిన తలపాగా తీయనంటూ శపథం కూడా చేశారు. అయితే 2024 జూలైలో బిజెపితో జెడియు పొత్తు కుదుర్చుకోవడం, ఆ తర్వాత ఎన్డీయే కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో తన ఒట్టును తీసి గట్టుమీద పెట్టి నితీష్‌తో చేతులు కలిపారు. కూటమి ప్రభుత్వాన్ని గౌరవిస్తున్నట్లుగా చెప్పి తలపాగాను అయోధ్యలో తీసేశారు. గతసంవత్సరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బిజెపి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడుతుందనీ, సమ్రాట్టు సిఎం అవుతారనే అంతా భావించారు. ఆ ఎన్నికల్లో బిజెపికి 20 శాతం ఓట్లతో 74 సీట్లు రాగా, జెడియుకి 15 శాతం ఓట్లతో 43 సీట్లు మాత్రమే వచ్చాయి. అయితే వ్యూహంలో భాగం కావొచ్చు, నితీష్ నాయకత్వంలోనే ప్రభుత్వం ఏర్పడింది.రెండున్నరేళ్ల తర్వాత నితీష్ వైదొలగి సమ్రాట్టుకు అవకాశం ఇవ్వొచ్చని కూడా అప్పట్లో వినిపించింది. అయితే ఈలోగా బిజెపి వ్యూహం మారిందో, జెడియు వ్యూహం మారిందో కానీ నితీష్ రాజ్యసభకు దారి మార్చుకోవడం, వెంటనే సమ్రాట్టు ఆ స్థానంలోకి రావడం జరిగిపోయాయి.మూడేళ్ల క్రితం ఎవరు తనకు వ్యతిరేకంగా పనిచేశారో, ఆ సమ్రాట్టునే నితీష్ ముఖ్యమంత్రి సీటుకు ప్రతిపాదించడం ఆసక్తికర పరిణామం. రాజకీయాల్లో ఎప్పుడు ఎవరు ఎటువంటి పావులు కదుపుతారో చెప్పలేమనడానికి ఇదే తాజా ఉదాహరణ. ఈ మొత్తం ఉదంతంలో నితీష్ కుమారుడు నిశాంత్ కనబడకపోవడమే ఆశ్చర్యం కలిగించే అంశం. తండ్రిరాష్ట్ర రాజకీయాల నుంచి తప్పుకోనున్నారనే వార్తలు వ్యాపించిన తర్వాత నిశాంత్ హఠాత్తుగా జెడియు తీర్థం పుచ్చుకున్నారు. నితీష్ తర్వాత ఏర్పడే బిజెపి ప్రభుత్వంలో నిశాంత్‌కు డిప్యూటీ సిఎం పదవి లభించగలదనే ప్రచారం కూడా జరిగింది. అయితే సమ్రాట్టు కొలువులో నిశాంత్‌కు ఎలాంటి పదవి లభించనేలేదు. దీనిని బట్టి చూస్తే నితీష్ వ్యూహం కొంతవరకే ఫలించిందేమో! అనిపిస్తుంది. నితీష్ ఇక రాష్ట్ర రాజకీయాలలో తలదూర్చకపోవచ్చని కూడా తెలుస్తోంది. అంతా ఇక కమలం 'కమత'మే సాగవచ్చు. ఆర్జేడీతో పాటు జెడియు కూడా నామమాత్రంగా మారేసూచనలు కనిపిస్తున్నాయి. సమ్రాట్టు పాలనా విధానాలు ఎలా ఉంటాయనే దానిని బట్టి బిజెపి భవిష్యత్తు నిర్ణయమవుతుంది.



సమ్రాట్ చౌధరి

హంగెరీ

ఐరోపాలోని చిన్నదేశంగా ఉన్న హంగెరిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దశాబ్దాలపాటు పాలించిన విక్టర్ ఒర్బాన్ పాలనకు తెరపడింది. టిస్జా పార్టీ నేత పీటర్ మాగ్యార్ 70శాతం సీట్లను గెలుచుకుని కొత్త పాలనకు శ్రీకారం చుడుతోంది. టిస్జా పార్టీ గత వారం జరిగిన ఎన్నికల్లో 52శాతం ఓట్లు సాధించింది. 199 స్థానాలున్న హంగెరీ జాతీయ అసెంబ్లీలో ఒర్బాన్ పార్టీ ఫిడెస్జ్ 135 స్థానాల నుంచి 53 సీట్లకు పడిపోయింది. ప్రత్యర్థి మాగ్యార్ టిస్జాపార్టీ 140 స్థానాలు గెలుచుకున్న ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది.కొత్త పార్లమెంటు ఏర్పాటు కోసం మాగ్యార్ అధ్యక్షుడు తామస్ సుల్యోక్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు విజ్ఞప్తి చేసారు. వచ్చేనెల నాలుగోతేదీ లోపు పార్లమెంటు సమావేశం అయి పీటర్‌మాగ్యార్‌ను తమ నేతగా ఎన్నుకోవడం కేవలం లాంఛన ప్రాయం మాత్రమే. మీడియా స్వేచ్ఛను హరించడం వంటి పాత ప్రభుత్వం అనుసరించిన విధానాలన్నింటినీ ఆయన తొలగిస్తామన్న వాగ్దానం కూడా ఇచ్చేసారు. అధికారంలోకి రాగానే ఇకపై హంగెరీ పార్లమెంటులో కేవలం ఎవరు ఎన్నికైనా కేవలం రెండుపర్యాయాలు మాత్రమే ప్రధానిగా పనిచేసే విధంగా చట్టాన్ని తీసుకొస్తామని కూడా ప్రకటించేసారు. పాలనాపరమైన సంస్కరణలు అత్యవసరమని, అనివార్యమని పేర్కొంటున్న మాగ్యార్ అన్నిరంగాల్లోను సంస్కరణలు అవసరమని పేర్కొంటున్నారు. ఓటమిని అంగీకరించిన ఒర్బాన్ కొత్త ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేసారు. ఒర్బాన్ పార్టీ ఇప్పుడు 53 సీట్లతో పార్లమెంటులో ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వస్తోంది.ఈనెల 28వ తేదీనే పార్టీ నాయకత్వం సమావేశం ఉంది. అలాగే పార్టీ కాంగ్రెస్ సదస్సు కూడా జూన్‌లోనే నిర్వహించాల్సి ఉంది. అందువల్ల అప్పటివరకూ నాయకత్వ మార్పుకోసం వేచి ఉండవచ్చన్న అభిప్రాయం కూడా వ్యక్తం అవుతోంది. ఆర్థిక ప్రతిష్టంభన, ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, జీవన ప్రమాణాలు అడుగంటిపోతుండటంతో ప్రజల్లో ఒర్బాన్ పాలనపట్ల విముఖత పెరుగుతూ వచ్చింది. ఒర్బాన్ ఓటమి ఒక్క హంగెరీ దేశానికే కాకుండా 27 దేశాల కూటమి యూరోప్ దేశాలకు కూడా ఒక

# ఏకపక్ష పాలనకు చరమగీతం!

గన్ని మోహన్

చెంపపెట్టులా పరిణమించింది. ఏకపక్ష నిర్ణయాలతో, ఏకస్వామ్యపాలన విధంగా పోయే నేతలకు ఇప్పుడు ఒర్బాన్ ఓటమి ఒక గుణపాఠంగా కనిపిస్తోంది. దశాబ్దకాలంగా హంగెరీ రాజకీయ వ్యవస్థను సమూలంగా మార్చేసిన ఒర్బాన్ మొత్తం తన గుప్పిట్లోకి తీసుకున్నారు. రాను రాను అన్ని అంశాల్లోను తనకే సర్వాధికారాలు సంక్రమించేవిధంగా వ్యవహరించారు. చివరకు న్యాయవ్యవస్థ అధికారాలను కూడా కుదించేసే చట్టాలు తీసుకువచ్చారు. అయితే ఇదేమీ మొదటి సారి ఓటమికాదు.2002లో కూడా ఒకసారి ఒర్బాన్ ఓటమి చవిచూసారు. తిరిగి 2010లో మళ్లీ అధికారంలోకి రాగలిగారు. అయితే ప్రస్తుత ఎన్నికలను పరిశీలిస్తే ఆయన అనుసరించిన ఏకపక్ష పాలన వ్యవస్థలే ఆయన్ను గద్దెదించాయని చెప్పకతప్పదు. పాలనలో కొత్తసంస్కరణలు అనివార్యమని, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం, ద్రవ్యోల్బణం తగ్గించడంతోపాటు ఉపాధి అవకాశాలు పెంచడం, పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు యూరోపియన్ కూటమిలోనే అత్యంతశక్తివంతమైన దేశంగా హంగెరీని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మాగ్యార్ ప్రజలకు వాగ్దానాలు చేసారు.మాగ్యార్‌కుముందున్న లక్ష్యాల్లో ఐరోపా కూటమితో మరింతగా సత్సంబంధాలు నెలకొల్పడం, ప్రత్యేకించి బ్రస్సెల్స్‌తో క్షీణించిన సంబంధాలు పునరుద్ధరించుకోవడం, ఉక్రెయిన్‌పై నిర్ణయాల్లో సడలింపులు, స్తంభింపచేసిన ఐరోపా కూటమి నిధులు విడుదలచేయడం వంటివి ముందు లక్ష్యాలుగా ఉన్నాయి. అన్నింటికంటే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించినప్పటి నుంచి ఆదేశంనుంచి హంగెరీ లోనికే వలసలు పెరిగిపోయాయి. ఒర్బాన్ హయాంలో పాశ్చాత్యదేశాలవైపే ఎక్కువ మొగ్గు చూపించారు. అలాగే ఉక్రెయిన్‌కు రాజకీయ మద్దతుపట్ల కూడా కొంత విముఖంగానే కొనసాగారు. తన ఎన్నికలప్రచారంలో కూడా అదేవిధానం కొనసాగించారు.యూరోపియన్ యూనియన్‌తో ఉన్నకొద్దిపాటి తలనొప్పులు పరిష్కరించుకోవడం, ఉక్రెయిన్‌పై తన వైఖరిని స్పష్టంచేయడం, మాస్కోపట్ల తనవైఖరిని కూడా స్పష్టం చేయడంతోప్రజలు ఎన్నికల్లో మాగ్యార్‌కు బ్రహ్మరథం పట్టారు. రష్యానుంచి ఇంధన దిగుమతులపైనే ఆధారపడుతోంది. రష్యాసాయంతో పాక్ న్యూక్లియర్‌ప్రాజెక్టులు రెండింటినీ పూర్తిచేయడం,రక్షణ రంగంలో నిధులపెంపు వంటివి కొంత మాగ్యార్‌కు సవాలుగానే ఉంటుందని చెప్పవచ్చు. మధ్య యూరోప్‌లోని ఐరోపాదేశంగా ఉన్న హంగెరీకి ఉత్తరాన స్లోవేకియా, ఈశాన్యంవైపు ఉక్రెయిన్, తూర్పు వైపు రొమేనియా, దక్షిణాన్న సెర్బియా, వాయవ్యంలో క్రోయేషియా, స్లోవేనియా, పశ్చిమాన ఆస్ట్రియాలున్నాయి. కోటి మంది కూడా జనాభాలేని ఈదేశంలో కేవలం 9.5 మిలియన్ల మంది మాత్రమే ఉన్నారు. అత్యధికంగా హంగెరియన్‌భాషనే అలవరచ్చుకున్న ఈదేశంలో జిడిపి కూడా గత ఏడాది అంచనాలనుచూస్తే 247.76 బిలియన్ డాలర్లుగాఉన్నాయి. తలసరి ఆదాయం కూడా అత్యధికంగానే ఉంది. ప్రపంచదేశాల్లో 50వ ర్యాంకుతో ఉన్న ఈదేశంలో తలసరి ఆదాయం25,920 డాలర్లుగా ఉంది. ఐరోపాకూటమిలోనే సుసంపన్న దేశంగా ఉన్న హంగెరీ ఇరుగుపొరుగుననే ఉన్న ఏడుదేశాలతో సత్సంబంధాలు పటిష్టం చేసుకోవడంతోపాటు దేశప్రజలకుఇచ్చిన హామీలు నెరవేర్చడం ప్రధానలక్ష్యం కొత్త నాయకత్వంపైఉంది.అన్నింటికంటే ముఖ్యంగా హంగెరీలో అవినీతి ప్రక్షాళన,న్యాయవ్యవస్థకు స్వయం ప్రతిపత్తితోపాటు ఆర్థికంగా సుసంపన్నం చేసుకోవాల్సిన అవసరం కొత్తనాయకుడు మాగ్యార్‌భుజస్కందాలపై ఉన్నాయి.హంగెరీసార్వభౌమత్వాన్ని చెక్కుచెదరకుండాపరిరక్షించుకోవడం కూడా అధికార టిస్జా పార్టీకి తక్షణ కర్తవ్యం అని ప్రత్యేకించి చెపాల్సిన పనిలేదు.



పీటర్ మాగ్యార్

# పల్లె సంస్కృతి కనుమరుగవుతుందా!

సమిష్టి సహజ జీవనం నుంచి ఏకాంత ఆధునికత వరకు తెలుగు పల్లె.. ఒకప్పుడు అది కేవలం నివాస స్థలంకాదు. అది జీవించే సంస్కృతి, ఊపిరి తీసుకునే ప్రకృతి, అనుబంధాలతో నిండిన ఒక సజీవ ప్రపంచం.ఉదయం సూర్యుడు కిరణాలు నులివెచ్చగా తాకుతుంటే, గేదెల మేతకు వెళ్లే అడుగుల శబ్దం, కోళ్ల కూతలతో మేల్కొనే ఇళ్లు, ఎడ్లబండ్ల చక్రాలు నెమ్మదిగా తిరుగుతూ ఊరి దారుల్లో వినిపించే'క్రిక్ క్రిక్' శబ్దాలు.. ఇవన్నీ కలిసి ఒక సహజ సంగీతంగా ప్రతి రోజును ఆరంభించేవి. పెరట్లో పిల్లలు ఆడుకునే నవ్వులు, పెద్దలు చెట్టు కింద కూర్చొని చెప్పుకునే కథలు,ఆవుల అరుపులు, గాలిలో తేలే పంటల వాసన ఇవ్వన్ని కలిసినప్పుడు పల్లె జీవితం ఒక మధురమైన గీతంలా అనిపించేది.ఆ పల్లెల్లో ప్రతి మనిషి ఒకరికొకరు తోడుగా ఉండేవారు. ప్రతిఇల్లు మరొక ఇంటికి దగ్గరగా ఉండేది.ప్రతి జీవి,ప్రతి చెట్టు, ప్రతి పంట ఒక అనుబంధంతో జీవించేది.పశువులు కేవలం ఆస్తి కాదు. అవి కుటుంబ సభ్యులు. పంటలు కేవలం ఆహారం కాదు, జీవనాధారం.పండుగలు కేవలం వేడుకలు కాదు, మనసులను కలిపే బంధాలు.ఆ జీవన విధానంలో ఒంటరితనం అనే మాటే లేదు. కానీ కాలం మారింది. అదే పల్లె ఇప్పుడు నిశ్శబ్దంగా మారిపోయింది.ఎడ్లబండ్ల శబ్దం తగ్గిపోయింది. పశువుల అరుపులు అరుదైంది, పెరట్లో నవ్వుల కంటే యంత్రాల గర్జన ఎక్కువైంది. సమిష్టి జీవనం క్రమంగా వ్యక్తిగత జీవితంగా మారింది. ఒకప్పుడు ప్రకృతి గుండెలో కట్టుకున్న ఆ పల్లె ఇప్పుడు యాంత్రిక ప్రపంచపు అంచుల్లో నిలబడి తన గతాన్ని గుర్తు చేసుకుంటోంది. గతంలో ప్రతి ఇంటి పెరట్లో పశువుల కొట్టం ఉండేది. ఉదయం మేతకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చి ఇంటి ముందు నిలబడే ఆ దృశ్యం పల్లెకు ప్రాణం. పెరట్లో తిరిగే కోళ్లు, గొర్రెలు, మేకలు ఇవన్నీ కలిసి గ్రామానికి సహజ స్వరాల్ని అందించేవి. ధాన్యం నిల్వ కోసం గుమ్ముల దొడ్డి ప్రతి ఇంటిలో ఉండేది. వడ్లు, జొన్నలు, సజ్జలు, కొర్రలు ఇవి ఎండలో ఎండబెట్టి ఏడాది పొడవునా నిల్వ చేసుకునే వారు. ఇది స్వయం సమృద్ధి స్పష్టమైన రూపం. వ్యవసాయం కూడా సమిష్టి పద్ధతిలో జరిగేది. ఒకరి పంట పనికి మరొకరు తోడుగా ఉండేవారు. 'ఒకరికొకరు తోడు' అనేది మాట కాదు. జీవన విధానం.ఎండాకాలంలో ఆరుబయట నిద్రించడం, ఆకాశం చూస్తూ కథలు చెప్పుకోవడం, పాటలు పాడుకోవడం.ఇవి కుటుంబ బంధాలను బలపరిచే అనుభవాలు. పల్లెల్లో పండుగలు కేవలం ఆనంద క్షణాలు కాదు. అవి ప్రకృతి, పశువులు, మనుషులు ఈ మూడింటి మధ్య ఉన్న అవినాభావ బంధానికి ప్రతీకలు. ప్రతి పండుగవెనుక ఒక జీవన తత్వం, ఒక కృతజ్ఞత భావం, ఒక సమిష్టిఆత్మ దాగి ఉండేది. పొలాల అమావాస్య రోజున పశువులను కృతజ్ఞతాపూర్వకంగా పూజించి, రైతు తన భూమికి నమస్కరిస్తూ, పంటకు పునాది అయిన ప్రకృతిని స్మరించేవాడు. సంక్రాంతి పండుగ రాగానే పల్లె మొత్తం ఒక పండుగ వాతావరణంగా మారేది. ఉగాది కొత్త సంవత్సరాన్ని మాత్రమే కాదు, కొత్త ఆశలను, కొత్త పంటల ఆశీస్సులను తీసుకొచ్చేది. జాతరలు అయితే పల్లె సంస్కృతికి జీవంతమైన ప్రతిబింబాలు. ఎడ్లబండ్లపై కుటుంబాలంతా కలిసి ప్రయాణిస్తూ,దారిలో పాటలు పాడుకుంటూ, గమ్యానికి చేరుకుని రాత్రంతా బుర్రకథలు, జానపద నృత్యాలతో మెలకువగా గడిపే ఆ వేళలు. అవి కేవలం వినోదం కాదు, ఒక సామాజిక ఉత్సవం, ఒక సాంస్కృతిక పాఠశాల.చిన్నా పెద్దా, ధనికా పేదా అనే తేడా లేకుండా అందరూ ఒకే చోట చేరి ఆనందాన్ని పంచుకునే అరుదైన సందర్భాలు అవి. ఈ పండుగలు పల్లె జీవనానికి ప్రాణం పోసేవి. అవి మనుషులను ఒకే తాటిపై నిలబెట్టేవి, అనుబంధాలను

కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

బలపరచేవి, 'మనం ఒకటే' అనే భావాన్ని నాటేవి. ప్రతి ఇంటి ఆనందం ఊరి ఆనందంగా మారేది. ప్రతి ఒక్కరూ ఒక కుటుంబంలా కలిసే ఆ క్షణాలు. ఇవే పల్లె సంస్కృతికి అసలు శ్వాస. భారత వ్యవసాయ చరిత్రలో ఒక కీలక మలుపు. అది పంటల ఉత్పత్తిని పెంచింది, ఆకలిని తగ్గించింది, దేశాన్ని ఆహార భద్రత వైపు నడిపించింది. ఇవన్నీ



అనన్యసాధారణ విజయాలే. కానీ అదే సమయంలో, గ్రామీణ జీవనవిధానాన్ని మౌనంగా,గమనించలేని విధంగామార్చేసిన విప్లవం కూడా అదే. ఒకప్పుడు ఎడ్లబండ్ల చక్రాల మోగింపుతో నిండిన పల్లె దారులు, నేడు ట్రాక్టర్ల గర్జనతో మార్మోగుతున్నాయి. ఎడ్లు, ఆవులు, గేదెలు వ్యవసాయానికి ప్రాణంగా ఉన్న ఈ జీవాలు క్రమంగా యంత్రాల ముందు వెనుకంజ వేశాయి. పశువులపై ఆధారపడిన సాగు పద్ధతులు తగ్గిపోగా,రసాయనిక ఎరువులు, పురుగు మందులు, హైబ్రిడ్ విత్తనాలు వ్యవసాయాన్ని పూర్తిగా మార్చేశాయి. రైతు ప్రకృతితో మాట్లాడే వ్యక్తి నుంచి మార్కెట్‌తో లెక్కలు చూసే వ్యక్తిగా మారాల్సి వచ్చింది. యాంత్రీకరణ వేగం పెరిగింది. పని త్వరగా పూర్తయ్యేది. కానీ మనుషుల మధ్య ఉన్న ఆప్యాయత తగ్గింది. ఒకప్పుడు పంటనాటడం, కోత, నూర్పిడి ఇవన్నీ కలిసి చేసే సామూహిక కార్యక్రమాలు. ఇప్పుడు అవి యంత్రాల చేతుల్లోకి వెళ్లడంతో, 'ఒకరికొకరు తోడు' అనే భావన క్రమంగా మసకబారింది. పని వేగంగా పూర్తయినా, మనసుల మధ్య దూరం పెరిగింది. ఇంకా ఒక ముఖ్యమైన మార్పు వలసలు.పల్లెల్లో అవకాశాలు తగ్గిపోవడంతో యువత నగరాలవైపు అడుగులువేసింది. చదువు, ఉద్యోగం, జీవనోపాధి కోసం ఊరిని వదిలి వెళ్లిన వారు తిరిగి రావడం తగ్గింది. పల్లెల్లో పెద్దలు, వృద్ధులు మాత్రమే మిగిలారు.చిన్న చిన్న భూములుగా విభజన,వ్యక్తిగత వ్యవసాయం పెరగడం కూడా సమిష్టి జీవనాన్ని దెబ్బ తీశాయి.ప్రతి రైతు తన భూమి,తన లాభం, తన సమస్యలతోనే పరిమితమయ్యాడు. ఒకప్పుడు ఊరి మొత్తం కలిసి పనిచేసిన వ్యవసాయం, ఇప్పుడు వ్యక్తిగత బాధ్యతగా మారింది. ఈ మార్పులన్నింటి ఫలితంగా పల్లెల్లో వినిపించే శబ్దాలు కూడా మారిపోయాయి. హరిత విప్లవం మనకు అన్నం ఇచ్చింది. కానీ అదే సమయంలో పల్లె జీవనంలో ఉన్న ఆత్మీయతను, సమిష్టి భావనను కొంతవరకు దూరం చేసింది. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే. అభివృద్ధి పేరుతో మనం పొందిన దానికంటే, కోల్పోయింది ఎక్కువా? లేదా రెండింటి మధ్య సమతుల్యత సాధించగలమా? ఈ ప్రశ్నకు సమాధానం వెతుక్కోవాల్సిన సమయం ఇదే.ఈ మార్పు కేవలం ఆర్థిక వ్యవస్థలో వచ్చిన పరిణామం మాత్రమే కాదు. అది నిశ్శబ్దంగా చోటుచేసుకున్న ఒక గొప్ప సాంస్కృతిక నష్టం. ఒకప్పుడు పల్లె జీవనం ప్రకృతితో ముడిపడి, పశువులతో ఆధారపడి, మనుషుల మధ్య అనుబంధాలతో నిండిపోయి ఉండేది. కానీ ఆ ఆధారం క్రమంగా దెబ్బతినడంతో, ఆ జీవన విధానం కూడా మెల్లగా కరిగిపోతోంది. పశువుల సంఖ్య తగ్గిపోవడం కేవలం పాల ఉత్పత్తి తగ్గడమే కాదు. అది సేంద్రీయ వ్యవసాయానికి బలమైన ఆధారం కోల్పోవడం. ఆవుల ఎరువు, గోమయం, సహజ మూలికలతో సాగిన వ్యవసాయం ఇప్పుడు రసాయనాలపై ఆధారపడుతోంది. దాంతో భూమి ఫలదీకరణం మాత్రమే కాదు, రైతు ప్రకృతితో ఉన్న అనుబంధం కూడా తగ్గిపోయింది. స్థానిక పశు జాతులు, సంప్రదాయ విత్తనాలు ఇవి కేవలం జీవ వైవిధ్యం కాదు, పల్లె సంస్కృతికి మూలాలు. కానీ ఇవి ఇప్పుడు క్రమంగా అంతరించిపోతున్నాయి. వాటి స్థానంలో హైబ్రిడ్ జాతులు, వాణిజ్య విధానాలు వచ్చాయి.ఫలితంగా మనకు లాభాలు వచ్చి ఉండొచ్చుకానీ మన గుర్తింపు, మన మూలాలు మసకబారుతున్నాయి. ప్రకృతితో కలిసి మెలిసి జీవించడం, సమాజంతో కలిసి ముందుకు సాగడం,స్వయం సమృద్ధిని సాధించడం. ఇవన్నీ ఆ కాలపు పల్లె మనకు అందించిన అమూల్యమైన పాఠాలు. నేడు అభివృద్ధి పరుగులో మనం ఆ పాఠాలను మరచిపోయినా ఇప్పుడు తిరిగి వాటి విలువను అర్థం చేసుకునేదశకు వచ్చేశాం. 'ఒకప్పుడు ఉన్న ఒకరికొకరు తోడు' అనే భావనను ఆధునిక రూపంలో తిరిగి తీసుకురావడం ద్వారా రైతులు ఆర్థికంగా, సామాజికంగా బలపడతారు. సమిష్టి కృషి, పంచుకునే వనరులు, పరస్పర సహకారం ఇవి పల్లె జీవనానికి మళ్లీ ప్రాణం పోస్తాయి. పల్లె పండుగలను కూడా కేవలం ఆచారాలుగా కాకుండా, సంస్కృతిగా పునరుద్ధరించాలి. ఇది కేవలం గతాన్ని గుర్తుచేసుకోవడం కాదు. అది మన భవిష్యత్తును కాపాడుకునే ప్రయత్నం. అభివృద్ధి అనే దారిలో ముందుకు సాగుతూనే, మన మూలాలను మరచి పోకుండా, ప్రకృతితో సమతుల్యంగా జీవించే మార్గాన్ని ఎంచుకోవడం అత్యవసరం. పల్లె జీవనం మళ్లీ పునర్జీవం పొందాలంటే మార్పు బయట నుంచి రాదు అది మన ఆలోచనల్లో, మనచర్యల్లో మొదలవాలి. ఇదే నిజమైన పునరుద్ధరణ.

# హార్మూజ్ జలసంధిలో ఐఆర్జీసీ కాల్పులు

## వెనుదిరిగిన రెండు భారత్ ట్యాంకర్లు



**టెహ్రాన్, ఏప్రిల్ 18:** హార్మూజ్ జలసంధిలో మరో సారి తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్జీసీ) బలగాలు ఒక ఆయిల్ ట్యాంకర్‌పై కాల్పులు జరపగా, రెండు భారత జెండా కలిగిన నౌకలు సహా పలు వాణిజ్య నౌకలు వెనక్కి మళ్లాయి. ఈ పరిణామం ప్రపంచ వ్యాప్తంగా చమురు సరఫరాపై ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఈ ఘటన ఒమన్‌కు 20 నాటికల్ మైళ్ల దూరంలో శనివారం చోటుచేసుకున్నట్లు యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యూకే ఎంటీవో) ధృవీకరించింది. ఇరాన్‌కు చెందిన రెండు గన్‌బోట్లు ఎలాంటి రేడియో హెచ్చరికలు జారీ చేయకుండా ఒక ట్యాంకర్‌ను సమీపించి కాల్పులకు తెగబడ్డాయి. ఈ ఘటనలో నౌకకు గానీ, సిబ్బందికి గానీ ఎలాంటి హాని జరగలేదని, అంతా సురక్షితంగా ఉన్నారని ట్యాంకర్ మాస్టర్ నివేదించినట్లు యూకేఎంటీవో తెలిపింది. ఇదే సమయంలో హార్మూజ్ జలసంధిపై తిరిగి తమ పూర్తి స్థాయి నియంత్రణను పునరుద్ధరించినట్లు ఇరాన్ సంచలన ప్రకటనచేసింది. అమెరికా తమ నౌకలపై కొనసాగిస్తున్న దిగ్బంధనానికి ప్రతిస్పందనగా ఈ మూసివేత చర్యలు తీసుకుంటున్నామని స్పష్టంచేసింది. అమెరికా ఆంక్షలు ఎత్తివేసేంత వంకు ఈ నియంత్రణ కొనసాగుతుందని ఇరాన్ అధికారిక వార్తాసంస్థ తస్నిమ్ పేర్కొంది. ఇరాన్ కాల్పుల నేపథ్యంలో వెనక్కి మళ్లిన నౌకల్లో రెండు భారతీయ జెండా నౌకలు ఉన్నట్లు సమాచారం. వీటిలో ఒకటి 20 లక్షల బ్యారెల్స్ ఇరాక్ చమురును తరలిస్తున్న భారీ సూపర్ ట్యాంకర్ కావడం గమనార్హం. ఇరాన్ తాజా చర్యలతో హార్మూజ్ జలసంధిగుండా ప్రయాణిస్తున్న సుమారు 10వాణిజ్య నౌకలు తమ మార్గాలను మార్చుకుని వెనక్కి మళ్లినట్లు జిన్హువా వార్తా సంస్థ నివేదించింది. ఇరాన్ సముద్ర ట్రాఫిక్‌ను పర్యవేక్షించే లారక్ ద్వీపం సమీపంలో ఈ నౌకలు తమ దిశను మార్చుకు న్నట్లు మెరైన్ ట్రాఫిక్ డేటా సూచిస్తోంది. మధ్యప్రాచ్యంలో ఇప్పటికే నెలకొన్న యుద్ధవాతావరణాన్ని ఈ తాజా పరిణామాలు మరింత తీవ్రతరం చేశాయి. ఈ ఘటన ప్రపంచ చమురుసరఫరాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశంఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత విదేశాంగ మంత్రిత్వశాఖ, నౌకాదళం పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయని, భారతీయ నౌకలభద్రతకుఅవసరమైన చర్య లు తీసుకుంటున్నాయని అధికారవర్గాలు తెలిపాయి.



## న్యాయవ్యవస్థలో కృత్రిమమేధ ప్రత్యామ్నాయం కాదు

### చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

**బెంగళూరు, ఏప్రిల్ 18:** న్యాయ వ్యవస్థలో కృత్రిమమేధ (ఏఐ) వినియోగంపై చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్ పలు సూచనలుచేశారు. ఏఐ విషయంలో ఆందోళనలు వద్దని అన్నారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలంటే అంతర్గత పరిమితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కర్ణాటక రాష్ట్ర స్టేట్ జ్యూడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సాంకేతికత అనేది సలహాలు ఇవ్వడంలో ఉపయోగపడుతుందన్నారు. ఏఐ మనుషులకు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని గుర్తించాలని వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థలో ఏఐ అనుసంధానం చేయాలంటే సమతుల్యత పాటించాలని అన్నారు. క్లిష్టమైన ప్రశ్నలతో కూడిన ఓ కేసు మీ ముందుకు వస్తే, ఆ సమస్యను పరిష్కరించడానికి మీరు సమయం వెచ్చించి ఆలోచిస్తారని, దానిని పరిష్కరించాక మీరు గొప్ప అనుభూతిని పొందుతారన్నారు. ఇలాంటి విషయాల్లో ఏఐ సామర్థ్యం సరిపోకపోవచ్చన్నారు.

## యజమాని ఇంటికే పనిమనిషి కన్నం: రూ.25 లక్షల దోపిడీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** దేశ రాజధాని ఢిల్లీలో ఒక మద్యం వ్యాపారి ఇంట్లో పనిమనిషిగా చేరిన వ్యక్తి తన అనుచరులతో కలిసి యజమాని ఇంట్లోనే దోపిడీకి పాల్పడ్డాడు. వ్యాపారి కుటుంబ సభ్యులను వారు నిర్బంధించారు. రూ.25 లక్షల విలువైన నగలను దోచుకున్నారు. ధనికులు నివసించే గోల్ఫ్ లింక్స్ ప్రాంతంలోని మద్యం వ్యాపారి అశోక్ చావ్లా ఇంట్లో సుశీల్ అనే వ్యక్తి కొత్తగా పనిలో చేరాడు. అతడు తన అనుచరులతో కలిసి ఆ ఇంట్లో దోపిడీకి ప్లాన్ చేశాడు. గురువారం సాయంత్రం 6గంటల సమయంలో ఆరుగురు వ్యక్తులు ఆ ఇంట్లోకి ప్రవేశించారు. వృద్ధ జంట, వారి కోడలు, పిల్లలను ఒక గదిలో నిర్బంధించారు. వారిని బెదిరించడంతో పాటు ఇంట్లో అన్ని చోట్ల వెతికారు. రూ.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు దోచుకుని పారిపోయారు. మరోవైపు ఈసమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ వ్యాపారి ఇంటికి చేరుకున్నారు. పనిమనిషి సుశీల్ పక్కా ప్లాన్, రెక్కీ నిర్వహించిన తర్వాత తన వారితో కలిసి ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానించారు. అతడ్ని నియమించిన సంస్థ నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. కాల్ డేటా వంటి సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్, హర్యానాతో సహా పలు రాష్ట్రాల్లో నిందితుల కోసం వెతుకుతున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## అమెరికాలో శాస్త్రవేత్తల అదృశ్యం వెనుక వీడని మిస్టరీ



**వాషింగ్టన్, ఏప్రిల్ 18:** అమెరికాలో ఉన్నత స్థాయి శాస్త్రవేత్తలు వరుసగా ప్రాణాలు కోల్పోవడం లేదా అదృశ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. 2023 నుంచి ఇప్పటివరకు సుమారు 10 మంది శాస్త్రవేత్తలు అనుమానాస్పద రీతిలో మరణించడం లేదా కనిపించకుండా పోవడంపై అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలపై స్వయంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, ఇది యాదృచ్ఛికమా లేక వెనుక ఏదైనా కుట్ర ఉందా అనేది త్వరలో తేలుస్తాం అని ప్రకటించడంతో ఈ వ్యవహారం ప్రాధాన్యత సంతరించుకుంది. అదృశ్యమైన వారిలో చాలామంది అణుశక్తి, గ్రహాంతరవాసుల నౌకలపై పరిశోధనలు చేస్తున్నవారే కావడం గమనార్హం. న్యూ మెక్సికో రాష్ట్రం నుంచే నలుగురు శాస్త్రవేత్తలు కనిపించకుండాపోవడం అనుమానాలను మరింతపెంచింది. పెంటగాన్‌లో అంతరిక్ష పరిశోధనలు చేసిన మేజర్ జనరల్ విలియం నీల్ మెక్‌కాస్లాండ్ ఈ ఏడాది ఫిబ్రవరిలో అదృశ్యమయ్యారు. గతేడాది జూన్‌లో జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీ డైరెక్టర్ మోనికా రెజా హైకింగ్‌కు వెళ్లి స్నేహితురాలికి కొన్ని అడుగుల దూరంలోనే మాయమయ్యారు. ఎంఐటీ ప్రొఫెసర్ నునో లౌరిరో, ఖగోళ శాస్త్రవేత్త కార్ల్ గ్రిల్మెర్‌లను దుండగులు కాల్చి చంపారు. ఈ వరుస ఘటనల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, గ్రహాంతరవాసులు లేదా అణుశక్తికి సంబంధించిన రహస్యాలు బయటకు పొక్కకుండా ఉండేందుకే ఈ హత్యలు జరుగుతున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. హార్వర్డ్ ప్రొఫెసర్ అవి లోబ్ వంటి నిపుణులు దీన్ని భిన్నంగా చూస్తున్నారు. ఇవి వేర్వేరు ఘటనలని, శాస్త్రవేత్తలపై ఉండే తీవ్రమైన పని ఒత్తిడి, వ్యక్తిగత కారణాలు కూడా అయి ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనప్పటికీ, ఈ వరుస ఘటనలపై అమెరికా ప్రభుత్వం దృష్టి సారించింది. నివేదికలను క్షుణ్ణం గా పరిశీలిస్తున్నామని, నిజానిజాలను త్వరలోనే వెల్లడిస్తామని శ్వేతసౌధం ప్రకటించడంతో ఈ మిస్టరీ వీడుతుందని అందరూ ఎదురు చూస్తున్నారు.

## 30 యేళ్లనాటి కేసులో వేర్పాటువాది అరెస్టు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** ముప్పయ్యేళ్ల నాటి కేసులో కాశ్మీరీ వేర్పాటువాది షబ్బీర్ అహ్మద్ షాను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని పటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు అతనికి మూడు రోజుల ట్రాన్సిట్ రిమాండ్ విధించింది. రిమాండ్ ముగిసిన తర్వాత సోమవారం మధ్యాహ్నం 12 గంటల లోపు కశ్మీర్‌లోని ఎన్ఐఏ స్పెషల్ కోర్టు ముందు హాజరుపర్చాలని న్యాయమూర్తి ఎన్ఐఏ అధికారులను ఆదేశించారు. షబ్బీర్ అహ్మద్ షాపై 1996 జులై 17న కేసు నమోదైంది. అయితే అప్పటి నుంచి నిందితుడు పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దాంతో కేసు మరుగున పడిపోయింది. అయితే ఈ నెల 1న ఎన్ఐఏ అధికారులు కేసును తిరిగి తెరిచారు. ఆపై నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. 1996 జూలై 17న భద్రతా బలగాల ఎన్‌కౌంటర్‌లో హతమైన ఉగ్రవాది అంత్యక్రియలు జరిగాయి. ఈ అంత్యక్రియల సందర్భంగా కాశ్మీరీ వేర్పాటువాదులు హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. భద్రతాబలగాలపై కాల్పులు జరిపారు. బాంబులు విసిరి శాంతిభద్రతలకు విఘాతం కలిగించారు. పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. దాంతో షబ్బీర్‌తోపాటు పలువురిపై కేసులు నమోదయ్యాయి. మిగతావాళ్లు అరెస్టయినా షబ్బీర్ తప్పించుకుతిరుగుతున్నాడు. తాజాగా షబ్బీర్ కూడా దర్యాప్తు అధికారులకు చిక్కాడు.



### అపార్టుమెంట్ నుంచి నోట్లకట్టలు విసిరేసిన మహిళ

**బీజింగ్, ఏప్రిల్ 18:** చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో ఒక మహిళ తన అపార్ట్‌మెంట్ బాల్కనీ నుంచి పెద్ద మొత్తంలో నగదును కిందకు విసిరేసి సంచలనం సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. శాంతూ నగరంలోని స్టార్ లేక్ సిటీ నివాస సముదాయంలో ఏప్రిల్ 14న ఉదయం ఈ సంఘటన జరిగింది. ఓ మహిళ తన అపార్ట్‌మెంట్ నుంచి హాంకాంగ్ కరెన్సీకి చెందిన 1,000 డాలర్ల నోట్ల కట్టలను గాలిలోకి విసిరేసింది. గాలిలో తేలుతూ వస్తున్న నోట్లను చూసిన స్థానికులు, బాటసారులు వాటిని ఏరుకోవడానికి పోటీ పడటంతో ఆ ప్రాంతంలో తీవ్ర గందరగోళం నెలకొంది. విసిరేసిన నగదు విలువ సుమారు 1 మిలియన్ నుంచి 2 మిలియన్ల హాంకాంగ్ డాలర్ల (భారత కరెన్సీలో కోట్లల్లోనే) వరకు ఉండొచ్చని ప్రత్యక్ష సాక్షులు అంచనా వేస్తున్నారు. కుటుంబ సభ్యుల అనారోగ్యం కారణంగా సదరు మహిళ తీవ్ర మానసిక వేదనకు గురైనట్లు ప్రాథమిక సమాచారం. భార్యాభర్తల మధ్య గొడవ కూడా ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని కొన్ని కథనాలు చెబుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఏరుకున్న డబ్బును తిరిగి ఇచ్చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చాలామంది నిజాయతీగా నగదును తిరిగిఅప్పగించారు. ప్రస్తుతం ఆ మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

### బొమ్మకార్లతో ఐఇడి పేలుళ్లకు కుట్రలు

## నలుగురు యువ టెర్రరిస్టులు అరెస్టు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటూ, పేలుళ్లకు కుట్ర పన్నిన నలుగురు వ్యక్తుల్ని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్ మహారాష్ట్ర, ఒడిశాకు చెందిన నలుగురు వ్యక్తులు తీవ్రవాదచర్యలకు సిద్ధమవుతుండగా, అరెస్టు చేసినట్లు పోలీసులు శనివారం వెల్లడించారు. బొమ్మ కారుతో పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుల్ని మొసాయిబ్ అహ్మద్, మొహమ్మద్ అహ్మద్, మొహమ్మద్ సోహైల్, షేక్ ఇమ్రాన్‌లుగా గుర్తించారు. వీరంతా పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు. నిందితుల్లో మొసాయిబ్ గల్ఫ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేశాడు. రిమోట్ కంట్రోల్ కార్ తయారు చేసే స్కిల్స్ సంపాదించాడు. ఇలా తయారు చేసిన రిమోట్ కంట్రోల్ కార్ ద్వారా ఐఈడీ వంటి పదార్థాల్ని ఉపయోగించి పేలుళ్లకు పాల్పడాలని కుట్రపన్నారు. రద్దీ ప్రదేశాల్లో దాడి చేయాలని భావించి, రెక్కీ కూడా నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి ఇద్దరు, బీహార్, ఒడిశా నుంచి ఒక్కొక్కరు తీవ్రవాద భావజాలానికి ఆకర్షితులయ్యారు. లష్కర్ ఫ్రమ్ ఖురాసన్ అనే సిద్ధాంతం ఆధారంగా ఇతరుల్ని కూడా ఇలా తీవ్రవాద భావజాలంవైపు మళ్లించేందుకు ప్రయత్నించారు. జిహాద్‌కు అనుకూలంగా ఎన్‌క్రిప్టెడ్ సోషల్ మీడియా గ్రూపులను ఏర్పాటు చేసుకున్నారు. తమలాంటివారిని గుర్తించి, బృందంలో చేర్చుకునేందుకు ఈ సోషల్ మీడియా అకౌంట్లను వాడేవారు. కొన్ని ఆయుధాల గురించి చర్చించేవారు. గత ఏడాది డిసెంబర్‌లో ఢిల్లీ వెళ్లిన నిందితులు ఎర్రకోట, ఇండియా గేట్ వంటి కొన్ని ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. అలాగే, అయోధ్యలోని రామ మందిరాన్ని, పార్లమెంట్ హౌజ్ వంటి కీలక ప్రదేశాల్ని కూడా లక్ష్యంగా ఎంచుకున్నారు. ప్రజలు, రద్దీ ఎక్కువగా ఉండే ఇలాంటి ప్రదేశాల్లో పేలుళ్ల ద్వారా ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయాలనేది వారి లక్ష్యం. వీరి కుట్రను పోలీసులు భగ్నం చేశారు. నిందితుల దగ్గరి నుంచి ఐఈడీ పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

### కొండమలుపులో పడిపోయిన వాహనం

## ఏడుగురు టీచర్లు సహా 9 మంది మృతి



**చెన్నై, ఏప్రిల్ 18:** ఒక టూరిస్ట్ వాహనం కొండ మలుపులో అదుపుతప్పి కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ఉపాధ్యాయులతో సహా 9 మంది మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. దీంతో ఆ ప్రభుత్వ స్కూల్‌లో విషాదం నెలకొన్నది. తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కేరళలోని మలప్పురం జిల్లా పాంగ్‌పల్లిపరంబ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, సిబ్బందితో కూడిన 13 మంది పర్యటన కోసం తమిళనాడు వెళ్లారు. శుక్రవారం ట్రావెల్ టెంపో వాహనంలో వాల్పరై హిల్ స్టేషన్‌ను సందర్శించారు. వాల్పరైలో పర్యటన ముగించుకుని కొండ నుంచి కిందకు దిగుతుండగా ఆ వాహనం ప్రమాదానికి గురైంది. 13వ హెయిర్‌పిన్ మలుపు వద్ద అది అదుపు తప్పి కిందకు దూసుకెళ్లింది. 9వ హెయిర్‌పిన్ మలుపులోని రోడ్డుపై బోల్తాపడింది. ఆ వాహనంలో ఉన్న 13 మందిలో ఒక బాలిక, ఏడుగురు మహిళలు, ఒక పురుషుడితో సహా 9 మంది ఈ ప్రమాదంలో మరణించారు. మృతుల్లో ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. మరోవైపు ట్రావెల్ వాహనం డ్రైవర్, మరో ముగ్గురు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. వీరిలో ఇద్దరిని కోయంబత్తూరు వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ప్రధాని మోడీ, కేరళ సీఎం విజయన్ తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. టీచర్లు, సిబ్బంది మరణించడంతో కేరళలోని పాంగ్‌పల్లి పరంబ ప్రభుత్వ స్కూల్‌లో విషాదం అలుముకుంది.

## రోడ్డుప్రమాదంలో వశీకరణబాబా స్నేహితుడి కుటుంబం దుర్మరణం



**ముంబై, ఏప్రిల్ 18:** జ్యోతిష్యం, వశీకరణ పేరుతో పలువురు మహిళలపై అత్యాచారానికి పాల్పడి అరెస్టైన అశోక్ ఖరత్ సన్నిహితుడు, అతడి భార్య రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారు ప్రయాణించిన కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో భార్యాభర్తలు మరణించగా వారి కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. మహారాష్ట్రలోని అహిల్యానగర్ జిల్లాలో ఈ ప్రమాదం జరిగింది. తనకు తాను దేవుడిగా చెప్పుకున్న నాసిక్‌కు చెందిన అశోక్ ఖరత్ జ్యోతిష్కుడిగా ప్రసిద్ధి చెందాడు. తన వద్దకు వచ్చే పలువురు మహిళలను లొంగదీసుకుని అత్యాచారానికి పాల్పడ్డాడు. ఒక బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. అశోక్ ఖరత్ కీలక అనుచరుడైన 55 ఏళ్ల జితేంద్ర షెల్కే అతడి వ్యాపార భాగస్వామి. ఆయనకు చెందిన శివానికా ట్రస్ట్ ఉపాధ్యక్షుడిగాను వ్యవహరిస్తున్నాడు. జితేంద్ర షెల్కే, తన భార్య అయిన 50 ఏళ్ల అనురాధ, కుమారుడితో కలిసి శుక్రవారం రాత్రి ఛత్రపతి సంభాజీనగర్ నుంచి థానేకు కారులో ప్రయాణమయ్యాడు. ముంబై నాగ్‌పూర్ సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌హైవేలోని ధోత్రేవద్ద కారు నడుపుతున్న జితేంద్ర పట్టుతప్పి రోడ్డు పక్కన ఆగిఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జితేంద్ర, ఆయన భార్య అనురాధ అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన వారి కుమారుడ్ని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోపర్‌గావ్ పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పార్లమెంటు నిరవధిక వాయిదా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. లోక్‌సభ శనివారం నిరవధిక వాయిదా పడింది. దీంతో జనవరిలో మొదలైన బడ్జెట్ సమావేశాలు ముగిసిపోయాయి. ఇవాళ ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే, స్పీకర్ ఓం బిర్లా సమావేశ వివరాలను వెల్లడించారు. ఆ తర్వాత ఆయన సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 16 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ముందురోజు లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. మూడవ వంతు మెజారిటీ రాకపోవడంతో మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా ఓటమిపాలైంది. డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా లోక్‌సభ సీట్లను పెంచే ప్రక్రియ కూడా స్తంభించిపోయింది. రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు చైర్మెన్ సీపీ రాధాకృష్ణణ్ తెలిపారు. రాజ్యసభ సుమారు 157గంటల 40 నిమిషాల పాటు సాగినట్లు చెప్పారు. సుమారు 110 శాతం ఉత్పాదకతను సాధించినట్లు తెలిపారు.

## బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో దోపిడి దొంగల హల్‌చల్



**భోపాల్, ఏప్రిల్ 18:** మధ్యప్రదేశ్ రాష్ట్రం సింగ్రౌలీ జిల్లా బైదాన్ పట్టణంలోని విద్యానగర్ ఏరియా లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌లో దోపిడీ దొంగలు చొరబడి నగదుతోపాటు లాకర్‌లలోని బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. రూ.15 కోట్ల విలువైన బంగారం, రూ.35 లక్షల నగదు, వెండితో వారు పరారైనట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఐదుగురుదుండగులు బ్యాంకులో చొరబడి బ్యాంకు సిబ్బందిని, వినియోగదారులను తుపాకులతో బెదిరించి బంధించారు. అనంతరం కేవలం 20 నిమిషాల్లోనే బంగారం, వెండి, నగదుతో ఉడాయించారు. మొదట ఇద్దరు దొంగలు కస్టమర్లలా నటిస్తూ బ్యాంకులోకి ప్రవేశించారు. వారు తుపాకులు తీసి సిబ్బందిని, కస్టమర్లను బెదిరిస్తుండగా మరో ముగ్గురు దొంగలు బ్యాంకులో చొరబడ్డారు. సిబ్బంది, కస్టమర్లు అందరూ తమ మొబైల్స్ ఒకేదగ్గర పెట్టాలని ఆదేశించారు. అందుకు కొందరు నిరాకరించడంతో గాల్లోకి కాల్పులు జరిపి బెదిరించారు. అందరి ఫోన్‌లు తీసుకున్న తర్వాత కస్టమర్లను, సిబ్బంది గోడవైపు ముఖాలు చేసి కూర్చోవాలని ఆదేశించారు. కదిలినా, మాట్లాడినా చంపేస్తామని బెదిరించారు. ఆ సమయంలో తనకు దగ్గరావడంతో దగ్గానని, దగ్గితే చంపేస్తాంఅని దొంగలు వార్నింగ్ ఇచ్చారని ఓ కస్టమర్ చెప్పారు. దోపిడీ సమయంలో ఒక దొంగ బ్యాంకు గేటు దగ్గర నిలబడగా, మరో ఇద్దరు బ్యాంకులోపల కస్టమర్లకు తుపాకీ గురిపెట్టి నిలబడ్డారు. మరో ఇద్దరు బ్యాంక్ మేనేజర్ దగ్గరికి వెళ్లి లాకర్ల తాళాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు ఆమె నిరాకరిం చడంతో చెంపపై కొట్టి తాళాలు లాక్కున్నారు. భారీ విలువైన నగలు, నగదుతో ఉడాయించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ సాయంతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి మధ్యప్రదేశ్‌తో పాటు దాని చుట్టుపక్కల రాష్ట్రాల్లో కూడా దోపిడీ దొంగల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

### మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే

## 2023 చట్టాన్ని అమలు చేయాలి

### ఇండియా కూటమి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రధాని భావిస్తే 2023 చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ లేఖ రాయనున్నట్లు తెలిపారు. తాము మహిళా రిజర్వేషన్‌కు మద్దతిస్తున్నా మని, కానీ దాని ము సుగులో ప్రభుత్వం భారత ఎన్నికల ముఖ చిత్రాన్ని మార్చే కుట్రను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఒబిసిలు, దళితులు, మైనారిటీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడం అధికార పక్షానికి ఇష్టం లేదని అందుకే కులగణనను పక్కన పెట్టేందుకు ఈ బిల్లుల ద్వారా కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్లడానికి దేశవ్యాప్తంగా సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతి పక్షాలు ఓడించినందుకు నిరసనగా ఢిల్లీలోని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నివాసం వద్ద నిరసన చేపట్టనున్నట్లు బిజెపి నేతలు తెలిపారు. అన్ని రాష్ట్రాలలోని కాంగ్రెస్ నేతల ఇళ్ల ముందు నిరసన చేపట్టాలని దేశవ్యాప్తంగా పార్టీ వర్గాలకు పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు రిజర్వేషన్లనకు మాత్రమే వ్యతిరేకం కాదని, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు స్థానాలు పెరగడం కూడా వాటికి ఇష్టం లేదని అన్నారు.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇస్లామాబాద్‌లో రేపు శాంతి చర్చలు



**టెహ్రాన్, ఏప్రిల్ 18:** అమెరికా, ఇరాన్ దౌత్యవేత్తల మధ్య సోమవారం ఇస్లామి బాద్‌లో చర్చలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఆదివారం పాకిస్థాన్ రాజధానికి దౌత్య వేత్తలు చేరుకుంటారని అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు అమెరికా, ఇరాన్ మధ్య తొలి దఫా చర్చలు జరిగిన విషయం తెలిసిందే. ఉద్రిక్తతలు తగ్గించే నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గల్ఫ్ దేశాల్లో పర్యటించారు. ఖతార్ షేక్ తమిమ్ బిన్ హమ్మద్, టర్కీ అధ్యక్షుడు రీసెప్ తయ్యిప్ ఎర్డగోన్‌ను కలిశారు. ఇక పాక్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ఇరాన్‌లో పర్యటించారు. ఆ దేశ విదేశాంగ మంత్రి అరగాచితో సంప్రదింపులు చేశారు. ఇరానీ పార్లమెంట్ స్పీకర్ భగేర్ ఘాలిబఫ్‌ను కూడా అసిమ్ మునీర్ కలిశారు. అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు.. పాక్ తమ వంతు ప్రయత్నం చేస్తున్నది.

## మరో నెల రోజులు రష్యా నుంచి చమురు

### ఆంక్షల నుంచి మినహాయింపు ఇచ్చిన అమెరికా



**వాషింగ్టన్, ఏప్రిల్ 18:** అంతర్జాతీయ మార్కెట్‌లో ఆకాశన్నంటుతున్న ఇంధన ధరలను అదుపు చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం అనూహ్య నిర్ణయం తీసుకుంది. రష్యా చమురు, పెట్రోలియం ఉత్పత్తుల విక్రయాలపై విధిస్తున్న ఆంక్షల నుంచి మరో నెల రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. రెండు రోజుల క్రితమే ఎలాంటి మినహాయింపులు ఇవ్వమని ప్రకటించి శుక్రవారం మినహాయింపు ఇస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ విభాగం తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నిజానికి రష్యా, ఇరాన్ చమురుపై ఎలాంటి మినహాయింపులు ఇచ్చే ప్రసక్తే లేదని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ కేవలం రెండు రోజుల క్రితమే కుండబద్దలు కొట్టారు. దీంతో భారత్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ అకస్మాత్తుగా ఈ నిర్ణయాన్ని అమెరికా మార్చుకుంటూ మే 16వ తేదీ వరకు సడలింపును పొడిగించింది. తాజా నిబంధనల ప్రకారం.. శుక్రవారం నాటికి సముద్రంలో నౌకలపై లోడ్ అయిన రష్యా చమురును కొనుగోలు చేయడానికి మే 16వ తేదీ అర్ధరాత్రి వరకు అవకాశం ఉంటుంది. ఏప్రిల్ 11తో ముగిసిన పాత మినహాయింపు గడువును ఈ నిర్ణయం ద్వారా మరో నెల పాటు పొడిగించినట్టయింది.

VMRDA విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ

పత్రికా ప్రకటన

ఆన్లైన్ నెం.11021/64/2026, (e-3218881) 18-04-2026

ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా 1) ఫార్ ఈస్ట్ ప్రాపర్టీస్ ప్రాతినిధ్యం వహించింది మేనేజింగ్ పార్ట్నర్స్ ఎం.ప్రదీప్ వర్మ మరియు ఏ.సూర్య చంద్రరావు, 2) శ్రీ పి.వెంకట కృష్ణం రాజు ప్రాతినిధ్యం వహించింది శ్రీ ముదునూరి ప్రదీప్ వర్మ, బకురపాలెం గ్రామము, ఆనందపురం మండలం, విశాఖపట్నం జిల్లా నందలి సర్వే సంఖ్య 58/p లలో ఎకరములు 3.0837 సెంట్లు గల లేఅవుట్ అనుమతి నిమిత్తము దరఖాస్తు చేసియున్నారు. సదరు దరఖాస్తు ఈ కార్యాలయం ఫైల్ ఆన్లైన్ నెం. 1167/0040/LP/VMRDA/2026 నందు పరిశీలన నిమిత్తమైయున్నది.

కావున పైన తెలిపిన లేఅవుట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగియున్న యెడల ఈ ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 7 రోజులలోపు వి.యం.ఆర్.డి.ఎ. కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియచేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు / సలహాలు లేవని భావించి, సదరు దరఖాస్తుపై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియచేయుటమైనది.

Sd/- Metropolitan Commissioner, VMRDA

19-4Pg6exHMNWJQE.qxd:19-4Pg6exHMNWJQE.qxd 1/1/02 5:41 AM Page 1



# విద్యా సంస్థల్లో సైకాలజిస్టులను నియమించాలి

## - డాక్టర్ ఎన్. బి. సుధాకర్ రెడ్డి



**తిరుపతి,ఏప్రిల్ 18ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని విద్యా వ్యవస్థలో విద్యార్థుల మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం లభించడం లేదని ఆంధ్ర ప్రదేశ్ చైతన్య వేదిక కన్వీనర్, సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్. బి. సుధాకర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, అన్ని విద్యా సంస్థల్లో సైకాలజిస్టులను నియమించాలని శనివారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కు లేఖ రాశారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికల ప్రకారం, 2013లో దేశవ్యాప్తంగా సుమారు 8,500 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా, 2023 నాటికి ఈ సంఖ్య 14,000కు పైగా చేరిందని తెలిపారు. కేవలం పదేళ్లలో ఈ సంఖ్య సుమారు 65 పెరగడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2014 నుండి 2022 మధ్యకాలంలో 3,690 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు, అందులో 1,609 మంది బాలికలు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కాలంలో సుమారు 72 పెరుగుదల నమోదవడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సగటున రోజుకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడి, భయం, ఆందోళన, డిప్రెషన్, ఏకాగ్రత లోపం, జ్ఞాపకశక్తి తగ్గుదల వంటి సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. అదనంగా పోషకాహార లోపం, తక్కువ బరువు, తలనొప్పులు, కంటి సమస్యలు, నిద్రలేమి వంటి శారీరక సమస్యలు కూడా అధికంగా కనిపిస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడం మాత్రమే కాకుండా సమగ్ర వ్యక్తులుగా ఎదగడం అవసరమని, ఈ దిశగా విద్యా సంస్థల్లో సైకాలజిస్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కాబట్టి, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో సైకాలజిస్టులను నియమించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సుధాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఇండియన్ ఆర్మీ సైనికుల ప్యారా జంపింగ్ శిక్షణలో అపశ్రుతి!

- ప్యారాచూట్‌లతో నేలపై దిగే సమయంలో నలుగురు సైనికులకు గాయాలు
- ఆర్మీ హెలికాప్టర్‌లో హుటాహుటిన బెంగళూరులోని ఆర్మీ ఆసుపత్రికి తరలింపు
- కర్ణాటక రాష్ట్రం కారేకల్-వీరాపూర్ మధ్యలో కొనసాగిన ఆర్మీ సైనికుల శిక్షణ

**ఉరవకొండ, ఏప్రిల్ 18 ప్రభాతవార్త** ఇండియన్ ఆర్మీ సైనికులకు ఇచ్చే ప్యారా జంపింగ్ శిక్షణలో అపశ్రుతి చోటు చేసుకుంది. రాష్ట్ర సరిహద్దు విడపనకల్లు మండలం డోనేకల్లు సమీపంలో కర్నాటక రాష్ట్రంలోగల పరమదేవర హల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కారేకల్-వీరాపూర్ గ్రామాల మధ్య విశాలమైన మైదానంలో ప్రతి ఏడాది తరహాలోనే శనివారం కూడా సైనికుల శిక్షణ ప్రారంభమైంది. ఈక్రమంలో ఆర్మీ విమానంలో దాదాపు 2వేల అడుగుల పైకివెళ్లి అక్కడి నుండి పారాచూట్‌ల సాయంతో నేలపైకి దిగే శిక్షణ కొనసాగుతున్న క్రమంలో వివిధ సాంకేతిక సమస్యలు, గాలివేగం నియంత్రణలేని కారణంగా నలుగురు సైనికులు వందల అడుగుల ఎత్తుపైనుంచి వేగంగా నేలపైకి పడటంతో వారి కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అక్కడున్న శిక్షణ అధికారులు వెంటనే ఉన్నతా ధికారులకు సమాచారం అందించి ఆర్మీ హెలికాప్టర్‌ను రప్పించి గాయపడిన వారిని హుటాహుటిన బెంగళూరులోని ఆర్మీ బేస్ క్యాంపులోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు సమాచారం. అనుకోకుండా జరిగిన ఘటనతో ఆర్మీ శిక్షణ శిబిరంలో అలజడి చెలరేగగా మరో రెండు రోజులు జరుగాల్సిన శిక్షణ రద్దు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.



ప్యారా రైడింగ్ జంపింగ్ శిక్షణలో భాగంగా 2వేల అడుగుల ఎత్తులోంచి పారాచూట్‌ల సాయంతో కిందకు దూకుతున్న సైనికుల దృశ్యం

## చిలకలడోణ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 11కు చేరిన మృతుల సంఖ్య

**మంత్రాలయం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త;** మంత్రాలయం మండలం చిలకలడోణ వద్ద ఈనెల 16వ తేదీన బొలెరో వాహనం, సిమెంటర్ లారీ ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదం పాఠకులకు విధితమే. ఈ ప్రమాదంలో గాయపడిన కొందరు క్షతగాత్రులు కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం చికిత్సల నుంచి కోలుకోలేక ఆర్.శుభ అలియాస్ సుబ్బమ్మ(32) అనే మహిళ మృతిచెందారు. మృతురాలిది కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లా శెట్టిగేర్ గ్రామం. అలాగే ప్రమాదంలో గాయపడిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జయమ్మ(60) అనే మహిళ కూడా చికిత్సల నుంచి కోలుకోలేక మృతిచెందినట్లు వైద్యులు శనివారం తెలిపారు. సదరు మహిళది కర్ణాటక రాష్ట్రం చిక్ మంగళూరు జిల్లా కన్నెతనహళ్లి గ్రామం. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి సంఖ్య 11కు చేరింది. ఆసుపత్రిలో చికిత్సల నుంచి కోలుకోలేక మృతిచెందడంతో వారి బంధువుల రోదనలు మిన్నంటాయి.

## కస్టడీలో హింసించిన పోలీసులను సస్పెండ్ చేయాలి

**మాజీ మంత్రి అంబటి రాంబాబు**

**గుంటూరు ఏప్రిల్ 18 ప్రభాత వార్త ప్రతినిధి :** వైఎస్సార్సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు శనివారం ఉదయం నుండి గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షకు దిగారు. తనను కస్టడీలో హింసించిన పోలీసులను సస్పెండ్ చేయాలని, తన ఇల్లు, ఆఫీస్ పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 31 వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబుపై అవమానకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ గుంటూరులోని అంబటి నివాసం, కార్యాలయాన్ని టీడీపీ శ్రేణులు ముట్టడించాయి. ఆ తర్వాత అంబటిని పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు వారాల తర్వాత ఫిబ్రవరి 18న రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అంబటి విడుదల అయ్యారు. ఈ క్రమంలో తనను కస్టడీలో హింసించిన పోలీసులు సస్పెండ్ చేయాలని.. తన ఇల్లు, ఆఫీస్ పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కలెక్టరేట్ వద్ద అంబటి రాంబాబు నిరాహార దీక్షకు దిగారు. ఈ నిరాహార దీక్షను సాయంత్రం 6 గంటల వరకు కొనసాగించారు. ఈ క్రమంలో మాజీ హోంమంత్రి సుచరిత చేతుల మీదగా నిమ్మరసం ఇవ్వగా అంబటి దీక్షను విరమించారు. ఈ సందర్భంగా సుచరిత మీడియాతో మాట్లాడుతూ అంబటి ఇంటిపై దాడి హేయమని, 7 గంటల పాటు దాడులు జరిగినా పోలీసులు స్పందించకపోవడం దారుణమన్నారు. అంబటిని వేధించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సుచరిత డిమాండ్ చేశారు. దాడి చేసిన టీడీపీ గూండాలను అరెస్ట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు విడుదల రజిని, జోగి రమేష్, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, కల్పలత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శివకుమార్, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి మల్లాది విష్ణు, సింహాద్రి, నియోజకవర్గ సమన్వయకర్తలు అంబటి మురళి, షేక్ నూరి ఫాతిమా, వేమారెడ్డి డైమండ్ బాబు, గజ్జల భార్గవ్ రెడ్డి, అశోక్ బాబు రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ శ్యామల, న్యాయవాదు శ్రవణ్ కుమార్, రాష్ట్ర,జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అత్యవసర వైద్య సేవల్లో కొత్త శకం

- 10 నెలల్లో 6.4 లక్షల మంది ప్రాణాలను కాపాడిన భవ్య హెల్త్ కేర్ 108 సర్వీస్..
- 9,183 గుండెపోటు కేసుల్లో గోల్డెన్ అవర్‌లో స్పందించి ప్రాణదానం

**విజయవాడ, ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యవసర వైద్య సేవలను ప్రతి కుటుంబానికి అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ప్రభుత్వ భాగస్వామిగా భవ్య హెల్త్ సర్వీస్ ఆధ్వర్యంలో నడుస్తున్న 108 అంబులెన్స్ సర్వీస్ గత 10 నెలల్లో అసాధారణ పనితీరు కనబరిచింది. జూన్ 2025 నుండి మార్చి 2026 మధ్య కాలంలో మొత్తం 6,39,809 అత్యవసర కేసులకు తక్షణం స్పందించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజలకు అత్యుత్తమ అత్యవసర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న భవ్య హెల్త్ సర్వీస్, గత 10 నెలల్లో అత్యంత సమర్థవంతంగా సేవలందించి వేలాది ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించింది. అత్యాధునిక సాంకేతికత, అంకితభావంతో కూడిన సిబ్బందితో మారుమూల ప్రాంతాల్లో కూడా ఖిగోల్డెన్ అవర్ఖిలో వైద్య సహాయం అందిస్తూ రాష్ట్ర ఆరోగ్య రంగంలో నమ్మకమైన భాగస్వామిగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా అందిన కాల్స్ లో ప్రధానంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడటంలో భవ్య హెల్త్ కేర్ బృందం కీలకంగా వ్యవహరించింది. ప్రమాద బాధితుల రక్షణ 92,372 రోడ్డు ప్రమాద కేసులు, 40,450 ఇతర ప్రమాద కసుల్లో తక్షణ వైద్యం అందించారు. 87,320 మంది గర్భిణీ స్త్రీలకు మరియు 11,614 మంది నవజాత శిశువులకు సురక్షితమైన రవాణా, అత్యవసర చికిత్స అందించారు. ముఖ్యంగా గత మూడు నెలల్లోనే 9,183 మంది గుండెపోటు బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రులకు చేర్చి ప్రాణాలు నిలబెట్టారు.. భవ్య హెల్త్ కేర్ తన సేవల నాణ్యతను పెంచేందుకు పలు కీలక మార్పులు చేపట్టింది. ఫ్లీట్ అప్‌గ్రేడేషన్: పాత వాహనాల స్థానంలో అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన 190 కొత్త అంబులెన్స్‌లను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం మొత్తం 731 వాహనాలు నిరంతరం అందుబాటులో ఉన్నాయి. అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ ప్రతి అంబులెన్స్‌లో వెంటిలేటర్లు, డెఫిబ్రిలేటర్లు ఆక్సిజన్ సపోర్ట్ వంటి సౌకర్యాలతో పాటు శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ (నిలీగి) అందుబాటులో ఉంటారు. 24/7 కంట్రోల్ రూమ్: అత్యాధునిక జీపీఎస్ (బిశిళీ) టెక్నాలజీ ద్వారా అంబులెన్స్‌లను ట్రాక్ చేస్తూ, కాల్ అందిన వెంటనే తక్కువ రెస్పాన్స్ టైమ్‌లో బాధితుల వద్దకు చేరుకునేలా వ్యవస్థను రూపొందించారు.

## లక్ష్యాలకు మించిన శనగపంటను కొనుగోలు చేస్తాం

### - మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** లక్ష్యాలకు మించి శనగపంటను కొనుగోలు చేస్తామని ఏపీ వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్ననాయుడు తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌తో వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి అచ్చెన్న రాష్ట్రంలో శనగల సాగు, ఉత్పత్తి పెరిగిన విషయాన్ని వివరించారు. అదే విధంగా శనగల కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కేంద్రాన్ని కోరారు. పీఎస్‌ఎస్ స్కీమ్ కింద అదనంగా 15 వేల టన్నుల శనగల కొనుగోలుకు కేంద్రం తక్షణమే అనుమతి ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో 7.13 లక్షల టన్నుల శనగల ఉత్పత్తి జరిగినట్లు వివరించారు. ఇప్పటివరకు 94,500 టన్నుల శనగల కొనుగోళ్లు పూర్తయినట్లు వెల్లడించారు. కొనుగోలు లక్ష్యాన్ని 1,78,250 టన్నులకు పెంచాలని కేంద్రాన్ని కోరారు. మిగిలిన 68,750 టన్నులు కేంద్రం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్న హామీ ఇచ్చారు. మొక్కజొన్న రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్మాల్సి వస్తోందని కేంద్రానికి మంత్రి అచ్చెన్న వివరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెన్న కేంద్రాన్ని కోరారు. మిర్చి, పొగాకు రైతులు క్రాప్ డైవర్షన్ వల్ల మొక్కజొన్న సాగు పెరిగిందన్నారు. అధిక దిగుబడితో మార్కెట్‌లో మొక్కజొన్న సరఫరా పెరిగిందని అచ్చెన్న తెలిపారు. ఇథనాల్ ఉత్పత్తిలో బ్రోకెన్ రైస్ వాడకంతో మొక్కజొన్న డిమాండ్ తగ్గిందని అచ్చెన్న పేర్కొన్నారు.

# భక్త జనసంద్రం.. వాడపల్లి క్షేత్రం

## వేసవి దృష్ట్యా మజ్జిగ, చలి వేంద్రాలు ఏర్పాటు..

## స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ, 75 లక్షలు..

**ఆత్రేయపురం, ఏప్రిల్, 18,(ప్రభాత వార్త )** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీను తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం భక్త జనసంద్రంగా మారింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, బెంగళూరు, తదితర రాష్ట్రాల నుండి ఏడు వారాలు నోము ఆచరించే భక్తులు రాకతో మాడ వీదులు గోవింద నామస్మరణతో మర్మోగాయి. ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవ, తొలి హారతితో ప్రారంభమైన రద్దీ.. రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. లక్షకు పైగా భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకోగా. ముప్పై వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రత్యేక దర్శనాలు తదితర ద్వార సేవల స్వామివారికి డబ్బుయ్ ఐదు లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు వెల్లడించారు. వివిధ జిల్లాల నుండి ఆర్టీసీ అధికారులు ఆలయానికి ప్రత్యేక బస్సులను నడిపారు. ఆలయానికి ప్రతి శనివారం సుదీర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తుల వస్తున్నారు. వేసవి దృష్ట్యా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో మాడవీధుల్లో భక్తులు సౌకర్యార్థం రావులపాలెం నకు చెందిన శ్రీ అంజనీ గ్యాస్ (హెచ్)ఎజన్సీ వర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలి వేంద్రాన్ని ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులు ప్రారంభించి భక్తులకు మజ్జిగ అందజేశారు. అన్ని ప్రాంతాల్లోని భక్తులకు దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ మంచినీరు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. సాయంత్రం రాజమండ్రి వాస్తవ్యులు సత్య శ్రావణి నృత్యనికేతన్ వారి ధర్మపథం కార్యక్రమంలో జరిగిన వివిధ నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి.

## అలిపిరి మెట్టు మార్గంలో తప్పిపోయిన బాలుడు అప్పగింత



**తిరుమల,ఏప్రిల్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం అలిపిరి మెట్లమార్గంలో వస్తూ శనివారం ఉదయం తప్పిపోయిన బాలుడ్ని అలిపిరి విజిలెన్స్ అధికారులు గుర్తించి, సురక్షితంగా కొన్నిగంటల్లోపే తల్లిదండ్రుల చెంత చేర్చారు. తమిళనాడు చంగల్ పట్టు ప్రాంతానికి చెందిన ఆదర్శ్ (12) తల్లిదండ్రులతో కలసి అలిపిరి మెట్ల మార్గంలో నడుస్తూ సుమారు 2500వ మెట్టు వద్ద తప్పిపోయాడు. ఈ విషయం టిటిడి విజిలెన్స్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తెలిసింది. వెంటనే స్పందించిన ఎవీఎస్‌ఒలు సిబ్బందిని అప్రమత్తం చేసి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తిరుమలలోని పిఎసి2 ప్రాంతంలో బాలుడు కనిపించినట్లు విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. ఆతరువాత ఆదర్శ్‌ను సురక్షితంగా లేపాక్షి సర్కిల్‌లోని విజిలెన్స్ కార్యాలయానికి తీసుకువచ్చి ఎవిఎస్ఒ వెంకట శివ కుమార్, కృష్ణయ్య సమక్షంలో అతని బంధువులకు అప్పగించారు.

## సచివాలయాల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ ఆకస్మిక తనిఖీలు



**విజయవాడ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** గ్రామసచివాలయాలను ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల్లోని సచివాలయాలను ఆయన సందర్శించి రిజిష్టర్‌లను పరిశీలించారు. ఈసందర్బంగా సిబ్బంది విధులకు గైర్హాజం వటాన్ని ఆయన గుర్తించారు. సెలవుల్లో ఉన్న సిబ్బంది మాన్యువల్‌గా నమోదు చేసినప్పటికీ ఆన్‌లైన్‌లో సెలవు నమోదు చేయకపోవటాన్ని ఎమ్మెల్యే తప్పుపట్టారు. సచివాలయాల్లో రిజిష్టర్‌లు సక్రమంగా నిర్వర్తించకపోవటం సరికాదని మందలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిష్టర్‌లు నిర్వహించని వారికి మెమోలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. జనాభా నిష్పత్తి ప్రకారం సచివాలయాల్లో సిబ్బంది లేకపోవటాన్ని గమనించిన ఆయన ఈవిషయాన్ని సంబందింత మంత్రి దృష్టికి తీసుకువెళతానన్నారు. ప్రభుత్వ అధికారులు సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. తరచు తాను ఆకస్మిక తనిఖీలకు వస్తానని సక్రమంగా పనిచేయని వారిపై తగిన చర్యలు ఉంటాయని యార్లగడ్డ స్పష్టం చేసారు.

## ఇంద్రకీలాద్రిపై ముమ్మరంగా ఎన్ఐఆర్ఎం శాస్త్రవేత్తల పరిశీలన

### - కొండచరియల పటిష్టతపై లైవ్ డెమోలో పాల్గొన్న ఇఒ



మంత్రి పార్థసారథికి దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రి కొండ చరియల పటిష్టతపై అధ్యయనం చేస్తున్న బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ ఎన్ఐఆర్ఎం శాస్త్రవేత్తల బృందం శనివారం క్షేత్రస్థాయిలో కీలక పరిశీలనలు జరిపింది. సైంటిస్ట్ ప్రసన్న జైన్ నేతృత్వంలోని బృందం, ఇఒ వీకే శీనా నాయక్, ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఇంద్రకీలాద్రిలోని వివిధ ప్రాంతాలను సందర్శించింది. ఈ సందర్భంగా ఓం టర్నింగ్ సమీపంలోని కొండ చరియలను, అలాగే ఘాట్ రోడ్ మొదటి మలుపు వద్ద ఉన్న ప్రమాదకర ప్రాంతాలను బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు తాము ఉపయోగిస్తున్న అత్యాధునిక సాంకేతిక పరికరాల పనితీరును ఈవో గారికి వివరించారు. కొండ చరియల్లో ఉన్న మట్టి శాతం, తేమ మరియు రాళ్ల పటుత్వాన్ని ఈ పరికరాలు ఏ విధంగా లెక్కిస్తాయో లైవ్ డెమో ద్వారా చూపించి, ఆ ఫలితాలను వివరించారు. అనంతరం బృందం హెడ్ వాటర్ వర్క్స్ ఎదురుగా ఉన్న కొండపైకి కాలినడకన ఎక్కి, ప్రతిపాదిత ఖిరెండవ ఘాట్ రోడ్ఖి మార్గంలో రాతి మరియు మట్టి నమూనాలను పరీక్షించింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ భక్తుల భద్రత కోణంలోనే కాకుండా, భవిష్యత్తులో ఇంద్రకీలాద్రిపై చేపట్టబోయే ప్రతి అభివృద్ధి పనికి ఒక బ్లూ ప్రింట్ లాగా ఉపయోగపడుతుందని ఈవో స్పష్టం చేశారు. ఈ సమగ్ర అధ్యయనం, కొండ భద్రతను కాపాడుతూనే ఆధ్యాత్మిక క్షేత్ర ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసేలా బృహత్తర నిర్మాణాలకు మార్గం సుగమం చేస్తుందని వివరించారు.

- భక్తుల సేవతో పాటు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం మధ్యాహ్నం ఉద్యోగుల గ్రీవెన్స్ డే కార్యక్రమం శనివారం ఇఒ ఛాంబర్‌లో జరిగింది.

# వైభవంగా ప్రారంభమైన వారసత్వ ఉత్సవాలు



కొండపల్లి బొమ్మలను తిలకిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

**విజయవాడ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా విజయవాడలో మూడురోజులపాటు జరిగే వారసత్వ ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కొండపల్లిలోని ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో కొండపల్లి బొమ్మల పండుగను ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లు శనివారం ఉదయం ప్రారంభించారు. ఈసందర్బంగా ఏర్పాటు చేసిన కొండపల్లి బొమ్మల స్టాల్స్, కీలుబొమ్మలు, తోలుబొమ్మల స్టాల్స్‌ను ఆసక్తిగా తిలకించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని 400 ఏళ్ళ చరిత్ర కలిగిన కొండపల్లి బొమ్మల వారసత్వ సంపదను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఈకార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈపండుగను ప్రతి ఏటా నిర్వహిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకాలకు అనుగుణంగా హస్తకళలు, హస్తకళాకారుల అభివృద్ధికి సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపరచి కళాకారులకు చేయూతనిస్తామని హామి ఇచ్చారు. ఉత్సవాల్లో భాగంగా 19వతేదీ మూడువందలమంది కళాకారులతో మెగా కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన డిజైన్‌లు రూపొందించాల్సి ఉందన్నారు. వినూత్నంగా బొమ్మల డిజైన్‌లు రూపొందించిన కళాకారుల్లో టాప్ 10మందిని ఎంపికచేసి వచ్చే ఏడాది ఇదే ఉత్సవాల్లో ఒక్కొక్కరికీ రూ.50వేలు నగదు పురస్కారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కొండపల్లి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనురాధ, మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, రామ్మోహనరావు(గాంధీ), జిల్లాపర్యాటక అధికారి ఏ.శిల్ప, రీజనల్ డైరెక్టర్ వైవి.ప్రసన్న, డిఈఓ చంద్రకళ, యువజనసంక్షేమ అధికారి కొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సాగునీటి కొరత తీరుస్తాం : మంత్రి కొల్లు రవీంద్ర

## - గన్నవరంలో స్వచ్ఛాంద్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి



కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

**గన్నవరం(కృష్ణా), ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖా మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. గన్నవరం మండలం చిన్నఆవుటపల్లిలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌తో కలిసి శనివారం ఉదయం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పలుగు, పార చేతపట్టి కాలువల్లో పూడికతీత పనులను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నీటినిర్వహణకు పెద్దపీట వేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకీ అడుగంటి పోతున్న భూగర్భజలాలను పరిరక్షించి, 6మీటర్ల మేర భూగర్భజలాలను పెంచటమే లక్ష్యంగా 100 రోజులపాటు కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి ఏటా వర్షాకాలంలో వందల టియంసిల నీరు సముద్రంపాలవుతుంటే మరోవైపు సాగునీటి యద్దడితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రిజ్వారాయర్‌లలో నీటిని నిల్వ ఉంచటంతోపాటు, సాగునీటి కాలువలను శుభ్రం చేస్తున్నట్లు వివరించారు. సముద్రంలో వృధాగా పోతున్న నీటిలో కొంతవరకు రాయలసీమకు తరలించినా అక్కడ సాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. మొన్నటి వరకు గన్నవరం నియోజకవర్గం అంటే దోపిడీలకు, దుర్మార్గాలకు నిలయంగా ఉండేదని, ప్రస్తుతం అభివృద్దే లక్ష్యంగా పాలన సాగుతుందన్నారు. గన్నవరం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అహర్నిశలు శ్రమిస్తున్నారని ప్రశంసించారు. పరిశ్రమలకు నెలవుగా గన్నవరం మార్పు చెందుతుందన్న మంత్రి రాబోయే రోజుల్లో గన్నవరం రూపురేఖలు మారిపోతాయని జోస్యం చెప్పారు. చంద్రబాబునాయుడు కృషి వల్ల దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో మన రాష్ట్రానికి 25శాతం పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారని, రాయలసీమలో ఆటోమొబైల్, ఉత్తరాంధ్రలో ఆర్సెలార్ మిట్టల్, గూగుల్ డెటా సెంటర్ లాంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పెట్టుబడిదారులను బయపెట్టి తరిమేయాలని వైసిపి నాయకులు కుట్రలు పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. జగన్‌రెడ్డి లాంటి అరాచకశక్తుల నుండి రాష్ట్రాన్ని కాపాడుకోవటానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మంత్రి రవీంద్ర పిలుపునిచ్చారు.

# హాజ్‌యాత్రకు గన్నవరం నుండి సౌదీకి తరలి వెళ్లిన 156 మంది యాత్రికులు

**గన్నవరం(కృష్ణా), ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** తొలిరోజు హజ్‌యాత్రకు గన్నవరం నుండి 156 మంది యాత్రీకులు శనివారం ప్రత్యేక విమానంలో సౌదీఅరేబియాకు బయలుదేరి వెళ్ళారు. రాష్ట్రమైనార్టీశాఖా మంత్రి ఫరూఖ్, ఎక్సైజ్‌శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ నజీర్‌లు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి విమానాశ్రయానికి యాత్రీకులతో వెళుతున్న బస్సులను ఆకుపచ్చజెండా ఊపి ప్రారంభించారు. హజ్‌యాత్రీకుల కోసం రాష్ట్రప్రభుత్వం గన్నవరంలోని ఎస్‌యం కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసింది. ఈశిబిరం నుండి నాలుగు బస్సులలో ప్రయాణీకులు విమానాశ్రాయానికి చేరుకున్నారు. అక్కడి నుండి మధ్యాహ్నం 2.15గంటలకు 73మంది పురుషులు, 83మంది స్త్రీలు కలిపి మొత్తం 156మంది హజ్‌యాత్రీకులతో ప్రత్యేక విమానం గన్నవరం విమానాశ్రయంలో టేకాఫ్ అయ్యింది. అంతకు ముందు కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఫరూఖ్ మాట్లాడుతూ హజ్‌యాత్రీకుల కోసం ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు బాగున్నాయని కితాబిచ్చారు. రాష్ట్రంలోని హజ్‌యాత్రీకులు హైదరాబాద్, చెన్నై వంటి నగరాలకు వెళ్ళకుండా విజయవాడ నుండి నేరుగా సౌదీకి వెళ్ళేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. యాత్రీకులకు ప్రభుత్వం నుండి ఆర్థికసాయాన్ని నేరుగా వారి ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ అమరావతిలో హజ్‌హౌస్ నిర్మిస్తామని హామి ఇచ్చారు. మైనార్టీల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని స్పష్టం చేసారు. హజ్‌యాత్రీకులకు రాష్ట్రప్రభుత్వం నుండి లక్షరూపాయల ఆర్థికసాయం అందించటం సంతోషకరమన్నారు. ఈఏడాది రాష్ట్రం నుండి 1987మంది హజ్‌యాత్రకు వెళుతుండగా, గన్నరవం నుండి 333మంది వెళుతున్నట్లు తెలిపారు. హజ్‌యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడతూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గన్నవరం నుండి హజ్‌యాత్ర ప్రారంభం కావటం పట్ల హర్షం వ్యక్తం చేసారు. రాష్ట్రఅభివృద్ధి కోసం హజ్‌యాత్రీకులు ప్రార్ధనలు చేయాలని కోరారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి తన పాలనా ధక్షతతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టి అభివృద్ధివైపు పరుగులు పెట్టిస్తుండగా, పవన్‌కళ్యాణ్, లోకేష్‌లు సహకారం అందిస్తున్నారు.



హాజ్‌యాత్రికులకు కిట్‌లు అందచేస్తున్న మంత్రులు కొల్లు రవీంద్ర, ఫరూఖ్, విప్ యార్లగడ్డ తదితరులు

-7_-7.qxd 4/18/2026 11:31 PM Page 1



# పల్లాకు అభినందనల నీరాజనం



విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త



**గాజువాక,ఏప్రిల్ 18,ప్రభాతవార్త**

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో శనివారం అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ఏపీయూఎఫ్ ఐడీసీ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ళ సురేంద్ర తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు. బీసీ సామాజిక వర్గం నుంచి ఎదిగి రాష్ట్ర స్థాయి పదవిని చేపట్టడం విశాఖ జిల్లా వాసుల అదృష్టమని నేతలు కొనియాడారు. ఆయన నిస్వార్థ రాజకీయ శైలి అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పల్లాకు నూకాంబిక అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో కె.రత్నకుమారి, పి.ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వర్క్ షాప్‌ల ద్వారా యువ ఆర్థోపెడిక్ సర్జన్లకు ఉపయోగకరం

- కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



యువ వైద్యులకు వర్క్ షాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. వాణి పేర్కొన్నారు. శనివారం ఆంధ్ర మెడికల్ కాలేజీ అనాటమీ డీ సెక్షన్ హాల్లో "సర్జరీ ఆఫ్ ది హ్యాండ్ అండ్ రిస్ట్" పై ఒకరోజు హ్యాండ్స్ ఆన్ క్యాడవెరిక్ వర్క్‌షాప్..ను ఆర్థోపెడిక్స్ విభాగం తిలీది/రిబిబీ, నార్త్ ఆంధ్ర ఆర్థోపెడిక్ అసోసియేషన్, ఇండియన్ సొసైటీ ఫర్ సర్జరీ ఆఫ్ ది హ్యాండ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అడ్వాన్స్‌డ్ కోర్స్ ఇన్ హ్యాండ్ సర్జరీ..ని తిలీది ప్రిన్సిపల్ డా. కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ మిగతా 8..లో

## అశోక్ గజపతిరాజు నివాసంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యుల సందడి

- సాదరంగా ఆహ్వానించిన అశోక్ గజపతిరాజు

**విజయనగరం, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారు విజయనగరంలోని గజపతి రాజుల నివాసాన్ని సందర్శించారు. గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి చేరుకున్న స్పీకర్ కుటుంబ సభ్యులకు రాజవంశీయులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు తన నివాసంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేశారు. మిగతా 8..లో

## చందనోత్సవం ఏర్పాట్లను కమిషనర్ పర్యవేక్షణ

**విశాఖపట్నం, ప్రభాతవార్త**




భక్తులకు స్వామి వారి దర్శనం సజావుగా సాగేందుకు నిరంతరం క్యూలైన్ల మరియు భక్తుల రాకపోకల పర్యవేక్షణ కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రత్యేక అధికారి వియంఆర్‌డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ యన్ తేజ్ భరత్, అత్యంత ప్రతిష్టాత్మకంగా 20వ తేదీన సింహాచలంలో జరిగే చందనోత్సవం సందర్భంగా భక్తులకు స్వామి వారి నిజరూప దర్శనం సజావుగా సాగేందుకు సుమారు 400 దిది కెమెరాలను, డ్రోన్ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సెంటర్ లో ఏర్పాటు చేసిన స్క్రీన్ల ద్వారా నిరంతరం క్యూ లైన్ల లో భక్తుల రాకపోకలను, మిగతా 8..లో

## రిజిస్ట్రేషన్ల ఆదాయం అభివృద్ధికి నిదర్శనం: గంటా

**మధురవాడ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**



రిజిస్ట్రేషన్ల ఆదాయం ఆయా ప్రాంతాల్లో అభివృద్ధికి అద్దం పడుతుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 202526 ఆర్థిక సంవత్సరానికి గాను మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రాష్ట్రంలోనే అత్యధికంగా రూ.320 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఈ సందర్భంగా శనివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కేక్ కట్ చేసి అధికారులను ఆయన అభినందించారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఐటీ.. రియల్ ఎస్టేట్ సంస్థలు.. టూరిజం ప్రాజెక్టులు వస్తున్న నేపథ్యంలో కొనుగోళ్లు, అమ్మకాలు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 15 వేల లావాదేవీలు జరిగాయని, మధురవాడ పరిసరాల్లో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. హైరైజ్ భవంతులే కాకుండా విల్లాల నిర్మాణాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎండాడ స్కై లాంజ్, ఐకానికా గ్రాండ్, వీపీఆర్ ప్రాజెక్టుల ద్వారానే రూ. 400 కోట్ల ఆదాయం వస్తుందన్న అంచనా రాబోయే రోజుల్లో రియల్ ఎస్టేట్ బూమ్ కళ్ల ముందు ఉంచుతుందని చెప్పారు. ఆదాయంలో మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నెంబర్ వన్ గా నిలిపిన జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి ఇతర సిబ్బందిని గంటా అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, పిల్లా వెంకట్రావు, మన్యాల సోంబాబు, లొడగల అప్పారావు, చెట్టుపల్లి సన్యాసిరావు, నాగోతి సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, గరే గుర్నాథ్, కానూరు అచ్యుతరావు, వాండ్రాసి అప్పలరాజు, బోయి శ్రీను, పోలిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## సాంకేతికతను వినియోగించుకోవాలి: గంటా

**ఆనందపురం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

ప్రభుత్వ కార్యకలాపాల్లో సాంకేతికతను వాడుకోవడం ద్వారా ప్రజలకు చేరువ కావాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండల కార్యాలయంలో శనివారం 135 మంది విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సమర్థంగా అందించడానికి రూ. 20 లక్షలు ఖర్చు చేసి ఫోన్లను అందిస్తున్నామన్నారు. అలాగే స్వయం ఉపాధి కోసం 13 ఎగ్ కార్ట్ లను పంపిణీ చేసినట్టు వెల్లడించారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో సీఎం చంద్రబాబు నాయుడు క్రమం తప్పకుండా పాల్గొంటున్నారని చెప్పారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలందరూ పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా గొట్టిపల్లి గ్రామానికి ట్రాక్టర్ అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత కోసం సాంకేతికతను వాడుకోవాలని సీఎం దిశానిర్దేశం చేస్తున్నారని తెలిపారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ.. విశాఖలో గూగుల్ డేటా మిగతా 8..లో

# చందనోత్సవానికి సర్వం సిద్ధం

- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి చందనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు
- భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు

**విశాఖపట్నం/సింహాచలం. ఏప్రిల్ 18. ప్రభాతవార్త**



సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి అత్యంత ప్రతిష్టాత్మకమైన చందనోత్సవం వేడుకలకు జిల్లా యంత్రాంగం, దేవస్థానం మరియు పోలీస్ శాఖ సంయుక్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ వెల్లడించారు. శనివారం సాయంత్రం ఆయన సింహాచలం దేవస్థానంలో చందనోత్సవం ఏర్పాట్లను బిజులీది కమిషనర్, జాయింట్ కలెక్టర్ ఉద్యాధరీ, కమిషనర్ తేజ్ భరత్, వెంకట రావుతో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ ఈ ఏడాది సుమారు రెండు లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. చందనోత్సవం రోజున తెల్లవారుజామున 4 గంటలకు తొలి పూజ అనంతరం భక్తులకు దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం 6:00 గంటల కల్లా దర్శనాల ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మిగతా 8..లో

## విశాఖలో హైకోర్టు న్యాయమూర్తుల అతిథి గృహ నిర్మాణాలకు శంకుస్థాపన

- వేద మంత్రోచ్ఛరణలు, శాస్త్రోక్త పూజల నడుమ భూమి పూజ చేసిన సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్
- క్రతువులో భాగస్వామ్యమైన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ రవి చీమలపాటి



**విశాఖపట్నం, ప్రభాతవార్త**

విశాఖపట్టణంలోని ఎండాడ పరిధిలో ఐదెకరాల స్థలంలో నిర్మించతలపెట్టిన హైకోర్టు న్యాయమూర్తుల అతిథి గృహ నిర్మాణాలకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శనివారం శంకుస్థాపన చేశారు. వేద మంత్రోచ్ఛరణలు, శాస్త్రోక్త పూజల నడుమ సహచర న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ రవి చీమలపాటిలతో కలిసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం మీట నొక్కి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సహచర న్యాయమూర్తులతో పాటు గునపం పట్టుకొని, సిమెంట్ వేసి నిర్మాణాలకు అంకురార్పణ చేశారు. ఇతర పూజా క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భూమిపూజ చేసిన ప్రాంతం నుంచి సాగర తీరాన్ని వీక్షించారు. కొండపై భాగం నుంచి కనిపించే పరిసరాలను పరిశీలించారు. నిర్మాణ ప్రక్రియలు, ఇతర అంశాలకు సంబంధించిన ప్రాథమిక వివరాలను కోర్టు, జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు, ఫస్ట్ ఏడీజే వెంకటరమణ, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, భీమిలి ఆర్డీవో మిగతా 8..లో

## రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభినందనలు

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన హరివంశ్ నారాయణ్ సింగ్‌కి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఆయనకు ఒక లేఖ రాశారు. భారత రాష్ట్రపతి ద్వారా రాజ్యసభకు నామినేట్ కావడంతో పాటు, డిప్యూటీ ఛైర్మన్‌గా వరుసగా రెండోసారి బాధ్యతలు చేపట్టడం పట్ల అయ్యన్నపాత్రుడు గారు సంతోషం వ్యక్తం చేశారు. హరివంశ్ నారాయణ్ సింగ్ గారు నాయకత్వం, అనుభవం మరియు పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయనకున్న నిబద్ధతకు ఈ ఎన్నిక ఒక నిదర్శనమని స్పీకర్ గారు కొనియాడారు. భవిష్యత్తులోనూ ఆయన తన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తూ అయ్యన్నపాత్రుడు గారు తన శుభాకాంక్షలు అందజేశారు.

## కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌ని కలిసిన సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖపట్నం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**



విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ను శుక్రవారం కలెక్టరేట్ చాంబర్లో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజవర్గం సంబంధించిన పలు అంశాలను వివరించడంతో పాటు నియోజవర్గం అభివృద్ధికి సహకరించాలని కోరారు .అదే విధంగా పెండింగ్లో ఉన్న పలు అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయడానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా విశాఖ నగరం విచ్చేసిన కలెక్టర్‌కి శాలువా వేసి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కూటమినేతలు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్ను ప్రారంభించిన హోం మంత్రి అనిత

- క్యాంటీన్‌లో భోజనాలను స్వయంగా వడ్డించి, స్థానిక ప్రజలతో కలిసి భోజనం చేసిన మంత్రి

**పాయకరావుపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**



పాయకరావుపేట నియోజకవర్గంలో హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట పట్టణంలో రూ.61 లక్షల వ్యయంతో నిర్మించిన అన్నా క్యాంటీన్‌ను మంత్రి అనిత ప్రారంభించారు. అనంతరం క్యాంటీన్‌లో భోజనాలను స్వయంగా వడ్డించి, స్థానిక ప్రజలతో కలిసి భోజనం చేశారు. భోజనాల నాణ్యతపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, పేదవారికి మంచి భోజనం అందించడం అన్నా క్యాంటీన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను రద్దు చేసి పేదలకు భోజనం దూరం చేసిందన్నారు. 2019-2024 మధ్య కాలంలో వాటిని రాజన్న క్యాంటీన్లుగా అయినా కొనసాగించాలని కోరినా స్పందన లేకపోయిందని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, పట్టణాలతో పాటు గ్రామీణ మండలాల్లో కూడా వీటిని మిగతా 8..లో

## ఎనర్జీ అండ్ కాస్ట్ సేవింగ్స్"పై వర్క్‌షాప్‌లు నిర్వహించిన ఈపీడీసీఎల్



**విశాఖపట్నం, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) వినియోగదారులలో విద్యుత్ వినియోగ సామర్థ్యాన్ని పెంపొందించడం, ఖర్చులను తగ్గించేందుకు అవగాహన కల్పించడం లక్ష్యంగా "ఎనర్జీకాస్ట్ సేవింగ్స్ - డిమాండ్ రెస్పాన్స్" అంశంపై రెండు రోజులపాటు వర్క్‌షాప్‌లను నిర్వహించింది. ఎలిమెంట్స్ ఎనర్జీ సహకారంతో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లు మిగతా 8..లో

## ఆర్‌కె బీచ్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన




**విశాఖపట్నం, ప్రభాతవార్త**

జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా విశాఖ ఆర్‌కె బీచ్ లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న హోం మంత్రి అనిత అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ గురించి వివరించిన అధికారులు. ఆకట్టుకున్న మెగా ఫైర్ సర్వీస్ డెమో.మెగా ఫైర్ సర్వీస్ డెమోను ఆసక్తిగా తిలకించిన అతిథులు, నగరవాసులు. అత్యంత క్లిష్ట పరిస్థితులలో ప్రాణాలను, ఆస్తులను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పోషించే అమూల్యమైన పాత్రను వివరించిన అగ్నిమాపక శాఖ అధికారులు.జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన స్టాల్స్ ని పరిశీలించిన హోం మంత్రి అనిత.హోం మంత్రి వంగలపూడి అనిత కామెంట్స్ ఏప్రిల్ 14 నుండి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతున్నాయి.అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు, ప్రజలు ఏ విధంగా జాగ్రత్తగా ఉండాలో డెమోలో అధికారులు వివరించారు.2018 అగ్నిమాపక శాఖకు పరికరాలు కొనుగోలు చేసాం.2019 నుండి 2024 వరకు అగ్నిమాపక శాఖను గత ప్రభుత్వం పట్టించుకోలేదు.ఇటీవలే 232 కోట్లు రూపాయలతో ఫైర్ వెహికల్స్ కొనుగోలు చేసాం. సీఎం చంద్రబాబు వాహనాలను కూడా ప్రారంభించారు. అత్యాధునిక పరికరాలను ఉపయోగిస్తున్నాం. టెక్నాలజీని ఉపయోగిస్తూ,డ్రోన్ లు వాడుతున్నాము. అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ గురించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.



మొదటిపేజీ తరువాయిలు

## చందనోత్సవానికి సర్వం సిద్ధం



ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా ..300, ..1000 మరియు ..1500 కేటగిరీలలో సుమారు 40,000 టికెట్లను విక్రయించడం జరిగిందాని, మిగిలిన భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పించనున్నామని వెల్లడించారు. కొండ పైకి భక్తులను తరలించడానికి 100 ప్రత్యేక బస్సులను ఉచితంగా ఏర్పాటు చేశామన్నారు . ప్రైవేట్ వాహనాలను కొండ పైకి అనుమతించమని. భక్తులు తమ వాహనాలను ఫుట్ హిల్స్ వద్ద కేటాయించిన 32 పార్కింగ్ ప్రదేశాలలో నిలిపివేసి, దేవస్థానం బస్సుల ద్వారా కొండ పైకి చేరుకోవాలని కోరారు.

భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్ల దూరాన్ని తగ్గించారనీ,. ఎండ, వానల నుండి రక్షణ కోసం క్యూ లైన్ల పొడవునా( కెనోపి)నీడ ఏర్పాటు చేశా మ న్నారు .తిరుమల, విజయవాడ దేవస్థానాల నుండి వచ్చిన అనుభవజ్ఞులైన సిబ్బందితో క్యూ లైన్లను వేగంగా కదలడానికి చర్యలు చేపట్టామన్నారు. భక్తులు తమ మొబైల్ ఫోన్లను కొండ పైకి తీసుకురావడానికి అనుమతి లేదన్నారు. భక్తులు తమకు కేటాయించిన నిర్ణీత సమయ స్లాట్ లలోనే దర్శనానికి రావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నకిలీ టికెట్ లు తెస్తే చట్టపరంగా చర్యలు తీసు కుంటామన్నారు.

భక్తుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన షెడ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు రాంపులను నిర్మించామన్నారు. ఉచిత ప్రసాదం, మంచినీరు మరియు అన్నదాన వితరణ చేసే సంస్థలకు ప్రత్యేక డ్యూటీ పాస్‌లను జారీ చేశామని తెలిపారు.. ప్రోటోకాల్ ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన అతి కొద్ది మందికి (సుమారు 500 మందికి) మాత్రమే ఉదయం 5:00 గంటల లోపు అంతరాలయ దర్శనానికి అనుమతి ఉంటుందనీ. ఆ తర్వాత అందరికీ సాధారణ దర్శనాలే కొనసాగుతాయని స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ మరియు దేవస్థానం సిబ్బంది ఒకే టీమ్‌గా పనిచేస్తూ ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారని, భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు.

### విశాఖలో హైకోర్టు న్యాయమూర్తుల అతిథి గృహ నిర్మాణాలకు శంకుస్థాపన




సంగీత్ మాథుర్, ఇతర న్యాయమూర్తులు, కోర్టు అధికారులు, వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. హైకోర్టు న్యాయమూర్తులకు ఆత్మీయ సత్కారంశంకుస్థాపన క్రతువు అనంతరం కొండ దిగువ భాగంలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు హైకోర్టు న్యాయమూర్తులు చేరుకున్నారు. జిల్లా కోర్టులో పని చేసే న్యాయమూర్తులు, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఇతర అధికారులతో ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు. జిల్లాకు చెందిన న్యాయమూర్తులు, అధికారులతో వారు బృంద చిత్రాలు దిగారు. ఈ క్రమంలో ప్రధాన న్యాయమూర్తిని, ఇతర న్యాయమూర్తులను జిల్లా కోర్టు న్యాయమూర్తులు, అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆత్మీయంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

### అన్నా క్యాంటీన్ను ప్రారంభించిన హోం మంత్రి అనిత

విస్తరిస్తున్నామని చెప్పారు.



పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి అడ్డరోడ్డు సమీపంలో మరో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాయకరావుపేటలోని సరయ్య చెరువు వద్ద స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.‘జలం-జీవం’ నినాదంతో చెత్త తొలగింపు కార్యక్రమంలో స్వయంగా పాల్గొని, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. సరయ్య చెరువును అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించిన ఆమె, చెరువునుశుభ్రపరచి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని సూచించారు.

## సాంకేతికతను వినియోగించుకోవాలి: గంటా

సెంటర్.. లతో ఐటీ విప్లవంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, ఎంపీడీఓ జానకి, ఎమ్మార్వో శ్రీనుబాబు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాతాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, రామానాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, కాళ్ల నగేష్ కుమార్, కసిరెడ్డి దామోదరరావు, లొడగల వెంకటరమణ, తమ్మిన అప్పలరాజు, సత్య వరప్రసాద్, లొడగల వెంకట్రావు, మహంతి శివాజీ, రౌతు నాగరాజు, ఎర్ర రాజు, అప్పల రాము తదితరులు పాల్గొన్నారు.చెరువును సందర్శించిన గంటారూ. 50 లక్షలతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదించిన ఆనందపురం మండలంలోని పోలవాని చెరువును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, బ్యూటిఫికేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పరిసర ప్రాంత ప్రజలు ఆహ్లాదం కోసం వచ్చేలా చెరువు అభివృద్ధి పనులు డిజైన్ చేయాలన్నారు.

### ఎనర్జీ అండ్ కాస్ట్ సేవింగ్స్"పై వర్క్‌షాప్‌లు నిర్వహించిన ఈపీడీసీఎల్

శనివారంతో ముగిశాయి. ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదేశాల మేరకు సంస్థ పరిధిలోని 11 జిల్లాలకు చెందిన పారిశ్రామిక మరియు వాణిజ్య వినియోగదారుల కోసం విశాఖపట్నం, రాజమహేంద్రవరం నగరాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం విశాఖపట్నంలోని కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన వర్క్‌షాప్‌లో విశాఖపట్నం, అనకాపల్లి, ఏఎస్ఆర్ పాడేరు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన హెచ్‌టి వినియోగదారులు 35 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎలిమెంట్స్ ఎనర్జీ ఫౌండర్ ఆన్సన్ సాండో, సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) టి.వి. సూర్యప్రకాష్, సీజీఎం (కమర్షియల్) ఎస్. రాజబాబు తదితరులు నాయకత్వం వహించారు. వర్క్‌షాప్‌లో ప్రధానంగా డిమాండ్ రెస్పాన్స్ విధానం, టైమ్ ఆఫ్ డే (గ్రిడ్) టారిఫ్ విధానం, పీక్ మరియు ఆఫ్‌పీక్ సమయాల్లో విద్యుత్ వినియోగాన్ని మార్పు చేసుకోవడం ద్వారా ఖర్చులను తగ్గించుకునే మార్గాలపై వివరించారు. అదనంగా స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగాన్ని పర్యవేక్షించడం, ఎనర్జీ అనలిటిక్స్ డ్యాష్‌బోర్డ్ ద్వారా వినియోగ ధోరణులను విశ్లేషించే విధానాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సమర్థవంతంగా పాల్గొని విద్యుత్ వినియోగాన్ని మెరుగుపరచిన పారిశ్రామిక మరియు వాణిజ్య వినియోగదారులకు నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు. శనివారం రాజమహేంద్రవరం విద్యుత్ కార్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాలకు చెందిన 42 మంది పారిశ్రామిక మరియు వాణిజ్య వినియోగదారులతో పాటు సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇటువంటి నూతన తరహా‘ఎనర్జీ కాస్ట్ సేవింగ్స్” కార్యక్రమంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న హెచ్‌టి పారిశ్రామిక మరియు వాణిజ్య వినియోగదారులు, మరిన్ని వివరాల కోసం ఎలిమెంట్స్ ఎనర్జీని +91 9445613791 నంబర్‌లో సంప్రదించవచ్చు లేదా తమకు సమీపంలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సీజీఎం రాజబాబు తెలిపారు.

### వర్క్ షాప్‌ల ద్వారా యువ ఆర్థోపెడిక్ సర్జన్లకు ఉపయోగకరం

డా. ఐ. వాణి హాజరై ప్రారంభించారు. జాతీయ ఫ్యాకల్టీ సభ్యులు ప్రొఫెసర్ అనిల్ కె. భట్ - డీన్, రీలీది మణిపాల్ కోర్స్ డైరెక్టర్ డా. అజీష్ శంకరన్ - సీనియర్ కన్సల్టెంట్, హ్యాండ్ సర్జరీ, మైత్రా హాస్పిటల్, కోజికోడ్ కోర్స్ కోఆర్డినేటర్ డా.జి. కార్తికేయన్ - డైరెక్టర్ సీనియర్ కన్సల్టెంట్ ప్లాస్టిక్ సర్జరీ, చెన్నై డా. రవి భరద్వాజ్ - హ్యాండ్ సర్జరీ టెక్నిక్‌లను ప్రదర్శించారు. నిర్వాహకులు డా. టి. భవాని ప్రసాద్ ప్రొఫెసర్ బీవీడీ, డా. చంద్రశేఖరం నాయుడు ప్రొఫెసర్, డా. సి.వి. మురళీకృష్ణ ప్రొఫెసర్, డా. ఎస్. కిషోర్ బాబు ప్రొఫెసర్ డాక్టర్. సెక్రటరీ వర్క్‌షాప్‌ను చేపట్టారు. ప్రొఫెసర్ డా. రవీంద్రన్ డిసెక్షన్ కోసం క్యాడవర్లను అందించారు. అబ్జర్వర్‌గా ప్రొఫెసర్ ఎస్. చంద్రశేఖర్, ప్రొఫెసర్ ఉదయకుమార్ బొద్దపల్లి వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లు ప్రాక్టీస్ చేస్తున్న యువ ఆర్థోపెడిక్ సర్జన్లకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని వైద్యులు తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 40 మంది డెలిగేట్లు పాల్గొన్నారు.

## అశోక్ గజపతిరాజు నివాసంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యుల సందడి



ఈ మర్యాదపూర్వక భేటీలో స్పీకర్ సతీమణి చింతకాయల పద్మావతి, కుమారుడు మరియు టీడీపీ పట్టణ అధ్యక్షుడు చింతకాయల రాజేష్, ఆయన సతీమణి దివ్యశ్రీలు పాల్గొన్నారు. ఇరు కుటుంబాల మధ్య ఈ కలయిక ఎంతో ఆత్మీయంగా సాగింది. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు అశోక్ గజపతిరాజుకు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన విశాఖ జిల్లా ఏటికొప్పాక హస్తకళా బొమ్మలను బహుమతిగా అందజేశారు.

## చందనోత్సవం ఏర్పాట్లను కమిషనర్ పర్యవేక్షణ



రద్దీ మరియు భద్రతా పరమైన చర్యలను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, అదేవిధంగా కొండ దిగువన, మరియు కొండపైన పార్కింగ్, అతి సున్నితమైన ప్రదేశాల్లో. మరియు బస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన దిది కెమెరాలతో నిరంతర నిఘా కొనసాగుతుందని ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించిన తరువాత కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రత్యేక అధికారి, వియంఆర్‌డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ యన్ తేజ్ భరత్ తెలిపారు. ఈరోజు ఆయన అధికారులతో కలిసి చందనయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లను, దిది కెమెరాల పనితీరును పరిశీలించి ఇంకా తీసుకోవాలని జాగ్రత్తలను గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో వియంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ శ్రీ రమేష్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ వెంకట్రావు, కార్యదర్శి మురళీకృష్ణ. ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, దేవస్థానం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ స్థాయిలో ఏయూ ఖ్యాతి గాంచింది

- అనుబంధ కళాశాలలకు మార్గనిర్దేశం చేయాలి
- బోధన సిబ్బందికి శిక్షణ కల్పించాలి

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, ఏప్రిల్18 ప్రభాతవార్త**




ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేలాది మంది విద్యార్థుల సమక్షంలో అనుబంధ కళాశాలల యాజమాన్యాలు సమన్వయంతో చేసిన కార్యక్రమంలో విజయవంతమయింది. వేదికపై అతిథుల ప్రసంగాలు, విద్యార్థుల కళా ప్రదిభ ప్రదర్శించిన విధానం అందరీ అలరించాయి.ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయిలో ఖ్యాతి గాంచిందని విజ్ఞాన విశ్వవిద్యాలయం చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఏయూ అనుబంధ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాల వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుబంధ కళాశాలలకు మార్గనిర్దేశం చేయాల్సిన అవసరం విశ్వవిద్యాలయంపై ఉందన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో తాను భాగం కావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. విశ్వవిద్యాలయ అభ్యున్నతికి కృషిచేసిన అందరినీ మనం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ ఉన్న ప్రతీ భవనం వెనుక ఒక స్ఫూర్తి నిండి ఉంటుందన్నారు. జాతీయ స్థాయిలో ప్రముఖులను తీర్చిదిద్ది అందించిన ఘనత ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ఉందన్నారు. అనుబంధ కళాశాలలను మరింత పటిష్టం చేసే దిశగా విశ్వవిద్యాలయం కృషి చేయాలన్నారు. అనుబంధ కళాశాలల బోధన సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, ఎఫ్‌డిపిలను నిర్వహించాలని, పరిశోధన పత్రాల రచన, వర్క్‌షాప్‌లలో వీరిని భాగం చేయాలని సూచించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కరికులంలో మార్పులు తీసుకురావాలని, స్కిల్ డెవలప్‌మెంట్ భాగం చేయాలన్నారు. కమ్యూనియేషన్ స్కిల్స్‌ను మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏయూ శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని అనుబంధ కళాశాలల ఆధ్వర్యంలో తీర్చిదిద్దిన ప్రత్యేక సంచికను అతిధులతో కలిసి ఆవిష్కరించారు.ఉన్నత విద్యశాఖ కమీషనర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్త మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ప్రగతిలో ఏయూ కృషి ఉందన్నారు. యూనివర్సిటీ ప్రతిష్టను పెంచే విధంగా యువత నడచుకోవాలని, ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రతీ విద్యార్థి తన నైపుణ్యాలను పెంపొందించుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. వందేళ్ల ఘన చరితను తెలుసుకునే ప్రయత్నం చేయడం, దీనిని మరింత పటిష్టం చేయడం ఎంతో అవసరమన్నారు. విశ్వవిద్యాలయం వందేళ్ల ప్రయాణం అసాధారణ అంశమన్నారు. విద్యార్థులు ఏయూ నిర్వహించే అన్ని కార్యక్రమాలలో భాగం కావాలన్నారు. ఈ నెల 27న ఘనంగా వేడుకలు జరుపుకుందామని, దీనిలో అంతా భాగం కావాలని పిలుపునిచ్చారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ భవిష్యత్ యువతరానిదేనన్నారు. ఉన్నతమైన కలలు కనడం, వాటిని సాకారం చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర యువతతోనే సాధ్యపడతాయన్నారు. అనుబంధ కళాశాలల విద్యార్థులకు సైతం ఇంటర్న్‌షిప్‌లను అందిస్తామన్నారు. అనుబంధ కళాశాలలు ఏయూలో అంతర్భాగమన్నారు. చారిత్రక క్షణాలలో ఏయూ అనుబంధ కళాశాలు, విద్యార్థులు భాగం కావడం ఎంతో సంతోషదాయకమన్నారు.కార్యక్రమంలో ఏయూ సిడిసి డీన్ ఆచార్య టి.వెంకట కృష్ణ, ఏసిఎంఏ అధ్యక్షులు పైడా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, కార్యదర్శి జె.రమణాజి, గౌరవ అధ్యక్షులు టి.బలరామ కృష్ణ తదితరులు ప్రసంగించారు. అనంతరం సుదీర్ఘ కాలం సేవలు అందించిన ప్రిన్సిపాల్స్, అనుబంధ కళాశాలల విశిష్ట పూర్వ విద్యార్థులకు సత్కారాలు చేసారు. అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రధానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అత్యుత్తమ ప్రదర్శనలు, విద్యార్థుల ప్రతిభకు తార్కాణంగా నిలచాయి. అనంతరం అనుబంధ కళాశాలల కరస్పాండెంట్‌లు ప్రసంగాలు అందించారు.వివిధ కళాశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులకు వేదిక వద్ద ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం సదుపాయాలను కల్పించారు. మధ్యాహ్నం నుంచి వేదికపై ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు అందరినీ అలరించాయి. ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద విద్యార్థులు తయారు చేసిన వివిధ ఆవిష్కరణలు, ప్రత్యేక ప్రదర్శనలు ఆలోచింపచేసాయి.అదేవిధంగా విశ్వవిద్యాలయంలో ప్రముఖ ఘట్టాలను వివరిస్తూ ఏర్పాటుచేసిన ప్రత్యేక ఫోటోప్రదర్శన విశ్వవిద్యాలయ ఘనమైన వారసత్వాన్ని నేటితరం యువతకు పరిచయం చేసింది.

### జల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపు అవసరం :జీవీఎంసీ అధికారులు

**విశాఖపట్నం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

నీరు జీవనానికి ప్రాణాధారమని, ప్రతి నీటి బొట్టును సంరక్షించడం ద్వారా భావితరాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జీవీఎంసీ అదనపు కమిషనర్లు పి. నల్లనయ్య, డి.వి. రమణమూర్తి పేర్కొన్నారు. గాజువాక జోన్ శ్రీ తిరుమల నగర్‌లో నిర్వహించిన‘జలధార జలహారతి” కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భ జలాలు తగ్గిపోతుండటం, నీటి కాలుష్యం పెరుగుతుండటం ఆందోళనకరమని తెలిపారు. వర్షపు నీటి సంరక్షణకు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, శుద్ధమైన తాగునీటి వినియోగంపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాలనీలో ఏర్పాటు చేసిన నీటి సంరక్షణ చర్యలు, త్రీ లేయర్ టెర్రస్ గార్డెన్‌ను అధికారులు పరిశీలించారు. 180 ఇంకుడు గుంతల ద్వారా భారీ స్థాయిలో వర్షపు నీటిని నిల్వ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజలు, మహిళలు, చిన్నారులు పాల్గొని జల సంరక్షణపై అవగాహన పెంపుకు సహకరించారు.



కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు శ్రీనివాసు ,భరణి, టిపిఓ ప్రవీణ్, సానిటరీ సూపర్వైజర్ రామారావు, వార్డు శానిటేషన్, ప్లానింగ్, ఎమినిటీస్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలకు ప్రాధాన్యం

**ఆనందపురం ఏప్రిల్ 18, ప్రభాతవార్త:**



విద్యార్థి లో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలను చేపడుతున్నామని శ్రీ వెంకటేశ్వర విద్యాలయం కరస్పాండెంట్ ఎ.గణేష్ తెలిపారు. ఆనందపురం మండలం వేములవలసలోని శ్రీ వెంకటేశ్వర పాఠశాల 30 వ వార్షికోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయం కరస్పాండెంట్ ఏ గణేష్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక ప్రపంచంతో పోటీపడే విధంగా విద్యాభ్యాసాన్ని అందిస్తున్నామన్నారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గత ఏడాది పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని బి. సుస్మితను సన్మానించారు. విద్యార్థుల ఎదుగుదల, ప్రతిభను పెంపొందించడంలో సంస్థ యొక్క సమిష్టి నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ అధికారి టి.ఉమామహేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు చందక వంశీ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## భార్గవ ఇసుకాపట్లకు ప్రశంసపత్రం

**బీచ్ రోడ్డు, ఏప్రిల్ 18 ప్రభాతవార్త**



ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఏయూ అనుబంధ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాల వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఆంధ్రవిశ్వ విద్యాలయం ప్రపంచ స్థాయిలో ఖ్యాతి గాంచిందని విజ్ఞాన విశ్వవిద్యాలయం చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య భార్గవ ఇసుకాపట్ల కు ప్రశంసపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనని కొనియాడారు. రక్షణ ఆర్థిక వ్యవస్థలలో ఆర్థిక పరిపాలన, పారదర్శకత సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి తోర్పడ్డారని భారత నావికాదళంలో కార్యాచరణ సంసిద్ధత జవాబుదారీతనానికి మద్దతు ఇచ్చే సలహా విధులలో కీలక పాత్ర పోషించారు అని చెప్పారు. అనిట్స్ పూర్వ విద్యార్థి బి.ఇ., ఇసిఇ - 2005 అయిన భార్గవ భారత రక్షణ ఖాతాల సేవ (ఐడిఏఎస్)లో అంకితభావం గల అధికారిగా తనను తాను నిరూపించుకున్నారు అని తెలిపారు, భారత సాయుధ దళాల ఆర్థిక నిర్వహణకు గణనీయంగా తోడ్పడ్డారు. ప్రస్తుతం తూర్పు నావికాదళ కమాండ్‌లో సంయుక్త ఆర్థిక సలహాదారుగా పనిచేస్తున్న ఆయన, ఆర్థిక సలహా, ఆడిట్ పరిపాలనలో అసాధారణమైన సామర్థ్యాన్ని ప్రదర్శించారు అని పేర్కొన్నారు.

## పారిశుధ్య నిర్వహణలో లోపాలుంటే చర్యలు తప్పవు

**- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

**విశాఖపట్నం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**



నగరంలో పారిశుధ్య నిర్వహణలో లోపాలు కనిపిస్తున్నాయని వాటిని వెంటనే సవరించాలని లోపాలు ఉంటే చర్యలు తప్పవని, తాగునీటి సరఫరాలలో నిత్యం నాణ్యతా పరీక్షలు చేపట్టాలని, రోడ్లపై, వీధులలో భవన నిర్మాణ వ్యర్థాలు, ఫుట్ పాత్ లపై ఆక్రమణలు లేకుండా తగిన చర్యలు తక్షణమే చేపట్టాలని , ప్రతి భవన నిర్మాణం వద్ద గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేసుకొని నిర్మాణాలు చేపట్టేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శనివారం ఆయన నార్త్ జోన్ , 25 వ వార్డు లో బీవీకే కాలేజ్ జంక్షన్ నుండి సీతంపేట జంక్షన్ మీదుగా మధురానగర్ పరిసర ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ బి. రాము, సహాయక వైద్యాధికారి డాక్టర్ అప్పలనాయుడు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ తిరుపతిరావు లతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా కమిషనర్ 25 వ వార్డులో పర్యటిస్తూ మధురా నగర్ పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల నివాసితుల ఇండ్ల ముందు, వాణిజ్య సముదాయాల ముందు , సాయిబాబా దేవాలయం వద్ద అధికంగా వ్యర్థాలు ఉన్నందున, నిత్య పారిశుధ్య నిర్వహణపై సంబంధిత శానిటరీ సూపర్వైజర్ ను, వార్డు శానిటేషన్ కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో వారి విధి విధానాలు, పిన్ టు పిన్ కార్యాచరణ, నిత్యం వ్యర్థాలు సేకరించి తరలించే ప్రక్రియ, వాహనాల పనితీరు, విధుల నిర్వహణలో అలసత్వం కనిపిస్తుందని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆ సమీపంలో స్థానికులు ఇంటింటి నుండి నిత్యం వ్యర్థాల సేకరణ , తరలింపు ప్రక్రియ జరుగుటలేదని కమిషనర్ కు తెలియపరచగా. , శానిటరీ సూపర్వైజర్ రామారావు, వార్డు శానిటేషన్ కార్యదర్శి సతీష్ కుమార్ లను వారి నిత్య కార్యాచరణలో వివరాల పై ఆరా తీసి వారి విధుల నిర్వహణలో లోపాలు, అలసత్వం స్పష్టంగా కనిపిస్తున్నాయని వారిని వెంటనే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు సిద్ధం చేసి తనకు నివేదించాలని జోనల్ కమిషనర్ రాముకు కమిషనర్ ఆదేశించారు. వార్డులో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా లోపించిందని, వెంటనే సవరించి సరిచేయాలని , నిత్యం వార్డులలో ప్రత్యేక పర్యవేక్షణ జరపాలని సహాయక వైద్యాధికారి డాక్టర్ అప్పలనాయుడుకు కమిషనర్ ఆదేశించారు. జోన్ లో అన్ని వార్డులలో, సచివాలయాల పరిధిలో నిత్యం ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణ ,తరలింపు , వాహనాల పనితీరు, సానిటరీ సూపర్వైజర్లు ,సానిటరీ ఇన్స్పెక్టర్లు ,వార్డు శానిటేషన్ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికుల విధుల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా పారిశుధ్య నిర్వహణ ను మెరుగుపరిచేలా నిత్య పర్యవేక్షణ జరపాలని జోనల్ కమిషనర్ కు కమిషనర్ ఆదేశించారు. రోడ్లపై ,వీధులలో అధికంగా భవన నిర్మాణ వ్యర్థాలు కనిపిస్తున్నాయని, ప్రతి భవనం నిర్మాణంలో గ్రీన్ మేట్ ఏర్పాటు చేసుకోవాలని , అలా ఏర్పాటు చేసుకోలేని వారి భవన యజమానుదారులకు 25 వేల రూపాయలు జరిమానా విధించాలని లేదా భవన నిర్మాణ పనులను నిలిపివేసే ప్రక్రియ చేపట్టాలని , ఫుట్పాతులపై ఆక్రమణలు ఎక్కువగా కనిపిస్తున్నందున వాటిని వెంటనే తొలగింపుకు, పలుచోట్ల అస్తవ్యస్తంగా పోస్టర్లు అధికంగా ఉన్నాయని వాటిని వెంటనే తొలగించే ప్రక్రియలు చేపట్టాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ తిరుపతిరావుకు కమిషనర్ ఆదేశించారు. నగరంలో ప్రజలకు నిత్యం సరఫరా చేసే తాగునీటిలో నిర్ణీత సమయం పాటించాలని, సరఫరాలో లోపాలు లేకుండా నీటి నాణ్యతా పరీక్షలను నిత్యం జరిపి ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని , కాలువలలో నీటి పైపులైన్లు కలుషితం కాకుండా నిత్య పర్యవేక్షణ జరపాలని నీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారులకు

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, POTHULA JOHN (OLD NAME) S/O POTHULA MUSALAYYA R/O 17-101, SITARAMPETA, MUMMIDIVARAM, DR. BR AMBEDKAR KONASEEMA, I have changed my name as POTHULA VENKATA REDDY (NEW NAME) hereafter my name is known as POTHULA VENKATA REDDY (NEW NAME). (Ro.No.2426)

★ I, KALLURU TIRUPATHI RAO S/O KALLURU VENKATI, previously called KALLURU TIRUPATI RAO R/O 16-12-84, MUTCHAVANIPETA,NEAR PN COLONY, GUJARATHIPETA, SRIKAKULAM, now changed my name from KALLURU TIRUPATI RAO to KALLURU TIRUPATHI RAO. Henceforth I will be called as KALLURU TIRUPATHI RAO for all purposes. (Ro.No.2445)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## ప్లాస్టిక్ నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం తహశీల్దార్ త్రివేణి



డుంబ్రిగూడ ఏప్రిల్ 18, ప్రభాతవార్త

ప్లాస్టిక్ నివారణతో సంపూర్ణ ఆరోగ్యమని స్థానిక తహశీల్దార్ త్రివేణి చెప్పారు. ఇక్కడి మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపురాయి జలవిహారిలో ప్లాస్టిక్ నివారణ పారిశుధ్యంపై, ఎస్ఎఎస్ఎ ప్రోగ్రాం ద్వారా శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో సందర్శించే పర్యాటకులు వాడే ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారే నీటిలో పడేయకుండా నిర్వాహకులు ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లో వెయ్యాలన్నారు. తద్వారే చూపరులకు స్థానికులకు ఆరోగ్యకరమైన వాతావరణం కలుగుతుందన్నారు. అనంతరం ప్లాస్టిక్ నివారణపై ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో అరకు సర్కిల్ ఫారెస్ట్ రేంజర్ కోటేశ్వరరావు, ఆర్ఐ బిపిఎం రాజు రెవిన్యూ సిబ్బంది, ఫారెస్ట్ సిబ్బంది స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు దాసు అనారోగ్యంతో మృతి

### పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పాల్గుణ

డుంబ్రిగూడ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త



మండలంలోని కొల్లాపూటు పంచాయితీ మున్నీ గుడ గ్రామానికి చెందిన వైసిపి మండల మాజీ అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరరావు పెదనాన్న అయిన సీనియర్ నాయకుడు చిక్కుడు. దాసు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శెట్టి. పాల్గుణ మృతుడి స్వగ్రామానికి వెళ్లి దాసు పార్థివ దేహాన్ని పంచ కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్నిస్తూ ఓదార్పు నిచ్చారు. ఆయన వెంట వైఎస్ఆర్సిపి మండల సీనియర్ నాయకులు కృష్ణారావు, సింహాచలం, లీగల్ అడ్వైజర్ మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐని కలిసిన జనసేన నేత జి.కొండలరావు



డుంబ్రిగూడ, ఏప్రిల్ 18,ప్రభాతవార్త

అరకు నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన టి మల్లేశ్వర రావుని మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాల్వతో సన్మానించడం జరిగిందని డుంబ్రిగూడ మండల జనసేన పార్టీ సీనియర్ నాయకులు జి.కొండల రావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారా మార్గానికి తోడ్పాటు నివ్వాలని శాంతిభద్రతలపై ప్రతిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## ఈనెల 20న డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

పాడేరు,ఏప్రిల్18,ప్రభాతవార్త



అల్లూరి జిల్లా కేంద్రంలో గల స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు తో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ సోమ వారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనుందని కళాశాల ప్రిన్సిపల్ డా.వి. చిట్టబ్బాయి ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భం గా సేవా కార్యక్రమంలో భాగంగా తమ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఎన్ఎస్ఎస్, రెడ్ క్రాస్ వాలంటీర్లతో కలిసి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పలువురు ప్రముఖులు అధికారులు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని అన్నారు. రక్త దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## పాడేరు గ్రంథాలయంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ- ఆంధ్ర



పాడేరు,ఏప్రిల్18,ప్రభాతవార్త

ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ-ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రం పాడేరు శాఖ గ్రంథాలయంలో జలధార, జలహారతి కార్య క్రమం గ్రంథాలయ అధికారి వి.మానస ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బుర్రి కుమార్ రాజ్ పాల్గొని ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయ సిబ్బంది పాఠకులు పాల్గొన్నారు.

## నీటిని సంరక్షించడం యువత బాధ్యత

### ఇన్చార్జి ప్రిన్సిపల్ డా.టి.ఎన్ రసూల్

పాడేరు,ఏప్రిల్18,ప్రభాతవార్త



పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నీటిని సంరక్షిం చడం యువత బాధ్యత ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్.రసూల్ కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛతాంధ్ర ప్రోగ్రాము ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగం గా ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ టిఎన్ రసూల్ మాట్లాడుతూ ముందుగా విద్యార్థినీ విద్యార్థులకు నీటి సంరక్షణ మరియు స్థిరత్వ ప్రణాళిక గురించి అవగాహన కల్పించారు. ఇన్చార్జి ప్రిన్సిపల్ రసూల్ మాట్లాడుతూ యువతీ యువకులు నీటిని సంరక్షణ చేయాలని లీకేజీల గుర్తింపు, మరమ్మత్తులు జీరో లీకేజ్‌గా తయారు చేయాలని సూచించారు. వరుసపు నీటి సంరక్షణ, శుభ్రత కార్యక్రమాలు, నీటి నిర్వహణ వ్యవస్థల విస్తరణ, ఫ్యూచర్ ఆఫ్ వాటర్ ఎకనామిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.బి.రమేష్ బాబు విద్యార్థినీ విద్యార్థులచే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీ శంకర్రావు మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారంలో భాగంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛత ఆంధ్ర ఈవారం టీం గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. నీటి ధన ఆంధ్ర (వాటర్ పాజిటివ్ ఆంధ్ర) నీతి సమృద్ధి ఆంధ్రగా తీర్చిదిద్దాలని, యువతకు పిలుపునిచ్చారు. కళాశాలలో ఉన్న వాటర్ ట్యాంకులను, వాటర్ ఫిక్స్‌ను శుభ్రం చేశారు. జువాలజీ అధ్యాపకులు జి.దామోదర్, కే.నిర్మల, సుమిత్ర, ఇవి జయలక్ష్మి, లావణ్య, ప్రసన్న, జీవనజ్యోతి, వారిజ, మణికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఎపిటిఎఫ్ ధర్నా




పాడేరు,ఏప్రిల్18,ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ నాయ కత్వం పిలుపు మేరకు అల్లూరి సీతారామరాజు పాడేరు ఐటిడిఎ ఎదురుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ అల్లూరి జిల్లా అధ్యక్షులు రావుల జగన్ మోహనరావు అధ్యక్షతన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావుస్తున్నప్ప టికీ విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక అంశాలు పరిష్కారం కాలేదని జిల్లా అధ్యక్షులు రావుల జగన్ మోహన్‌రావు అన్నారు. ఇప్పటికీ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలకు ఎక్కువ సమయం కేటాయి స్తున్నారు. అలానే చాల ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలు కారణంగా నాణ్యమైన విద్య అందటం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 జూలై నుండి 12వ పిఆర్సి అమలు చేయాలి కానీ ఇప్పటి వరకు కమీషన్ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. కావున వెంటనే పిఆర్సి కమిటీ ఏర్పాటు చేసి 30% ఐఆర్ ప్రకటించాలని, ప్రతీ నెల ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేసారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గంగరాజు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.సత్యనారాయణ, జిల్లా సబ్ కమిటీ సభ్యులు అర్.నాగేశ్వర రావు, కె.పోతు రాజు, డి.శశికుమార్, ఎస్.శాంతకుమారి, పి.కొండమ్మ, గిరిజన ఉద్యోగుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పాడేరు ఐటిడిఎ పీఓ ఆదిత్యవర్మను కలిసిన ఉపాధ్యాయుల సంఘ ప్రతినిధులు

పాడేరు,ఏప్రిల్18,ప్రభాతవార్త



పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మను ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం పాడేరు మండల శాఖ అధ్యక్షులు ఎం.భానుమూర్తి ఆధ్వ ర్యంలో మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యా యులు ఎదుర్కొంటున్న సమస్యలను పీఓ దృష్టికి తీసుకు వెళ్లారు. పీఓను కలిసిన వారిలో మండల వార్కింగ్ ప్రెసిడెంట్ కె.ఈశ్వరమ్మ, ఉమెన్స్ సెక్రటరీ ఎం.ప్రమీల, కోశాధికారి, దేవుడమ్మ, సభ్యులు ప్రవీణ్, ఈశ్వరరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు పనులకు శంఖుస్థాపన చేసిన ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్యవర్మ



పాడేరు,ఏప్రిల్18, ప్రభాతవార్త

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం పాడేరు మండలం సేరుబయల గ్రామం లో ప్రధాన చెరువునకు జల హారతి ఇచ్చి పూడుకతీత పనులకు శంఖు స్థాపన చేసి పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్యవర్మ ప్రారంభించారు. చెరువు చుట్టుపక్కల ప్రాంతంలో చెత్తాచెదారం వేరువేసి చెరువు పరిసరాలను పరిశుభ్రంగా తయారు చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి గ్రామంలో మొక్కలు నాటి 100 రోజుల జలధార కార్యక్రమం పై అవగాహన కల్పించి గ్రామస్తులందరితో పీఓ ఆదిత్య వర్మ స్వర్ణాంత స్వచ్ఛందర ప్రతిజ్ఞ చేయిపించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జిసిసి డైరెక్టర్ బొర్రానాగరాజు, ఎంపీపీ రత్నకుమారి, పాడేరు ఎంపీడీవో తేజరతన్, ప్రజాప్రతినిధులు ఎస్వీవీ రమణ మూర్తి విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్తం చిందించిన రహదారులు

### ఆరు గంటల వ్యవధిలో అయిదు ప్రమాదాలు -ఇద్దరు మృతి, పలువురికి గాయాలు

గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త



ఒకేరోజు గంటల వ్యవధిలో జరిగిన అయిదు రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగించాయి. ఆరు గంటల వ్యవధిలో అయిదు రోడ్డు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృతి చెందగా పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయాల పాలయ్యారు. అల్లూరి జిల్లా చింతపల్లిలో గిరిజనుల ఆరోగ్య దైవంగా వెలుగొందుతున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ జాతరను చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఇలా నాలుగు రోజులపాటు చింతపల్లిలో నిర్వహించిన ముత్యాలమ్మ అమ్మవారి జాతరకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ముగింపు ఉత్సవాలకు అధిక శాతం మంది భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేయడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో సందడి చేశారు. ఎంతో ఆనందంగా ఈ ఉత్సవంలో పాల్గొన్న పలువురు తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. ఆరు గంటల వ్యవధిలో ఐదు ప్రమాదాలు జరిగాయి. తొలుత కొయ్యూరు గ్రామానికి చెందిన విష్ణు, కొండబాబు జాతర చూసి తిరిగి బంధువుల ఇంటికి వెళుతున్న సమయంలో శనివారం ఉదయం 2 గంటలకు రింతాడ వద్ద జరిగిన ప్రమాదంలో విష్ణు అనే యువకుడు చనిపోయాడు. 3:30 గంటలకు చింతపల్లి నుంచి కొయ్యూరు మండలం నల్లబిల్లి వెళుతున్న కేశవరావు, భాస్కర్ ద్విచక్రవాహనం అసరాడ జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. వీరిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి., చింతపల్లిమండలం తాజంగి పంచాయతీ వంతమామిడి గ్రామానికి చెందిన బాల యోగేంద్రనాయుడు, భాస్కర్ జాతర చూసుకుని నాలుగు గంటలకు స్వగ్రామానికి బయలుదేరారు. చింతపల్లి సమీపంలోని ఏపీఆర్ కాలేజీ సమీపంలోకి జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఢీకొట్టి పడిపోయారు. ఈ ఘటనలో బాల యోగేంద్ర నాయుడు అక్కడికక్కడే మృతిచెందగా భాస్కర్ తీవ్ర గాయాల పాలయ్యారు. ఆరు గంటలకు కొలపరి జాతీయ రహదారిపై మరో వాహనం అదుపుతప్పి ఇద్దరు తీవ్ర గాయాలయ్యాయి. పొట్టకూటి కోసం ఉత్తరప్రదేశ్ నుంచి చింతపల్లి జాతరలో ప్లాస్టిక్ పువ్వులు అమ్మేందుకు వచ్చిన ఓ కుటుంబం జాతర ముగిసిన తర్వాత సామాగ్రితో వ్యాన్ లో రాజమండ్రి వెళుతుండగా జీకే వీధి మండలం బొంతువలస ఘాట్‌లో ఎనిమిది గంటల సమయంలో ఆ వ్యాన్ బ్రేక్ ఫెయిల్ అయి అదుపుతప్పడంతో డ్రైవర్ కొండను ఢీ కొట్టించారు. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని రాజేంద్రపాలెం ఆసుపత్రికి తరలించగా స్థానిక వైద్యాధికారి జగదీష్ వారికి చికిత్సలు అందించారు. ఇలా ఆరు గంటల వ్యవధిలో ఐదు ప్రమాదాలు జరిగి ఆయా కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. జాతీయ రహదారితోపాటు, చింతపల్లి, జికె వీధి మండలాల్లో ప్రమాదాల నివారణ కు పోలీస్ శాఖ ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా రోడ్డు ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. ప్రతి ఒక్కరు బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ఇలాంటి ప్రమాదాలు జరగవని వీకే వీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఎస్సై సురేష్ తెలిపారు.

## మహిళా బిల్లు అడ్డుకున్న విపక్షాలు వైఖరిపై పాడేరులో బీజేపీ నిరసన

### కాంగ్రెస్ నిరంకుశ విధానాన్ని ఖండించిన బీజేపీ జిల్లా మహిళా మోర్చా



పాడేరు,ఏప్రిల్18,ప్రభాతవార్త

మహిళా బిల్లు అడ్డుకున్న విపక్షాలు వైఖరిపై పాడేరులో శనివారం బీజేపీ నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నిరంకుశ విధానాన్ని ఖండించిన బీజేపీ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కేజీయా రాణి, యువ మోర్చా అధ్యక్షులు మినుముల గోపాల పాత్రుడు, ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. నిన్న రాత్రి పార్లమెంట్‌లో మహిళా బిల్లును అడ్డుకోవడంపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీతో పాటు విపక్షాల వైఖరిని ఖండిస్తూ పాడేరు ఐటీడీఏ గేటు ఆర్‌టిసి బస్టాండ్ రోడ్డుపై బీజేపీ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ డౌన్ డౌన్ కాంగ్రెస్ వైఖరి నశించాలి..అంటూ ఆందోళన చేశారు, మహిళలకు సమాన హక్కులు, రాజకీయాల్లో అవకాశాలు కల్పించే ఈ కీలక బిల్లును అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అని జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి అన్నారు. మహిళా సాధికారతకు బీజేపీ కట్టుబడి ఉందని, ఈ బిల్లును అమలు చేయడంలో ఎలాంటి ఆటంకాలు వచ్చినా ప్రజల మద్దతుతో ముందుకు తీసుకెళ్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ మహిళా మోర్చా గెడ్డంగి గీత,మైనారిటి మోర్చా జిల్లా అధ్యక్షులు రాస పాపిటి రాజు యువ మోర్చా కొండబాబు, మోద స్వరూప, గొల్లోరి కృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

## జలధార - జలహారతి 100 రోజుల ప్రణాళికలు సక్రమంగా అమలు చేయాలి : జేసి తిరుమాని శ్రీపూజ

పాడేరు,ఏప్రిల్18,ప్రభాతవార్త



స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పాడేరు మండలం కిండంగి గ్రామంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ ప్రధాన చెరువునకు జల హారతి ఇచ్చి పూడికతీత పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చెరువు చుట్టుపక్కల ప్రాంతంలో తూములను, చెక్ డ్యామ్ లను పరిశీలించి పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను గ్రామస్తులతో కలిసి తొలగించారు. గ్రామంలో మొక్కలు నాటి 100 రోజుల జలధార కార్యక్రమం పై అవగాహన కల్పించి గ్రామస్తులందరితో స్వర్ణాంత స్వచ్ఛందర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎంపీడీఓ తేజో రతన్, పాడేరు మాజీ ఎంపీపీ బొర్రా విజయ స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై

## పరదేశిపుట్టు, దూరుపల్లిలో గ్రామస్తులకు జల సంరక్షణపై అవగాహన

### జిల్లా కలెక్టర్ టి.నిశాంతి



పాడేరు,ఏప్రిల్18,ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా, జల సంరక్షణే ధ్యేయంగా పెదబయలు మండలం, పెద్ద కోడపల్లి పంచాయతీ పరిధిలోని పరదేశిపుట్టు,దూరుపల్లి గ్రామంలో శనివారం జలధార- జల హారతిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జిల్లా కలెక్టర్ టి.నిశాంతి నిర్వహించరు. ముఖ్య అతిథిగా విచ్చేసి జిల్లా కలెక్టర్ గ్రామస్తుల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పొలిమేర నుండి ప్రజలతో కలిసి నడిచి గ్రామం అంతటా కలెక్టర్ పర్యటించారు. స్వచ్ఛత, పరిశుభ్రత నీటి నిల్వల, జల వనరులను స్వయంగా పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణ, 'జలధర - జల హారతి' కార్యక్రమంలో భాగంగా ఆమె గ్రామంలో మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఆ గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సు అనంతరం గ్రామ సభలో కలెక్టర్ మాట్లాడుతూ భావి తరాల కోసం జల సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. భూగర్భ జల మట్టాన్ని పెంచేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం వంటి పద్ధతులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామం పచ్చదనం పరిశుభ్రతగా ఉన్నప్పుడు ఎటువంటి దోమలు దరిచేరవని, లేక్ ఎక్కడ ఎక్కడ కాలువలతో నీటి కుంటలు నిండి ఉంటే దోమలు చేరి మలేరియా వ్యాధులు వ్యాపిస్తాయని అలా లేకుండా గ్రామస్తులందరూ కలిసికట్టుగా గ్రామాన్ని శుభ్రంగా ఉండేటట్టు చూసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన దోమతెరలు వాడాలని, గ్రామంలో దోమల పిచికారి మందును వేయించాలని తెలిపారు. గ్రామస్తులతో సమస్యలపై అడిగి తెలుసుకుని గ్రామంలో అంగన్వాడి భవనాన్ని నిర్మించుటకు అనుమతి నిచ్చారు. గ్రామంలో 18 సంవత్సరాల లోపు పిల్లలకు బాల్య వివాహం చేయొద్దని, వారిని పూర్తిస్థాయిలో చదువుకొనివ్వాలని, 18 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే పెళ్లిళ్లు చేయాలని ఆమె సూచించారు. గ్రామంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నారని, ఆర్గానిక్ పంటల ద్వారా పండిన పంటలు తింటే మంచి ఆరోగ్యంతో ఉంటారని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులతో ధూరుపల్లి గ్రామ ప్రజలందరితో కలిసి జల సంరక్షణ మరియు స్వచ్ఛతపై కలెక్టర్ గారు ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా పరదేశి పుట్టు గ్రామంలో గ్రామస్తులతో కొద్దిసేపు ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని గ్రామంలో కావాల్సిన స్కూల్ బిల్డింగ్ నిర్మాణము, బ్రిడ్జి పనులకు అనుమతులను మంజూరు చేశారు.అదే గ్రామంలో వెల్నెస్ సెంటర్, హాట్ బజార్, డంపింగ్ యార్డ్ కు కరెంటు లేదని తెలుపగా 15 రోజుల్లో కరెంటు ఏర్పాటు చేస్తారని తెలిపారు. గ్రామంలో రేషన్ కార్డులు ఎవరైనా లేని వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఆర్డిఓ లోకేశ్వరరావు, డి ఎల్ పి ఓ పి ఎస్ కుమార్, డీఈఓ కృష్ణారావు, డిడి ట్రైబల్ వెల్ఫేర్ పి.బి.కె పరిమిల, పి డి ఐ సి డి ఎస్, మలేరియా అధికారి, ఎంపీడీవో శ్యాంసుందర్,స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




## హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంపై గిరిజన సంక్షేమశాఖ మంత్రి జిల్లా కలెక్టర్ వైఖరి స్పష్టం చేయాలి



### గిరిజన సంఘం డిమాండ్

హుకుంపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త

హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలస పరిసర గ్గ్రామాల్లో రహస్యంగా సర్వే చేస్తున్న సర్వే ఆఫ్ ఇండియా సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ అధికారులైన ఆనంద్ సాహు, వర్ధబోయన గోపాలరావు బృందాన్ని ఈ నెల 17న మజ్జి వలస గ్రామంలో ఆదివాసులు అడ్డుకుని స్థానిక తహశీల్దర్, పోలీసులకు గ్రామస్తులు అప్పగించారని జిల్లా కలెక్టర్, రెవిన్యూ అధికారులకు తెలియకుండా కేంద్ర సర్వే బృందం ఎలా సర్వే చేశారని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి బలదేవ్ ప్రశ్నించారు. శనివారం మజ్జివలస గ్రామంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహస్యంగా సర్వే చేస్తున్న సర్వే బృందంపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చెయ్యాలని డిమాండ్ చేశారు. గతంలో గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అప్పటి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు గిరిజనులు ఆమోదం లేకుండా సర్వేలు, ఇతర పనులు నిలుపుదల చేస్తున్నామని ప్రకటన ఏమైందని ప్రశ్నించారు. ప్రస్తుతం మజ్జివలస పరిసర గ్రామాల్లో సర్వేలు జరుగుతున్నా నేపధ్యంలో గిరిజన మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. భూర్జ ఎంపీటీసీ మజ్జి హరి, పెసా ఉపాధ్యక్షులు పరశురాం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టీ కృష్ణారావు,ఎస్ కొండలరావు గెమ్మెలి చినబాబు, వి.లక్ష్మణరావు, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు మజ్జి కృష్ణంరాజు, మజ్జి పరశురాం,మజ్జి బాలరాజు, ప్రసాద్, కళ్యాణిశ్రీ, కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మండల్ పరిషత్‌ను సందర్శించిన ఏజెన్సీ తొలితరం ఉపాధ్యాయుడు శంకర్ రావు మాస్టర్

హుకుంపేట ఏప్రిల్ 18, ప్రభాతవార్త



హుకుంపేట మండల్ పరిషత్‌ను, ఏజెన్సీలో తొలి తరంలో పనీ చేసిన ఉపాధ్యాయుడు శంకర్ రావు మాస్టర్ పర్యటించారు. 1967 సంవత్సరం నుండి ఏజెన్సీలో పనీ చేసిన శంకర్‌రావు మాస్టర్ తన కుమారుడి తో కలిసి హుకుంపేట మండల్ పరిషత్‌ను సందర్శించి ఎంపీపీ కూడ రాజుబాబు, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండల రావులతో, ఆ నాటి పరిస్థితులు, జ్ఞాపకాలు వివరించారు. చోడవరం నుండి హుకుంపేట వరకు అందాల రాణి బస్‌లో వచ్చి, ఆ నాడు సరైన రోడ్లు లేవని, ఐనా సరే ఏజెన్సీ 11 మండలాల్లో కాలి నడకన నడిచి,గిరిజనులలో నిశ్వార్థంగా విద్యా వ్యాప్తి చేశామన్నారు. గిరిజనులకు సుధీర్ఘ కాలంగా సేవలు అందించిన శంకర్ రావు మాస్టర్‌కు ఎంపీపీ, వైస్ ఎంపీపీలు కృతజ్ఞతలు తెలిపారు.

## మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సమస్యలు త్వరితగత ప్రభుత్వం పరిష్కరించండి



### పాడేరు ఐటీడీఏ పిఓ ఆదిత్య వర్మ

పాడేరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సమస్యలను త్వరగా పరిష్కరించాలని పాడేరు ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ అధికారులను ఆదేశించారు. శనివారం పాడేరు మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని పీఓ ఆదిత్య వర్మ ఆకస్మికంగా తనిఖీ చేసారు. హాస్పటల్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలింతలు, గర్భిణీ స్త్రీలతో ముచ్చ టించి వారికి అందుతున్న సేవలపై పీఓ ఆరా తీశారు. హాస్పటల్లో తనిఖీ చేయగా విద్యుత్తు, ప్లంబింగ్, నీటి సమస్యలు ఉన్నాయని రోగులు పేర్కొనగా ఆస్పత్రి నిర్వాహక అధికారులను పిలిచి వెనువెంటనే పరిష్క రించాలని పీఓ ఆదేశించారు. రోగులకు వైద్యసేవలపై నిర్వాహన సిబ్బందికి తగు సూచనలు సలహాలు పీఓ అందించారు. గర్భిణీలకు, శిశువులకు ఎటు వంటి ఇబ్బంది లేకుండా చూడాలని వైద్య అధికారులు పీఓ ఆదేశించారు. జిల్లా ఆస్పత్రి ఇంచార్జి డా.ఎర్రయ్య, డా.టి.నరసింగరావు, వైద్యులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పీఓ పాడేరు ఎంపీడీఓ కార్యాలయం నుంచి మాతా శిశు ఆస్పత్రి వరకు అరకిలో మీటర్ వరకు నడుచుకుని వచ్చి ఆస్పత్రిలో నెలకొని ఉన్న సమస్యలపై గర్భిణీలకు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు.

## కొండపోడు వివాదం.. గిరి మహిళపై నాటు తుపాకితో హత్యాయత్నం

డుంబ్రిగుడ ఏప్రిల్ 18 ప్రభాతవార్త



కొండపోడు వ్యవసాయ భూమి సాగు వివాదంలో గిరిజన మహిళ హత్యాయత్నానికి పాల్పడిన ఘటన అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలం పోతంగి పంచాయితీ బీజుమరవలస గ్రామంలో చోటు చేసుకుంది. బాధితురాలి కుటుంబీకులు తెలిపిన వివరాలు బీజుమరవలస గ్రామానికి చెందిన కిల్లో బిమల భర్త అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భర్త వారసత్వంగా చేస్తున్న కొండపోడు వ్యవసాయ భూమికి సంబంధించి కొన్ని రోజులుగా ఆ గ్రామానికి చెందిన కిల్లో లక్ష్మణరావుతో వివాదం కొనసాతుందనీ కొండపోడు వ్యవసాయం చేసుకునేందు కు బాధిత గిరిజన మహిళ తన కుమార్తెతో శనివారం ఉదయం గ్రామ సమీపంలో గల కొండకు వెళ్లారు. ఈ క్రమంలో కోపోద్రేకుడైన లక్ష్మణరావు తల్లికూతిరితో గొడవలకు దిగారని చెప్పారు. నాటు తుపాకిని తెచ్చి ఇద్దరిపై కాల్పులు జరిపారన్నారు. బాధిత గిరిజన మహిళ శరీరంపై బుల్లెట్లు దిగడంతో అపస్మారక స్థితిలో కొట్టుమిటాడుతుండడంతో పరుగున వచ్చిన బాధిత కుమార్తె కుటుంబీకులకు సమాచారం అందించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెకు అంబులెన్స్లో అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్కు తరలించాలని వైద్యులు సూచించారని బాధిత కుటుంబీకులు రాజు, శిరీష తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

## రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

### సుజాతనగర్ లో ఎఎస్ఆర్ జిల్లా దళిత సమాఖ్య సమావేశం

అరకులోయ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లాలో దళిత సమైక్య సమావేశం శనివారం డుంబ్రి గూడ మండలంలోని సుజాతనగర్‌లో జరిగింది. ఏజెన్సీ ప్రాంతంలో దశాబ్దాలుగా స్థిరపడ్డ పలు ప్రాంతాల దళితులు, దళిత నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయవాది రత్నరాజు మాట్లాడుతూ దేశంలో మారుతున్న సామాజిక పరిస్థితుల దృష్ట్యా దళితులలోని 59 కులాలు ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దళిత ఐక్యత అత్యవసరమని, అనివార్యమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పోరాటాన్ని గుర్తుచేస్తూ, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అరకులోయ అంబేద్కర్ అసోసియేషన్ నాయకుడు లెనిన్ రాజు (భూపతి) మాట్లాడుతూ కుల, మత భేదాలకు అతీతంగా దళితులు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రముఖ మీడియా ప్రతినిదులు డేవిడ్ రాజు, పైడి రాజులు మాట్లాడుతూ ఈ ప్రాంత దళితులు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి మీడియా బాధ్యతాయుతంగా పనిచేస్తుందని తెలిపారు. ఎస్సీ నాయకుడు ప్రభాకర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో కూడా దళితులపై వివక్ష ఇంకా కొనసాగుతుందన్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంఘటిత పోరాటం అవసరమని అభిప్రాయపడ్డారు.అరకు, అనంతగిరి, డుంబ్రిగూడ మండలాలతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా దళిత సంఘాలను ఏర్పాటు చేసి సమైక్యతను పెంపొందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.సుజాతనగర్, బొందుగూడ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమాన్ని జిల్లా దళిత సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మండా చంద్ర శేఖర ప్రసాద్ (నానిబాబు) పర్యవేక్షించారు. గిరిజన ప్రాంతాల్లో మొదటి సారి దళితులను సంఘటిత పరుస్తూ నిర్వహించే బద్ద ఈ సమావేశం ఈ ప్రాంతంలో అధిక ప్రాముఖ్యత సంతరించుకుంది. సమావేశానికి దళిత నాయకులు కె. రవికుమార్, టీ. చంద్ర రావ్, ఎందవ లక్ష్మణ్, చంటిబాబు, మోహన్ ( బాబి,) ప్రభాకర్, మోజెస్, మత్తి కిరణ్ కుమార్ పాల్గొన్నారు. మండలానికి చెందిన దళిత నాయకులూ సతీష్, సుధాకర్, కిరణ్,కృష్ణ , శాంతినగర్ కు చెందిన రాజేష్ లు గౌరవ అతిదులు గా పాల్గొన్నారు.

vsp12:vsp12.qxd 19-04-2026 00:13 Page 1



## చలివేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే కొణతాల



అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త) అనకాపల్లి పట్టణం, మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ వారిచే వేసవి కాలం సందర్భంగా అనకాపల్లి పట్టణంలో పలు ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాలు మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవని దృష్టిలో పెట్టుకొని ఈ చలివేంద్రాల ద్వారా ప్రజలు దాహార్తిని తీర్చుకోవడానికి దోహదపడుతుందన్నారు. గవర్నర్ కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి పాల్గొన్నారు.

## ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ సందర్శన



(ఎస్. రాయవరం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త ) మండలంలో అడ్డరోడ్డు తిమ్మాపురం ఆదర్శ కళాశాలలో ఏర్పాటుచేసిన పి ఆర్ టి యు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ ను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌ను వినియోగించుకొని ఉన్నత విద్యాభ్యాసానికి ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు మంచి ర్యాంకులు సంపాదించి ప్రభుత్వ కళాశాలలో సీట్లు సంపాదించాలని అలాగే ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ కళాశాల ప్రిన్సిపల్ సీతారామరాజు, పి ఆర్ టి యు సభ్యులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు : ఎస్ఐ



బుచ్చయ్యపేట, ఏప్రిల్ 18, ప్రభాత వార్త: మండలంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఏ. శ్రీనివాసరావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం బంగారుమెట్ట గ్రామ శివారు ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామ శివార్లు, నిర్మానుష్య ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపా లను అరికట్టేందుకు అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. పొదలు, తోటలు, మారుమూల ప్రాంతాల్లో రహస్యంగా సాగే కార్యకలాపాలను గుర్తించేందుకు గాలింపు చేపట్టారు. బహిరంగ మద్యపానం, జూదం, కోడి పందాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నిస్తూ, యువతకు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక శక్తులకు తావు లేకుండా నిరంతరం నిఘా కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయుల నిరసన



అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 18 ,(ప్రభాత వార్త): ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లిలో ధర్నా, ర్యాలీ, మానవహారం నిర్వహించారు. రాష్ట్రంలోని విద్యారంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోరుతూ స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో కాలయాపన చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపిటిఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బి వెంకటపతి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్, గౌరవ అధ్యక్షులు ధర్మారావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై శ్రీనివాస్, ఎస్ దుర్గాప్రసాద్, జిల్లా నాయకులు కొణతాల గణేష్. డి నూకరాజు, ధర్మారావు, సన్యాసినాయుడు, స్వరూప కిరీటి భారీ ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాకలపాడులో పోలీస్ ఆపరేషన్ వజ్రప్రహార్



గొలుగొండ ఏప్రిల్ 18, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న ఆపరేషన్ వజ్రాప్రహార్ కార్యక్రమంలో భాగంగా పాకలపాడు లో పోలీస్ తనిఖీలు నిర్వహించారు. పోలీస్ ఆపరేషన్‌లో గ్రామంలో కార్డెన్‌సెర్చ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ఆపరేషన్ వజ్రప్రహార్” డి. ఎస్. పి శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగానే అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సబ్‌డివిజన్ పరిధిలోని గొలుగొండ పోలీస్ స్టేషన్‌కు చెందిన పాకలపాడు గ్రామంలో శనివారం భారీ స్థాయిలో కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. ఇందుకోసం రూరల్ సీఐ రేవతమ్మ స్థానిక ఎస్ ఐ పి రామారావు, నాతవరం ఎస్ఐ తారకేశ్వరరావు, మాకవరపాలెం ఎస్ ఐ తో పాటు ఈగల్ టీం మొత్తం 70 మంది ఈ ఆపరేషన్లో పాల్గొన్నారు డిఎస్పి అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని హాట్‌స్పాట్ ప్రాంతాలు, అద్దె ఇళ్లు, ఖాళీ భవనాలు మరియు పాడుబడిన ఇళ్లలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానం ఉన్న ప్రాంతాలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 700 ఇళ్లు, 1000 మంది వ్యక్తులు, 270 వాహనాలు తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని 44 మోటార్ సైకిళ్లు మరియు ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. పాత నార్కోటిక్ కేసుల్లో ఉన్న అనుమానితులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు చట్టపరమైన నష్టాలపై అవగాహన ద్వారా వివరించారు. ఇటువంటి వ్యసనాల ద్వారా ముఖ్యంగా యువత భవిష్యత్తును మాదకద్రవ్యాలు నాశనం చేస్తున్నాయని హెచ్చరిస్తూ గ్రామాల స్వచ్ఛంగా ఉండాలంటే అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రజలు పోలీసులు మమేకంగా పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. అలాగే పోలవరం గ్రామంలో మాదకద్రవ్యాలు వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ పరిసరాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఈగిల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 లేదా 100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. కార్యక్రమం ముగింపులో పోలీసు అధికారులు, సిబ్బంది మరియు గ్రామ ప్రజలతో కలిసి “ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ” చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఇలాంటి ప్రత్యేక చర్యలు రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం కొనసాగుతాయని పోలీసులు ప్రజలకు వివరించారు.

## ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలవాలి : ఎమ్మెల్యే



అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని మాజీమంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి మండలం వెలుగు డి ఆర్ డి ఏ, ప్రజలు ప్రభుత్వానికి అనుసంధానంగా పనిచేసే విలేజ్ ఆర్గనైజర్ అసిస్టెంట్స్ 74 మందికి ప్రభుత్వం ఉచితంగా స్మార్ట్ ఫోన్స్ అందించింది. అనకాపల్లి మండలంలో పనిచేస్తున్న విలేజ్ ఆర్గనైజర్ అసిస్టెంట్స్ అందరికి మాజీ మంత్రి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సాంసంగ్ 5జి స్మార్ట్ ఫోన్లు శనివారం అందజేశారు. విలేజ్ ఆర్గనైజర్ అసిస్టెంట్స్ సమస్యలను తెలుసుకొని అతి త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందించి సమస్యలను పరిష్కరించే విధంగా ఆ చర్యలు తీసుకుంటామని అన్నారు. మొబైల్ ను పిల్లలకి దూరంగా ఉంచాలని, పిల్లలకు మంచి బుద్ధులు, సక్రమమైన మార్గంలో పెంచాలని, ఈ విషయాన్ని మీ ద్వారా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. గవరా కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు , గంగుపం జగదీష్ కూటమి నాయకుడు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



గొలుగొండ ఏప్రిల్ 18, ప్రభాతవా ర్తమీ పిల్లలకు బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా విద్యలో తీర్చిదిద్దే బాధ్యత మాది అంటూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. జోగంపేట హై స్కూల్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడి పిలుస్తోంది కార్యక్రమం ద్వారా పిల్లల తల్లిదండ్రులను కలిసి భరోసా కల్పిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చేరిక ఏడాదికి ప్రతి ఏడాదికి గణనీయంగా తగ్గుతూ వస్తుందని కార్పొరేట్ విద్యలకు ఆశపడి ప్రభుత్వ విద్య నిర్లక్ష్యం చేయవద్దని మీ పిల్లలను విద్యలో తీర్చిదిద్దే బాధ్యత మాది అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వి. నాగభూషణం ఆధ్వర్యంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ మురళి, అది సర్పంచ్ సుర్ల బాబ్జి, జువ్వల లక్ష్మి ఉపాధ్యాయులు సుబ్బా రావు, ప్రసాద్ ప్రత్యేక ఉపాధ్యాయులు తమ్మిల మాణిక్యం, వ్యాయామ ఉపాధ్యాయులు లోవ రాజు, ఈశ్వర రావు,క్రాంతి కుమార్,కె.సత్యనారాయణ, నాగ రాజు,బాబు రావు, ఎ.సత్యనారాయణ, వెంకట రమణ, నారాయణరావు, రామ రాజు, రామ్ కుమార్, ఉపాధ్యాయనీయలు, భ్రమరాంబిక, కుమారి, శ్రీ కావ్య,ఉషా ప్రభ, రాజేశ్వరి, దేవి సమక్షంలో హై స్కూల్, పాఠశాల పరిసర గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అలాగే కొత్త జోకంపేట దొర చెరువులో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న వారి వద్దకు వెళ్లి ప్రత్యేక సమావేశం ద్వారా అవగాహన కల్పించారు. బడి ఈడు పిల్లలను తప్పక ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే అన్ని అర్హతలతో ఉద్యోగాలు సంపాదించుకున్న మేము మీ పిల్లలకు పూర్తిస్థాయి విద్యాబుద్ధులు నేర్పించే బాధ్యత మాది మమ్మల్ని నమ్మి మీరు మీ పిల్లలను మా దగ్గరికి పంపించండి అంటూ విన్నవించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ,ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయనీయలు బృందం పాఠశాల ఎన్రోల్మెంట్ డ్రైవ్ బ్యానర్ తో బడి పిలుస్తోంది అనే నినాదాలతో కొత్త జోగం పేట గ్రామంలో ఇంటింట ప్రచారం చేస్తూ పిల్లలను మా స్కూల్ లో చేర్పించండి అంటూ ప్రచారంతో ఆకట్టుకున్నారు. విద్యా మిత్ర కిట్, మూడు జతల యూనిఫాం, ఒక జత షూస్, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం, బెల్టు, తల్లికి వందనం, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్ ప్రభుత్వం వారు ఉచితంగా ఇస్తున్నారని తెలియజేశారు. ఇవే కాకుండా నాణ్యమైన విద్యను బోధించే ఉపాధ్యాయుల బృందం, విశాలమైన ప్రాంగణం, తరగతి గదులు, ప్రత్యేక ఉపాధ్యాయులు ద్వారా దివ్యాంగలు కుప్రత్యేక శిక్షణ, బోధన,ఐ. ఎఫ్.ఈ ప్యానెల్ ద్వారా బోధన, విశాలమైన క్రీడా మైదానం, వ్యాయామ ఉపాధ్యాయులు ద్వారా స్పోర్ట్స్ లో ప్రత్యేక శిక్షణ, ఆహ్లాదకరమైన వాతావరణం, విద్యార్థులు ప్రాజెక్ట్స్ చెయ్యటానికి సైన్స్ అండ్ మాథ్స్ ల్యాబ్స్ కలవు... కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ గుడివాడ మురళీ, వైస్ ఛైర్మన్ సింహాచలం, సర్పంచ్ జువ్వల లక్ష్మి, మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జీ, ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ కమిటీ ఛైర్మన్ చిట్ల చలపతి , గ్రామ పెద్దలు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జల సంరక్షణకు కలెక్టర్ కృషి.. మట్టి మోస్తూ ప్రజలకు మార్గదర్శం



(రాంబిల్లి ఏప్రిల్ 18 ప్రభాతవార్త): రాంబిల్లి మండలం కృష్ణం పాలెం లో ఉర చెరువులో శనివారం స్వచంద్ర స్వర్ణాంధ్ర, జలాధార జలహారతి 100 రోజుల ప్రణాళికలో భాగంగా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఉపాధి పథకంలో చేపట్టిన చెరువు పనులను పరిశీలించి పలుగు పారతో మట్టిని తవ్వి గంపకు ఎత్తుకొని గట్టు వరకు మోసారు, పారతో మట్టిని కలెక్టర్ తవ్వుతుంటే ఉపాధి శ్రామికులు ఆశ్చర్యంలో మునిగిపోయారు, మహిళా కలెక్టర్ శ్రామికులను ప్రోత్సహిస్తూ వారితో కలిసి మట్టిని చెరువుగట్టుకు మోయడంతో చూసిన వారంతా నిర్గాంత పోయారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు, భూగర్భ జలాలను వృద్ధి చేయడంలో అందరూ భాగస్వాములు అవ్వాలని కోరారు, భావితరాల కోసం జల సంరక్షణ ఎంత ముఖ్యమో గుర్తించి అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ఉపాధి పథకం నిధులు రూ 10 లక్షలతో ఊర చెరువులో పనులు చేపట్టారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, ఆర్డిఓ రమణ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మలాదేవి, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## ఎంఆర్ సంస్థ ఆగడాలపై గళమెత్తిన ఎంపీటీసీ సభ్యులు








(నక్కపల్లి, ప్రభాతవార్త): మండలంలోని వివిధ గ్రామాల్లో మైనింగ్ పేరు చెప్పి ఏ ఎంఆర్ సంస్థ నిర్వాహకులు వివిధగ్రామాల్లో సృష్టిస్తున్న ఇబ్బందులు పైన తక్షణమే రెవెన్యూ అధికారులు దృష్టిపెట్టి చర్యలు తీసుకోవాలని లేకపోతే ఉద్యమించక తప్పదని మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ తో పాటు ఎంపీటీసీ సభ్యులు కుంచె మధు, బచ్చల రాజు ,మెరుగు నాగేశ్వరరావు, ఆకేటి గోవిందరావులు మండిపడ్డారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన శనివారం ఉదయం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పెద్ద ఎత్తున సభ్యులు మండిపడ్డారు. ప్రభుత్వం ఎంత ప్రతిష్టాత్మంగా పరిశ్రమల కోసం గ్రామాలను ఖాళీ చేసి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా గృహ నిర్మాణాలు చేపడుతుంటే ఆ గృహ నిర్మాణాలు కోసం నిర్వాసితులు మట్టి గ్రావెల్ పునాదుల్లో వేసుకోవడానికి తీసుకెళ్తుంటే వారి నాన ఇబ్బందులు పెట్టి దారిదోపిడి దారి లాగా వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తూ ఇబ్బందులు గురి చేస్తున్నారని ఇదేనా వారికి చేసిన న్యాయం అంటూ నానాజీ సభలో రెవిన్యూ అధికారులను ప్రశ్నించారు. ఏఎంఆర్ పేరు మీద ఎటువంటి ఐడి కార్డులు కూడా లేకుండా ఈ విధంగా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. మీకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గృహ నిర్మాణాలకు సహకరిస్తామని చెప్పిన జిల్లా కలెక్టర్ వీలు చేస్తున్న అరాచకాలు పై దృష్టి పెట్టాలని లేనియెడల ఉద్యమించకు తప్పదని కోరారు. ఎంపీటీసీ మధు మాట్లాడుతూ దారి దోపిడి దారుల్లాగా చెక్ పోస్ట్ లు పెట్టి ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ తాసిల్దార్ నారాయణరావు మాట్లాడుతూ మా దృష్టికి సమస్య వచ్చిందని పూర్తిస్థాయిలో వారికున్న అనుమతులు ఏంటో పరిశీలించి చర్యలు తీసుకుంటామని మండలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఉపమాక ఎంపీటీసీ కొల్నాటి పార్వతి సభలో మాట్లాడుతూ గ్రామంలో ఉన్న జగనన్న కాలనీ తో పాటు ఉపమాక గ్రామంలో మంచినీటి సమస్య అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీకి సక్రమమైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే అధికారులు స్పందించి రహదారులు నిర్మించాలని కోరారు. జలజీవన్ మిషన్ పనులు విషయమై మండలంలో పూర్తయ్యాయ లేదా ఎందుకు పూర్తి అవటం లేదు ఎక్కడికి అక్కడ గోతులు తవ్వి ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్నారని మండల పరిషత్ ఉపాధ్యక్షులు నానాజీ, అదనపు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, బచ్చల రాజు, కుంచే మధు, మెరుగు నాగేశ్వరరావు నీటిపారుదల శాఖ అధికారులను ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు లకు బిల్లులు అందన కారణంగా పనులు విషయంలో జాప్యం జరిగిందని ,కొద్ది రోజుల్లో పనులు పూర్తవుతాయని చెప్పారు. ఈ తవ్విని గోతుల్లో ప్రజలు పడిపోయి ప్రమాదాలు గురవుతున్నారని బచ్చల రాజు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీటీసీ ఆకేటి గోవిందరావు మాట్లాడుతూ సిఎస్ డిటి మండలంలో పనిచేస్తున్నారా అదే కాకుండా మండల సర్వేలు, ఆరై ఉన్నారా లేదా ఇస్తున్న ఫిర్యాదులకు పరిష్కారం చేస్తున్నారో లేదో అని సభలో ప్రశ్నించారు. స్పందించిన ఉప తాసిల్దార్ నారాయణరావు తపాలా కు వచ్చినఫిర్యాదులు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రేషన్ డిపోలు తనిఖీలు చేస్తామని చెప్పకుండా ఏ డీలర్ కూడా రేషన్ డిపోను మార్చడానికి వీలులేదని, నిర్లక్ష్యంగా ఉన్న సిఎస్ డిటి పై చర్య తీసుకుంటామని చెప్పారు. మంచినీటి సమస్యపై నానాజీ మాట్లాడుతూ నక్కపల్లి కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే పరిష్కరించాలని కోరారు. 40 సంవత్సరాలుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి తక్షణమే నూతనంగా స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ కొంచెం మధు సభ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఏ ఈ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భారీ వాహనాలు కారణంగా వేంపాడు గ్రామం పూర్తిస్థాయిలో రహదారులు దెబ్బతిన్నాయని ఆ వాహనాలు తాకిడికి గ్రామస్తులు భయాందోళన గురవుతున్నారని తక్షణమే ఆ వాహనాలు నిలుపుదల చేయాలని లేనియెడల ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఉపాధి హామీ కూలీల విషయంలో పూర్తిస్థాయిలో న్యాయం జరగాలని పెద్ద తీనారల్లో పనులు ప్రారంభించాలని ఎంపీటీసీ మెరుగు నాగేశ్వరరావు కోరారు. స్పందించిన నానాజీ తక్షణమే పనులు గ్రామ సభ ద్వారా చర్చించి కల్పించే విధంగా కృషి చేయాలని ఏపీవో భాగ్యలక్ష్మి కి కోరారు ఉచిత బస్సు కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆర్టీసీ డ్రైవర్లు బస్టాప్ లో బస్సులు ఆపక ఊరు చివరన బస్సులు ఆపుతున్నారని దాని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే గ్రామ బస్టాపుల్లో బస్సులు ఆపాలని కోరగా ఎంపీడీవో చలపతిరావు ,ఆర్టీసీ అధికారులకు లేఖ రాస్తామని అటువంటి సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జడ్పిటిసి గోసల కాసులమ్మ, ఏవో దెందుకూరు సీతారామరాజు ,డిప్యూటీ ఎంపీడీవో జ్యోతి, ఎంఈఓలు నరేష్, దొర ,ఆసుపత్రి సూపరెంటెంట్ సునీల్, ఏపిఎం శ్రీనివాసరావు తో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

## గడ్డి మందు సేవించిన వ్యక్తి మృతి



గొలుగొండ ,ఏప్రిల్ 18, ప్రభాతవార్త : తీవ్ర కడుపు నొప్పితో గత కొన్ని రోజులుగా బాధపడుతున్న పాత మల్లంపేట గ్రామానికి చెందిన దిగుమూర్తి మల్లేశ్వరరావు గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ పి రామారావు తెలిపారు. పాత మల్లంపేటలో నివాసముంటున్న మల్లేశ్వరరావు (40) శుక్రవారం ఉదయం సమయంలో గడ్డి మందు సేవించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు అన్నారు. వెంటనే హుటాహుటిన కుటుంబ సభ్యులు ప్రాథమిక వైద్య నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారని అన్నారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అత్యవసర వైద్యం అందించాలని విశాఖ కే జే హెచ్ కు సిఫార్సు చేశారన్నారు. కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఉదయం మల్లేశ్వరరావు మరణించినట్లు వైద్యులు వైద్యులు నిర్ధారించారన్నారు. ఈ ఘటనపై గొలుగొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు.

## నీటి నిల్వలు నశిస్తే భవిష్యత్ ఎక్కడ



(రాంబిల్లి ఏప్రిల్ 18 ప్రభాతవార్త) : ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) రెండో విడత భూసేకరణలో ఉన్న చెరువులను కప్పేస్తుండడంపై రాంబిల్లి మండలం జెడ్. చింతువా పంచాయతీలో గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు, గూగుల్ డేటా సెంటర్, రెన్యూ సోలార్ కంపెనీలకు కేటాయించిన 300 ఎకరాల్లో తొలగించిన కొబ్బరి, ఇతర చెట్లను చెరువుల్లో పడేసి కప్పేస్తున్నారని వెంకయ్యపాలెం, గజ రెడ్డిపాలెం, లోవపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, చెరువులు కప్పేస్తే భూగర్భ జలాలు నాశనం అయిపోతాయని తమ గ్రామాల మంచినీటి పథకాలకు నీరు లభించని పరిస్థితులు అధికారులు కల్పిస్తున్నారని జెడ్ చింతవా మాజీ సర్పంచ్ ఎరుపల్లి చిట్టిబాబు అన్నారు, 45 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కర చెరువును కొబ్బరి దుంగలతో కప్పేయడమే కాకుండా చెరువులో నుంచి రహదారి నిర్మిస్తున్నారని ఆయన తెలిపారు, సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుము చెరువును కప్పేస్తున్నారని ఆయన ఆరోపించారు, చెరువుల్లో పూడికలు తీసి నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పిస్తుంటే అధికారులు చెరువులు కప్పేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు, ఈ విషయమై ఏపీఐఐసీ డి జెడ్ ఎమ్ సూర్యనారాయణ వద్ద ప్రస్తావించగా చెరువులో నీరు లేకపోవడంతో కొబ్బరి దుంగలు అక్కడ వేసామని చెప్పారు,ఈ నెల 23వ తేదీన సీఎం పర్యటన ముగిసిన వెంటనే చెరువులో వేసిన రహదారి తొలగించడంతోపాటు గా కొబ్బరి దుంగలను తీసివేసి చెరువులను అభివృద్ధి చేసే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు,

## సీఎం సభా వేదిక ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టర్



(రాంబిల్లి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త) రాంబిల్లి మండలం జెడ్ చింతువ పంచాయతీలో ఏర్పాటు అవుతున్న రెన్యూ సోలార్ పరిశ్రమ ఏర్పాటు పనులను శనివారం జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షించారు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 23వ తేదీన రెన్యూ సోలార్ పరిశ్రమ శంకుస్థాపనకు వస్తున్న క్రమంలో యాజమాన్యం జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లను చేపట్టారు, సభా ప్రాంగణం వివిఐపీలు, వీఐపీల గ్యాలరీల ఏర్పాటు, హెలిప్యాడ్ తదితర పనులను కలెక్టర్ పరిశీలించారు, సభా ప్రాంగణానికి చేరుకునే మార్గాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు, బందోబస్తు నిర్వహణ పగడ్బందీగా ఉండాలని ఎస్పి స్థానిక పోలీస్ అధికారులను ఆదేశించారు, సుమారు 3900 కోట్ల పెట్టుబడితో ఆరు గిగా వాట్ల సామర్థం తో ఏర్పాటు చేస్తున్న రెన్యూ సోలార్ కంపెనీకి ప్రభుత్వం 135 ఎకరాల భూమిని కేటాయించడం తెలిసిందే, పరిశ్రమకు కేటాయించిన భూముల్లో నిర్వాసిత రైతులకు పూర్తి పరిహారం చెల్లింపులపై ఆర్డిఓ రమణ స్థానిక తహసిల్దార్ సత్యనారాయణ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు, నూతన పారిశ్రామిక విధానం ద్వారా ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పలు రాయితీలు కల్పించడంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు, దీంతో రాంబిల్లిలో రెండో విడత సెజ్ కు కేటాయించిన భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపుతున్నారన్నారు, రెన్యూ సోలార్ పరిశ్రమ నిర్మాణం ప్రారంభం నుంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు, కలెక్టర్ వెంట జెసి సౌర్యమాన్ పటేల్, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి బడి పిలుస్తోంది కార్యక్రమం

(నక్కపల్లి రూరల్/ అడ్డరోడ్డు, ప్రభాతవార్త ) మండలంలోని పాఠశాలల్లో బడిపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడంపై పాఠశాలల పనివేళల అనంతరం గ్రామాలలో తల్లిదండ్రులను,గ్రామ పెద్దలను కలిసి మాట్లాడుతున్న ఉపాధ్యాయులు ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేర్పించే కార్యక్రమం మండలంలోని ఉద్దండవురం,దేవవరం,రాజయ్యపేట,నక్కవల్లి,జానకయ్యపేట,చినదొడ్డిగల్లు, వేంపాడు,గొడిచర్ల,బోదుగల్లం ఉన్నతపాఠశాలలతో పాటు అన్ని ప్రాథమిక పాఠశాలల్లో విశేష స్పందన లభిస్తుంది.ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలవైపు ఆకర్షితులయ్యేలా ఉపాధ్యాయులు చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయి. శనివారం మండలంలో ఉద్దండపురం గ్రామంలో ఎస్ఎంసి ఛైర్మన్ వెలగా శ్రీను, ఎంఈవో ఆర్.నాగన్నదొర ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు దేవర నరశింహమూర్తి,ప్రభాకర్,హరిత,నీలకంఠకుమార్, రాజునాగేశ్వర రావుతో పాటు అంగన్వాడీ టీచర్ మంగ లక్ష్మి ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు.ఈ సందర్భంగా అదనపు ఎంఈవో మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వపాఠశాలల్లో చేర్పించడమే దీని లక్ష్యమని,దీనిలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికి సర్వే నిర్వహించి బడి బయట పిల్లలతో పాటు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ఐదవ తరగతి చదివిన విద్యార్థులను తప్పనిసరిగా ప్రభుత్వపాఠశాలల్లోనే చేర్పించేలా ర్యాలీ నిర్వహించడంతో పాటు తల్లిదండ్రులతో మాట్లాడడం జరుగుతుందన్నారు.సాధారణంగా పాఠశాలలు ప్రారంభంలోనే ఈ కార్యక్రమం చేపట్టేవారిమని,కానీ విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చేరకుండా ప్రభుత్వపాఠశాలల్లోనే చేరాలనే ఉద్దేశ్యంతో ముందుగా బడిలో చేర్పించి నిర్వహిస్తున్నామన్నారు పాఠశాలలు ప్రారంభమయ్యేదాకా కొనసాగిస్తామన్నారు.

## మాతా, శిశు ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

పాడేరు,ఏప్రిల్ 18: మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ ఆకస్మికంగా తనిఖీ చేసారు. శనివారం పాడేరు మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని పీఓ ఆదిత్యవర్మ ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈసందర్భంగా హాస్పటల్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలింతలు మరియు గర్భిణీ స్త్రీలతో ముచ్చటించి వారికి అందుతున్న సేవలపై పీఓ ఆరా తీశారు. హాస్పటల్లో తనిఖీ చేయగా విద్యుత్తు, ప్లంబింగ్, మరియు నీటి సమస్యలు ఉన్నాయని రోగులు పేర్కొనగా ఆస్పత్రి నిర్వాహక అధికారులను పిలిచి వెనువెంటనే పరిష్కరించాలని పీఓ ఆదేశించారు. రోగులకు వైద్యసేవలపై నిర్వాహన సిబ్బందికి తగు సూచనలు సలహాలు పీఓ అందించారు. గర్భిణీలకు మరియు శిశువులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని వైద్య అధికారులు పీఓ ఆదేశించారు. జిల్లా ఆస్పత్రి ఇంచార్జి డా.ఎర్రయ్య, డా.టి.నరసింగరావు,వైద్యులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పీఓ పాడేరు ఎంపీడీఓ కార్యాలయం నుంచి మాతా శిశు ఆస్పత్రి వరకు అరకిలో మీటర్ వరకు నడుచుకుని వచ్చి ఆస్పత్రిలో నెలకొని ఉన్న సమస్యలపై గర్భిణీలకు,బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు.

## మోదకొండమ్మ జాతరకు ముందస్తు ఏర్పాట్లు : కలెక్టర్

పాడేరు,ఏప్రిల్18, ప్రభాతవార్త: లా అండ్ ఆర్డర్ భద్రతా పరంగా అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్పీ సూచనలు మేరకు మే 17,18,19 తేదీలలో పాడేరు మోద కొండమ్మ అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా నిర్వహించడం జరుగుచున్నదని అందుకు ఏర్పాట్లకు నిమిత్తం నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి పేర్కొన్నారు.ఈ నెల 15వ తేదీన జరిగిన జిల్లా అధికారుల సమన్వయ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు లాఅండ్ ఆర్డర్ భద్రతా పరంగా అల్లూరి జిల్లా ఎస్పీ సూచనలు మేరకు మే 17, 18, 19 తేదీలలో మోదకొండమ్మ అమ్మవారి జాతరను ఖిరాష్ట్ర పండుగ గా నిర్వహించడం జరుగుతుందన్నారు. పకడ్బందీగా పండగ వాతావరణంలో నిర్వహించుటకు ముందస్తు ఏర్పాట్లకై ప్రభుత్వం రూ/10 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయగా ఇందుకు నియమించిన శాఖల అధికారులకు సదరు నిధులను మంజూరు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ టి.నిషాంతి,తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మవారి జాతర ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అమ్మవారి జాతర నిర్వహణ అధికారిగా ఐటిడిఎ పీఓ ఆదిత్య వర్మ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు అమ్మవారి జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత దృష్ట్యా సమన్వయ కమిటీ సమావేశంలో నిర్ణయాల మేరకు ప్రశాంతమైన వాతావరణంలో జరగాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, పాడేరు ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమిళ, ఆర్ డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డేవిడ్ రాజు, పాడేరు ఐటిడిఏ ఏవో హేమలత, తదితరులు పాల్గొన్నారు.

# వెరైటీ వడియాలు

పచ్చిమిర్చి, కొత్తిమీరల ఘుమాయింపుతో నోరూరించే చారన్నంలో కాసిని వడియాలు నంజుకుంటే చాలదా.. తృప్తిగా తిన్నామనిపించటానికి! తరచూ ఒకటే అయితే విసుగని.. బియ్యప్పిండి, మినపప్పు, రవ్వ, సగ్గుబియ్యం, గుమ్మడి.. రకాలు తింటుంటాం. వడియాల్లో ఇంకా బోల్డన్ని వెరైటీలున్నాయి..

## ఉల్లి



**కావలసినవి:** మినపప్పు పావు కిలో, మిరపకాయలు 20, ఉల్లిపాయలు కిలో, పసుపు అర చెంచా, ఉప్పు రుచికి తగినంత, అల్లం ముద్ద చెంచా, ఇంగువ పావు చెంచా

**తయారీ:** మినపప్పును రాత్రి పూట నానబెట్టాలి. ఉదయం ఆ నీళ్లు తీసేసి, కాస్త ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఉల్లిపాయలు పొట్టు తీసి చిన్న ముక్కలుగా కోసుకోవాలి. మిరపకాయలను కచ్చాపచ్చాగా దంచాలి. మినప్పిండిలో ఉల్లి తరుగు, ఉప్పు, పసుపు, అల్లం ముద్ద, దంచిన మిరపకాయలు, ఇంగువ వేసి కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని చెంచాతో పాలిథిన్ కవరు మీద అంగుళం వెడల్పున వడియాలు వేసి ఎండబెట్టాలి. ఇక నూనెలో వేయించుకుంటే రసం, పప్పుచారు, సాంబారు, పులుసుల్లో సూపర్‌గా ఉంటాయి.

## పాలకూర..



**కావలసినవి:** బియ్యప్పిండి కప్పు, జీలకర్ర చెంచా, పాలకూర 2 కట్టలు, పచ్చిమిరప కాయలు మూడు, ఉప్పు రుచికి తగినంత, నువ్వులు పావు కప్పు **తయారీ:** కడిగిన పాలకూరను తరిగి కొద్దిగా నీళ్లు పోసి గ్రైండ్ చేయాలి. బియ్యప్పిండిలో నాలుగు కప్పుల నీళ్లు, పాలకూర గుజ్జు వేసి కలియతిప్పుతూ ఉడికించాలి. అందులో ఉప్పు, నువ్వులు, జీలకర్ర, మిర్చి జతచేసి ఉండలు కట్టకుండా కలియబెడుతూనే ఉండాలి. చిక్కబడ్డాక దించేసి వస్త్రం మీద వడియాలు పెట్టి.. రెండు రోజులు ఆరబెట్టాలి.



## టొమాటో..

**కావలసినవి:** బియ్యప్పిండి కప్పు, సగ్గుబియ్యం పావు కప్పు, టొమాటోలు 4 అల్లంఅంగుళం ముక్క పచ్చిమిరపకాయలు 2, ఉప్పు రుచికి అవసరం, జీలకర్ర చెంచా **తయారీ:** బియ్యప్పిండిలో రెండు కప్పుల నీళ్ళు పోసి ఉండలు కట్టకుండా కలపాలి. సగ్గుబియ్యం కడిగి ఓ గంట నానబెట్టాలి. టొమాటో ముక్కలను గ్రైండ్ చేయాలి. ఆ గుజ్జు గిన్నెలోకి తీసి.. ఆరు కప్పుల నీళ్లు, నానిన సగ్గుబియ్యం, ఉప్పు కలిపి మధ్యమధ్యలో కలియబెడుతూ ఉడికించాలి. నాలుగు నిమిషాల తర్వాత బియ్యప్పిండి, జీలకర్ర, కచ్చాపచ్చ దంచిన అల్లం, పచ్చిమిరపకాయల ముద్ద వేసి కలపాలి. అడుగంటకుండా అప్పుడప్పుడూ కలియతిప్పుతూ పది నిమిషాలు ఉడికించాలి. చిక్కగా అయ్యాక దించేసి.. పాలిథిన్ పేపరు మీద చెంచాతో వెడల్పుగా వడియాలు వేసి.. ఒండు రోజులు ఎండబెట్టాలి.

## బీట్‌రూట్ ..

**తయారీ:** బియ్యపిండి-కప్పు ఉప్పు-రుచికి తగినంత, బీట్‌రూట్-రెండు, ఎండుమిర్చి-రెండు, 2జీలకర్ర-చెంచా, మిరియాల పొడి - అర చెంచా.

**తయారీ :** బీట్‌రూట్ చెక్కు తీసి ముక్కలు కోయాలి. వాటికి ఎండుమిర్చి, ఉప్పు జోడించి గ్రైండ్ చేయాలి. ఈ గుజ్జులో ఐదు కప్పుల నీళ్లు, జీలకర్ర, మిరియాల పొడి జతచేసి ఉడికించాలి. బియ్యపిండిలో రెండు కప్పుల నీళ్లు పోసి ఉండలు కట్టకుండా కలపాలి. దీన్ని తెర్లుతున్న బీట్‌రూట్ నీళ్లలో వేసి.. కలియబెడుతూనే ఉండాలి. చిక్కబడిన తర్వాత దించేసి.. శుభ్రమైన వస్త్రం మీద పల్చగా వడియాలు పెట్టి ఎండలో ఆరబెట్టుకోవాలి. ★



# సిరులనిచ్చే అక్షయ తృతీయ



హిందూ సాంప్రదాయములో సంవత్సరంలోని 12 నెలలోను అమావాస్య నుంచి పౌర్ణమి వరకు గల తిథులు విశిష్ట దినాలుగా సంతరించుకున్నాయి ఆమావాస్య దీపావళికి, పాడ్యమి పోలి పాడ్యమిగా, తృతీయ లేక తదియ అక్షయ తదియగా, చవితి గణేశ చవితిగా, పంచమి నాగుల పంచమిగా, షష్టి సుబ్రహ్మణ్య షష్టిగా, సప్తమి రథ సప్తమిగా, అష్టమి శ్రీకృష్ణాష్టమిగా, నవమి మహార్నవమిగా, దశమి విజయదశమిగా, ఏకాదశి వైకుంఠ ఏకాదశిగా, ద్వాదశి క్షీ రాబ్ది ద్వాదశిగా, త్రయోదశి శని త్రయోదశిగా, చతుర్దశి నరక చతుర్థశిగా, పౌర్ణమి కార్తీక పౌర్ణమిగా విశేషతను సంతరించుకున్నాయి. వైశాఖ శుద్ధ తదియ అక్షయ తదియగా ప్రఖ్యాతి గాంచినది. అన్ని జన్మలలోకి ఉత్తమమైనది మానవ జన్మ. దీనిని సద్వినియోగం చేసుకుని అనంతమైన పుణ్యఫలాలు అందుకోవాలని అందరూ ఆకాంక్షి స్తారు. అక్షయ అంటే తరగిపోనటువంటిది. నేడు చేసే పుణ్య కార్యాల ఫలం అక్షయం చేస్తూ తరగిపోకుండా చేయమని చేసే వ్రతమే అక్షయ తృతీయ వ్రతము. ఈ రోజు చేసే దేవతా ప్రీతి కర్మలు, జపదాన, హోమాలు క్షయం కానంత మంచి ఫలితాన్ని స్తాయి. ఈ రోజు చేసే దానాలు అనుష్టానపరులకు, యోగ్యులకు చేసినట్లయితే శ్రీ మహావిష్ణువు సంతృప్తి చెంది అనుగ్రహిస్తాడని శాస్త్ర వచనం. సంకల్ప సహిత సముద్రస్నానం విశేష ఫలితాన్ని స్తుంది. నక్త వ్రతం, ఏక భుక్తం విశేషము. ఈ రోజు పరశురామ జయంతిగా కూడా కొలుస్తారు. క్లిష్ట సమస్యలకు పరిష్కారం కావానుకునేవారు పరశురామ స్తుత్తి ఈ రోజునుంచి మండల కాలం పారాయణ చేసినట్ల యితే అద్భుత ఫలితాలు కలుగు తాయి. రోజంతో ఉపవసించి రాత్రి సమ యంలో స్త్రీలులక్ష్మీ దేవిని పూజించి కనకధారా స్తోత్రం, శ్రీ సూక్తం, అష్టలక్ష్మీ స్తోత్రం మొద్కలెనవి పారాయణ చేసినట్లయితే సౌభాగ్య వంత్కులె, వారి కుటుంబాలు సుఖసంతో షాలతో వర్ధిల్లుతాయి. ఈ రోజున చల్లని పానీయ్కాలెన నారికేళం, తేనె, చెరకు రసం, గోక్షీ రం మొద్కలెన వాటితో అభిషేకం చేసి, వాటిని గృహమంతా చిలకరించినట్లయితే క్షేమ సౌభాగ్యాలతో, శాంతి ప్రదముగా జీవించగుగుతారు. ఈ రోజు చేసే ఏ దానానికైనా అక్షయ ఫలితం ఉంటుంది. మనం చేసే దాన ఫలితం మన తరువాత తరాలు కూడా అనుభవించ వచ్చును స్వయం పాకము బియ్యం, కందిపప్పు, రెండు కూరలు, చింతపండు, మిరపకాయలు, పెరుగు, నెయ్యి, తాంబూలంతో సహా దానమిస్తే అన్నానికి లోటు ఉండదు అని భావిస్తారు. వస్త్రదానం ఎర్రని అంచు కలిగిన పంచెల చాపు, కండువా తాంబూలంతో బ్రాహ్మణునికి దానమిస్తే వస్త్రాలకు లోటుండదు. ఉదక దానం కుండ నిండుగా మంచి నీటిని నింపి దానం చేస్తే ఉత్తర కర్మ ద్వారా పరలోక యాత్రకు సహకరించే చక్కని సంతానం కలుగుతుంది. ఉత్తమ గతులు సంప్రాప్తించటానికి ఇది ఎంతో సహకరిస్తుంది. ఈ రోజు సింహాచల నరసింహుని చందనో త్సవం జరుగుతుంది. సంవత్సర కాల మంతా చందనం పూతలో సేదదీరే స్వామి తన నిజ స్వరూపాన్ని భక్తులకు చూపి కనువిందు చేస్తాడు. స్వామి వారిది ఉగ్రరూపం కావటం వలన, వారికి శాంతి కలుగుటకై చందనాన్ని ఆయనపై లేపనంగా పూస్తారు. ఈ ఆచార వ్యవహారాలు మరుగున పడిపోయి, నేడు బంగారం కొనుగోలుకు మాత్రమే పరిమితమోతోంది. శ్రీ పార్వతీ పరమేశ్వరులను, శ్రీ లక్ష్మీనారాయణులను భక్తి శ్రద్ధలతో పూజించి, శక్తి మేరకు దాన ధర్మాదులు ఆచరించి ఉత్తమ గతులు పొందు దాం. మన తోటివారిని కూడా సుఖసంతో షాలతో జీవించేలా సహకరిద్దాం. పండుగల లోని పరమార్థాన్ని గ్రహించి వ్యవహరిస్తే లోకానికి ఎంతో కొంత మేలును చేసిన వారమౌతాము.

**- దేవులపల్లి పద్మజ**

# కడుపు నొప్పికి కారణం

సాధారణంగా మహిళల్లో నెలసరి సమయంలో పొత్తికడుపులో నొప్పి వస్తుంటుంది. అయితే ఇలా పిరియడ్స్ సమయంలోనే కాకుండా.. అప్పుడప్పుడూ కూడా కడుపునొప్పి రావడం. గమనిస్తుంటాం ఇది చిన్న సమస్యే కదా అని అశ్రద్ధ చేసే వారూ



లేకపోలేదు. కానీ ఈ నొప్పి వివిధ రకాల అనారోగ్యాలకు సూచన కావచ్చంటున్నారు నిపుణులు. కాబట్టి నొప్పి వచ్చే ప్రదేశాన్ని బట్టి అదిఎలాంటి ఆరోగ్య సమస్యనుసూచిస్తుందో తెలుసుకోవడం ముఖ్యమంటున్నారు. ఇన్ఫెక్షన్ కావచ్చు. మూత్రనాళంలో మొదలై పొత్తికడుపు వరకు నొప్పి చేరుకొంటే దాన్ని మూత్రనాళ సంబంధిత ఇన్ఫెక్షన్లకు సూచనగా భావించాలంటున్నారు నిపుణులు. కడుపు నొప్పితో పాటు యూరిన్కి వెళ్లేటప్పుడు మంట, నొప్పి కూడా యూరిన్ ఇన్ఫెక్షన్ లక్షణాలే అంటున్నారు. కొంతమందిలో మూత్రంతో పాటు రక్తం కూడా పడుతుంటుంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. ఇన్ఫెక్షన్ ప్రభావం కిడ్నీల వరకు వ్యాపిస్తుంది. అప్పుడప్పుడూ మూత్ర వ్యవస్థలో కణితులు ఏర్పడటం వల్ల కూడా ఇలా నొప్పి వచ్చే అవకాశం ఉంటుంద! కాబట్టి ఇలా మూత్రనాళం నుంచి పొత్తికడుపు వరకు నొప్పివస్తున్నట్లయితేవెంటనేసంబంధితవైద్యులనుసంప్రదించడం మంచిది. మూత్రపరీక్ష ద్వారా వైద్యులు మూత్ర సంబంధిత ఇన్ఫెక్షన్ ఉందో, లేదో తెలుసుకొని.. దాన్ని బట్టి చికిత్స చేస్తారు. పొత్తికడుపు మధ్యభాగంలో...కొంతమంది మహిళలకు పొత్తికడుపు మధ్య భాగంలో నొప్పి వస్తుంటుంది. అంటే. గర్భాశయం, ఫెలోపియన్ ట్యూబ్స్, అండాశయాల్లో.. ఏదో ఒక దానిలో నొప్పి వస్తున్నట్లు భావించాలి. ఇది ఎండోమెట్రియోసిస్, ఫైబ్రాయిడ్స్, పెల్విక్ ఇన్ఫ్లమేటరీ డిసీజ్, అండాశయాల్లో సిస్టులు.. వంటి సమస్యలకు సూచనలు కావాలన్నారు. నిపుణులు. వీటిని నిర్లక్ష్యం చేస్తే గర్భస్రావం జరగ డం. లేదా కడుపు నొప్పికి కారణంఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ (పిండం గర్భాశయం బయట పెరగడం) వంటి క్లిష్టమైన సమస్యలు ఎదురుకావచ్చు. కాబట్టి పొత్తికడుపు మధ్య భాగంలో నొప్పి వస్తుంటే మాత్రం వైద్యులను సంప్రదించి అసలు సమస్యేంటో నిర్ధారించారు.బొడ్డు దగ్గర మొదలైతే.. కొన్ని సందర్భాల్లో కడుపు నొప్పి బొడ్డు దగ్గర మొదలై ఛాతీ వరకు పాకుతుంది. దానితో పాటు కడుపులో మంటగానూ అనిపిస్తే అది సెప్టిక్ అల్సర్కి సూచనగా భావించ వచ్చంటున్నారు. నిపుణులు. ముఖ్యంగా ఇది రాత్రివేళల్లో ఇబ్బంది పెడుతూ ఉంటుంది. దీనితో పాటు ఒక్కసారిగా బరువు తగ్గడం, ఆహారం జీర్ణం కాకపోవడం, వాంతులవడం, ఛాతీ నొప్పి, వంటి ఇతర లక్షణాలూ ఈ సమస్య ఉన్నవారిలోకనిపిస్తాయట. కడుపుబ్బరంతోపాటు: కడుపుబ్బరంతో పాటు తరచూ నొప్పి వేధిస్తుంటే.. అది ఉదర సంబంధత క్యాన్సర్లకు సూచన కావచ్చంటున్నారు నిపుణులు. కాబట్టి ఆలస్యం చేయకుండా సమస్యకు తగిన చికిత్స తీసుకోవాలి.

# వాటర్ ట్యాంక్ నిండితే చెప్పేస్తుంది !



నీటి ఇక్కట్లు.. ప్రపంచమంతా ఎదుర్కొంటున్న పెద్ద సమస్యల్లో ఇదీ ఒకటి. ఈ సమస్య మన ఇంటి వరకూ రాకూడదంటే ఇంట్లోనూ నీటిని పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. దానిలో భాగంగా వచ్చినవే ఈ స్మార్ట్ వాటర్ గ్యాడ్జెట్స్. మీరూ వాడి చూడండి నీటిని చాలావరకు ఆదా చేయొచ్చు. ట్యాంక్ నింపడం కోసం మోటర్ ఆన్ చేస్తామా! ఏదో పనిలో పడి మర్చిపోతాం. తీరా ట్యాంక్ నిండి ఎన్ని నీళ్లు వృథా! ఇదొక్కటే కాదు, స్నానాల తొట్టి, బకెట్... ఇలా అన్నీ కలిపితే మనకు తెలియకుండానే వేల లీటర్ల నీటిని వేస్తాం. అందుకే ఖిస్మార్ట్ వైఫై వాటర్ సెన్సర్ అలారం లీక్ డిటెక్టర్ని వాడి చూడండి. ఈ డివైస్లో ఉండే పాయింట్లు నీటి మట్టాన్ని మానిటర్ చేసి, ఫోన్కి అలారం పంపుతాయి. వైఫైతో పనిచేస్తుంది కాబట్టి ట్యాప్ ఆన్ చేసి మర్చిపోయినా, పైపులైన్లు లీక్ అవుతున్నా ఈజీగా కనిపెట్టేస్తుంది. ఇది బ్యాటరీతో పనిచేస్తుంది కాబట్టి కరెంటు ఖర్చు అసలే ఉండదు. ట్యాంక్ ఒక్కటే కాదు, నీరు ఎక్కువ ఎక్కడ వృథా అవుతుంది అనుకుంటే అక్కడ దీన్ని ఫిట్ చేసుకుంటే సరి. వాటర్ వేస్ట్ అవ్వదు. కరెంటు బిల్లు తగ్గుతుంది ◻

# బొప్పాయితో మెరిసే చర్మం!

ఫేషియల్ అంటే మనలో చాలా మందికి పార్లరే గుర్తొస్తుంది. కానీ ఆ అవసరం లేకుండా ఇంట్లో లభించే పదార్థాలు, పండ్లతోనే స్వయంగా షేషియల్ చేసుకొని అందంగా మెరిసిపోవచ్చంటు న్నారు నిపుణులు. అలాంటిదే బొప్పాయితో చేసుకొనే ఈ షేషియల్.

**మసాజ్ ఇలా!** ... బాగా పండిన బొప్పాయిపై తొక్క తీసేసి.. ముక్కలుగా కట్ చేయాలి. వీటిని మిర్సీలో వేసి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ గుజ్జును ముఖానికి, మెడకు పట్టించి.. గుండ్రంగా రుద్దుతూ మర్దన చేసుకోవాలి. ఇలా దాదాపు 20 నుంచి 30 నిమిసాల వరకు మృదువుగా మసాజ్ చేసుకుంటూ ఉండాలి. తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. కావాల నుకుంటే ఈ బొప్పాయి పేస్ట్‌కు టీస్పూన్ చొప్పున కలబంద గుజ్జు, తేనె కలుపుకోవచ్చు.



**. మేని మెరుపుకి...** ఇలా బొప్పాయితో చేసుకొనే ఫేషియల్ గోల్డెన్ ఫేషియల్ చేసుకున్నంత ఫలితాన్నిస్తుం దంటన్నారు నిపుణులు. అంతేకాదు.. ముఖం మీద ఉంటే ట్యాన్ కూడా తగ్గుముఖం పడుతుంది. ఇలా వారానికి ఒకటి లేదా రెండుసార్లు చేయడం వల్ల ప్రకాశవంతమైన చర్మం మన సొంతమవుతుంది.◻

# ప్రేమ వెనుక యుద్ధం..



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ బాక్సాఫీస్ వద్ద మరో భారీ దండయాత్రకు సిద్ధమయ్యారు. వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న విజయ్, శనివారం తన 15వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించి ఫ్యాన్స్‌కు అదిరిపోయే సర్ ప్రైజ్ ఇచ్చారు. హాయ్ నాన్న వంటి క్లాసిక్ హిట్ అందించిన యువ దర్శకుడు శౌర్యువ్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా విడు దల చేసిన పోస్టర్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. విజయ్ దేవర కొండ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత రగ్గడ్ మరియు వైలెంట్ లుక్‌లో కనిపిస్తున్నారు. చేతిలో గొలుసులతో నల్ల కుక్కలను పట్టుకుని ఆయన నడుస్తుండగా.. వెనుక కత్తులు, బాణాలు పట్టుకుని యుద్ధా నికి సిద్ధమైన సైన్యం కనిపిస్తోంది. ముఖ్యంగా ఈ కోపమంతా ఒకప్పుడు ప్రేమే.. అనే క్యాప్షన్ సినిమా కథాంశంపై భారీ అంచ నాలను పెంచేసింది. ఒక అందమైన ప్రేమకథ ఇంతటి ఆగ్రహానికి, యుద్ధానికి ఎలా దారితీసింది అనేది ఈ చిత్రంలో ప్రధానాంశం కానుంది. ఈ సినిమా కోసం దర్శకుడు శౌర్యువ్ ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులను రంగంలోకి దించారు. హాలీవుడ్ క్రేజీ సిరీస్ హౌస్ ఆఫ్ ది డ్రాగన్ కెమెరామెన్ అలెజండ్రో మార్టినెజ్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, బ్యాట్‌మాన్ ఫరెవర్ వంటి చిత్రాలకు పనిచేసిన ఎరిక్ దర్న్ జునీశ్రీ బాధ్యతలు చేపట్టారు. యానిమల్ ఫేమ్ సురేష్ సెల్వరాజన్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తుండటంతో, విజువల్స్ పరంగా ఈ సినిమా సరికొత్త అనుభూతిని ఇవ్వబోతోంది. వైరా ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణంలో..వైరా ఎంటర్టైన్మెంట్స్ బ్యాన ర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి, రవికిరణ్ కోలా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న విజయ్.. ఆ వెంటనే శౌర్యువ్ సినిమాను పట్టాలెక్కించనున్నారు. లవ్, యాక్షన్ మరియు మైథాలజీ అంశాల మేళవింపుతో ఈ చిత్రం ఉండబోతున్నట్లు తెలుస్తోంది.

# నవ్వింది చాలు.. ఇక భయపడండి!



టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ వరుస భారీ చిత్రాలతో దూసుకుపోతూనే, మరోవైపు వైవిధ్యమైన కథాంశాలతో కొత్త ప్రయోగాలు చేస్తోంది. తాజాగా ఈ బ్యానర్ నుంచి వస్తున్న మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ 418. ఇప్పటివరకు కమర్షియల్ యాక్షన్, డ్రామా చిత్రాలను నిర్మించిన మైత్రీ, ఈసారి తొలిసారిగా పూర్తి స్థాయి హారర్ జోనర్‌ను టచ్ చేస్తోంది. ఇటీవలి కాలంలో హారర్ సినిమాల్లో కామెడీని జోడించి హారర్‌కామెడీ ట్రెండ్ నడుస్తోంది. అయితే దీనికి భిన్నంగా 418 సిని మాను రూపొందిస్తున్నారు. హారర్ సినిమాల్లో నవ్వు కున్నది చాలు.. ఇక భయపడే సమయం వచ్చింది అంటూ మేకర్స్ విడుదల చేసిన ట్యాగ్ లైన్ సినిమాపై భారీ అంచనాలను పెంచేస్తోంది. ఈ సినిమాతో ప్రేక్షకు లకు వెన్నులో వణుకు పుట్టించే అసలైన హారర్ అను భూతిని అందించబోతున్నట్లు చిత్ర బృందం స్పష్టం చేసింది. ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ పాన్ ఇండి యా డైరెక్టర్ ప్రశాంత్ నీల్. కేజీఎఫ్, సలార్ వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ చిత్రాన్ని సమర్పిస్తుండటం విశేషం. ఆయన శిష్యుడు కీర్తన్ నడగౌడ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమ వుతు న్నారు. ప్రశాంత్ నీల్ బ్రాండ్ తోడవ్వడంతో ఈ లో బడ్జెట్ హారర్ థ్రిల్లర్‌పై ఇండస్ట్రీలో ఒక్కసారిగా క్రేజ్ పెరి గింది. ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దినేష్ దివాకరన్ కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలను వెల్లడించనున్నారు.

## మైసా కోసం సాహసం



టాలీవుడ్ సెన్సేషన్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఇప్పుడు ఒక సరికొత్త అవతారంలో ప్రేక్షకులను పలకరించబోతోంది. ఆమె నటిస్తున్న తాజా పాన్ ఇండియా యాక్షన్ డ్రామా మైసా. ఈ సినిమా కోసం రష్మిక తన కెరీర్‌లోనే ఎన్నడూ లేని విధంగా శారీరక, మానసిక సిద్ధతను చాటుతోంది. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక ఒక గోండ్ గిరిజన అమ్మాయి పాత్రలో కనిపించనుంది. కేవలం మేకప్‌తోనే కాకుండా, ఆ పాత్రకు కావాల్సిన శారీరక దృఢత్వం కోసం ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

# తెర

## సౌత్ మార్కెట్‌పై భాయ్ కన్ను



బాలీవుడ్ సూపర్ స్టార్, కండల వీరుడు సల్మాన్ ఖాన్ నుంచి రాబోతున్న మరో భారీ యాక్షన్ ఎంటర్టైనర్ పట్టాలెక్కింది. టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి దర్శకత్వంలో సల్మాన్ ఖాన్ హీరోగా తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం శనివారం అధికారికంగా సెట్స్ పైకి వెళ్లింది. ఈ మేరకు చిత్ర యూనిట్ సెట్స్ నుంచి సాలిడ్ అప్‌డేట్‌ను విడుదల చేస్తూ షూటింగ్ ప్రారంభమైనట్లు ప్రకటించింది. కొన్ని దశాబ్దాల క్రితం దక్షి ణ భారత మార్కెట్‌లో మంచి ఫాలోయింగ్ ఉన్న సల్మాన్ ఖాన్, గత కొంతకాలంగా మళ్ళీ అదే స్థాయి క్రేజ్‌ను దక్కించుకోవాలని ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్ మెగా కుటుంబంతో మంచి అనుబంధం ఉన్న సల్మాన్, ఈసారి ఒక స్టార్ డైరెక్టర్ మరియు టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థకు అవకాశం ఇవ్వడం విశేషం. వంశీ పైడిపల్లి తనదైన

### వంశీ మార్క్ యాక్షన్‌కు రెడీ



శైలిలో సల్మాన్ ఖాన్‌ను ఒక పవర్‌ఫుల్ రోల్‌లో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో సౌత్ లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు తన 63వ సినిమాగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. నేటి నుంచి ఈ మాసివ్ ట్రీట్ ప్రారంభమైందని మేకర్స్ ప్రకటించడంతో అభిమానుల్లో కోలాహలం మొదలైంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ విడుదలకు ప్లాన్ చేస్తున్న ఈ చిత్రం సల్మాన్ ఖాన్ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.

## రవిబాబు మారణహోమం..



వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే యాక్టర్ కమ్ డైరెక్టర్ రవిబాబు మళ్ళీ తన మార్క్ థ్రిల్లర్‌తో ప్రేక్షకులను పలకరించబోతున్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం రేజర్. సురేష్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఫ్లయింగ్ ఫ్రాగ్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా నుంచి తాజాగా విడుదలైన ట్రైలర్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ ట్రైలర్ ఆద్యంతం హై వోల్టేజ్ వయొలెన్స్ మరియు యాక్షన్‌తో నింపేశారు. గత చిత్రాలకు భిన్నంగా రవిబాబు ఈ సినిమాలో మునుపెన్నడూ లేని విధంగా మోస్ట్ వయెలెంట్‌గా, రా అవతారంలో కనిపించి అందరినీ సర్‌ప్రైజ్ చేశారు. ఒక చిన్న పాపను కాపాడే క్రమంలో హీరో చేసే మారణహోమం ఈ చిత్ర మెయిన్ ప్లాట్‌గా ట్రైలర్‌లో రివీల్ చేశారు. రవిబాబు మార్క్ మేకింగ్‌తో పాటు గ్రిప్పింగ్ మర్డర్ మిస్టరీ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. టెక్నికల్ పరంగా కూడా ఈ సినిమా చాలా రిచ్‌గా కనిపిస్తోంది. చరణ్ మాధవనేని సినిమాటోగ్రఫీ విజువల్స్ అద్భుతంగా ఉండగా, ఎస్.ఎస్. రాజేష్ సంగీతం సినిమా మూడ్‌ను మరింత ఎలివేట్ చేస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మే 8న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మరి ఈ రేజర్ చిత్రంతో రవిబాబు బాక్సాఫీస్ వద్ద తన మార్క్ హిట్ అందుకుంటాడా అనేది వేచి చూడాలి.

## తండ్రీ కొడుకుల ప్రతీకార జ్వాల



కేజీఎఫ్ సిరీస్‌తో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన కన్నడ సూపర్ స్టార్ యశ్, ఇప్పుడు టాక్సిక్ చిత్రంతో అంతర్జాతీయ వేదికలపై సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నారు. లాస్ వెగాస్‌లో జరిగిన సినిమాకాన్ 2026 వేదికగా ఈ సినిమాకు సంబంధించిన ప్లాట్, ఆసక్తికర అంశాలను యశ్ స్వయంగా వెల్లడించారు. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్ అనే ఉపశీర్షికతో ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా కథాంశం 1940 నుండి 1970 మధ్య కాలంలో, అంటే దాదాపు మూడు దశాబ్దాల పాటు సాగుతుంది. ముఖ్యంగా భారత్‌కు స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా గోవా పోర్చుగీస్ పాలనలో ఉన్నప్పటి నుండి, అది విముక్తి పొంది క్రైమ్ సిండికేట్‌లకు అడ్డాగా మారిన వరకు జరిగిన పరిణామాలను ఇందులో చూపించబోతున్నారు. స్మగ్లింగ్ ముఠాలు, అధికార పోరాటాల మధ్య ఒక వ్యక్తి తన సామ్రాజ్యాన్ని ఎలా నిర్మించుకున్నాడనేది ప్రధాన ఇతివృత్తం. యశ్ వెల్లడించిన ప్రకారం.. ఇది కేవలం తుపాకులు, రక్తపాతం ఉన్న గ్యాంగ్‌స్టర్ మూవీ మాత్రమే కాదు. ఇందులో తండ్రీ కొడుకుల మధ్య సాగే తీవ్రమైన సంఘర్షణ, ప్రతీకారం ప్రధాన బలంగా ఉండబోతున్నాయి. రామాయణం వంటి పౌరాణిక గాథలకు ఇది పూర్తి వ్యతిరేక దిశలో ఉంటుంది.. చాలా కరకుగా, వైల్డ్‌గా సాగే ప్రపంచం ఇది అని యశ్ వివరించారు. సినిమాలో యశ్ రాయ అనే పవర్‌ఫుల్ పాత్రలో రెట్రో లుక్‌లో కనిపించబోతున్నారు. సినిమాకాన్ వేదికగా ప్రదర్శించిన 9 నిమిషాల ఎక్స్‌క్లూజివ్ ప్రివ్యూకు అంతర్జాతీయ ప్రతినిధుల నుండి భారీ రెస్పాన్స్ లభించింది. హాలీవుడ్ ప్రమాణాలతో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ వంటి స్టార్స్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముఖ్యంగా అక్కాతమ్ముళ్ల (నయనతార-యశ్) మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్ సినిమాకు ఆత్మ వంటిదని చిత్ర యూనిట్ పేర్కొంది. జూన్ 4, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## వచ్చే రిపబ్లిక్‌డేకు లవ్ అండ్ వార్



భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌గా భావిస్తున్న లవ్ అండ్ వార్ విడుదలపై ఉత్కంఠకు తెరపడింది. బాలీవుడ్ మాస్టర్ క్రాఫ్ట్స్‌మెన్ సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ పీరియడ్ డ్రామా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 2027 రిపబ్లిక్ డే కానుకగా జనవరి 21న (గురువారం) ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. రణబీర్ కపూర్, విక్కీ కౌశల్, ఆలియా భట్ వంటి టాప్ స్టార్స్ తొలిసారిగా ఒకే స్క్రీన్‌పై కనిపించనుండటం ఈ సినిమా ప్రత్యేకత. హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ భారీ ఎత్తున విడుదల కానుంది. దృశ్య కావ్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే భన్సాలీ, ఈ చిత్రాన్ని గతంలో ఎన్నడూ చూడని విధంగా విజువల్ గ్రాండ్‌నెస్, ఎమోషన్స్‌తో మలుస్తున్నారు. జనవరి 21న విడుదల చేయడం ద్వారా 5 రోజుల సుదీర్ఘ వీకెండ్‌ను క్యాష్ చేసుకునేలా ప్లాన్ చేశారు.

## పట్టాలకెక్కిన ది బ్రేకింగ్ న్యూస్..



సీనియర్ నటుడు మురళీ మోహన్ ప్రధాన పాత్రలో, మీడియా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ది బ్రేకింగ్ న్యూస్ చిత్రానికి సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. తాజాగా ఈ సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మెగాస్టార్ చిరంజీవి విడుదల చేశారు. ఈ పోస్టర్‌ను విడుదల చేసిన అనంతరం చిరంజీవి మాట్లాడుతూ, చిత్ర యూనిట్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశారు. మురళీ మోహన్ గారిని ఇప్పటివరకు మనం ఎంతో సౌమ్యమైన పాత్రల్లో చూశాం. కానీ ఈ సినిమాలో ఆయనను ఎంతో అగ్రెసివ్‌గా, సీరియస్ లుక్‌లో చూడటం ఆశ్చర్యంగా ఉంది. ఈ కొత్త మేకోవర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది అని పేర్కొన్నారు. ఈ చిత్రంలో వకీల్ సాబ్ ఫేమ్ అనన్య నాగళ్ల కీలక పాత్ర పోషిస్తోంది. ఆమె నటనను చిరంజీవి ప్రత్యేకంగా ప్రశంసించడం విశేషం. దర్శకుడు పవన్ కడియాల మీడియా రంగానికి సంబంధించిన ఒక సున్నితమైన అంశాన్ని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మలిచినట్లు సమాచారం. బ్యానర్: ఓపెన్ స్కై క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మురళీ మోహన్, అనన్య నాగళ్ల, వాసుదేవ్ తదితరులు నటిస్తున్నారు.

19-4Pg7exHMNWJQE.qxd:19-4Pg7exHMNWJQE.qxd 1/1/02 6:37 AM Page 1



# డీలిమిటేషన్‌పై ప్రత్యామ్నాయ సూచనలు భేష్

## సిఎం రేవంత్‌రెడ్డికి ప్రియాంకగాంధీ అభినందనలు

### ప్రతిపక్ష ఐక్యతకు మద్దతుగా నిలిచినందుకు

### ప్రియాంకగాంధీకి సిఎం కృతజ్ఞతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 18:** నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలకు సంబంధించి బీజేపీ విధానంలో లోపాలను ప్రజల ముందుంచడంతో పాటు ప్రత్యామ్నాయ సూచనలు చేసి దక్షిణాది రాష్ట్రాల ఐక్యతకు కృషి చేసినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభినందించారు. ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కలిశారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలను బలహీనపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రజాస్వామ్య విరుద్ధ రాజ్యాంగ సవరణను అడ్డుకోవడం, దేశ భవిష్యత్తును కాపాడేందుకు ప్రతిపక్ష శక్తులను ఏకతాటిపైకి తీసుకురావడంలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు మద్దతుగా నిలిచినందుకు తెలంగాణ ప్రజల తరఫున ప్రియాంక గాంధీకి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఏకగ్రీవంగా ఆమోదం పొందిన మహిళా బిల్లుతో సంబంధం లేకుండా, మహిళా సాధికారత పేరుతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, అనవసరమైన డీలిమిటేషన్ అజెండాను ముందుకు తీసుకువచ్చారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ సీఎంతో అన్నారు.

# రెండోరోజు కొనసాగిన మాజీఎమ్మెల్యే కుమారుడి విచారణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లో జరిగిన హిట్ అండ్ రన్ కేసులో నిందితుడైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహెల్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు రెండో రోజైన శనివారం విచారించారు. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రాహెల్‌ను విచారణ చేపట్టారు. ప్రమాదం జరిగిన తరువాత నేరుగా ఎక్కడికి పారిపోయారు, ఎవరిని సంప్రదించారని ప్రశ్నించారు. అంతేకాకుండా దుబాయికి పారిపోవడానికి వెనుక ఎవరు న్నారని ప్రశ్నించారు. డ్రైవర్‌ను మార్చాలనే ఆలోచన వెనుక ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అయితే ఈ కేసు ఇప్పటిఏక దాదాపు నాలుగేళ్లు కావడంతో రాహెల్ స్పష్టంగా సమాధానాలు చెప్పలేదని తెలుస్తుంది. కేవలం ప్రమాద భయంతోనే తాను కారు వదిలి పారి పోయినట్లు పోలీసుల దృష్టికి తీసుకొచ్చినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా డ్రైవింగ్ తానే చేశానని, అయితే డ్రైవర్ మార్పు విషయం కుటుంబ సభ్యుల మధ్యనే ఉందని తేల్చిచెప్పినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే పోలీసులను తప్పుదోవ పట్టించినట్లు సమాచారం. మరింత సమాచారాన్ని రాబట్టేందుకు రాహెల్ విచారణను కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.



# సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

**బీబీనగర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉదయం నుంచి కార్యాలయంలోకి ప్రవేశించి అధికారులు తనిఖీలు చేపట్టారు. కీలక దస్త్రాలు, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. భూక్రయ విక్రయాలపై జరిగిన డాక్యుమెంట్లను పరిశీలన జరిపారు. పలు విభాగాలకు సంబంధించిన రికార్డులను క్షుణంగా పరిశీలించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఫీజుల లావాదేవులపై వివరాలు సేకరించారు. గతంలో ఏసీబీ అధికారుల దాడులు, ప్రస్తుత విజిలెన్స్ అధికారుల సోదాలు నిర్వహించడంతో సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. సోదాలు నిర్వహించిన వారిలో విజిలెన్స్ సిఐ దశరథ, ఎఫ్‌ఆర్‌ఓ మనోహర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్ట్ పేరిట జరిగిన సైబర్ నేరంలో

## టిజి, ఎపి సహా ఐదు రాష్ట్రాల్లో సిబిఐ సోదాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 18:** డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగిన సైబర్ నేరాల కేసులో తెలంగాణ, ఏపీ సహా 5రాష్ట్రాల్లో సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. వృద్ధుడిని డిజిటల్ అరెస్టు పేరుతో మోసం చేసిన ముఠా రూ.1.6 కోట్లు కాజేసింది. దీనిపై నమోదైన కేసులో సీబీఐ అధికారులు ముగ్గురిని అరెస్టు చేశారు. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు సహకరించిన ఇండస్ ఇండ్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ దుబ్బాక మహేశ్, సైబర్ నేరాల ముఠాకు సహకరించిన రాజేశ్, వయాల శ్రీనివాస్‌ను సీబీఐ అరెస్టు చేసింది. నిందితుల నుంచి కీలక ఫైళ్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.

# ఆర్డీవో వెంకట్‌రెడ్డికి నెల రోజుల జైలు, జరిమానా

**హైదరాబాద్ (అత్తాపూర్), ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డికి నెల రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లోని 74 ఎకరాల భూ వివాదం కొన్ని సంవత్సరాలుగా ఆర్డీవో కార్యాలయంలో కేసు నడుస్తోంది. సదరు భూమి సీలింగ్ ల్యాండ్ అంటూ వివాదం ఉంది. అయితే యూసుఫుద్దీన్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన కోర్టు యూసుఫుద్దీన్ అనే వ్యక్తి భూమి అంటూ తెలిపింది. ఈ నేపథ్యంలో కోర్టు ఉత్తర్వులు అమలు చేయడం లేదని న్యాయస్థానం ఆర్డీవో వెంకట్ రెడ్డికి నెల రోజుల జైలు శిక్ష అదేవిధంగా రూ.2 వేల జరిమానా విధించింది. జరిమానా చల్లించకుంటే మరో రెండు వారాల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఉత్తర్వులు జారీ చేసింది. అప్పీల్‌కు వీలుగా తీర్పు అమలను రెండు వారాలు నిలిపేసింది. ఈ నేపథ్యం లో శనివారం ఆర్డీఓ వెంకట్‌రెడ్డి తిరిగి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

# మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** పెళ్లి పేరుతో నమ్మించి మహిళా కానిస్టేబుల్‌ను మోసం చేసిన ఘటనలో మరో కానిస్టేబుల్‌పై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. 2019లో వివాహమైన మహిళాకానిస్టేబుల్ భర్తతో విభేదాల కారణంగా తన కుమారుడితో కలిసి వేరుగా ఉంటుంది. ఈ క్రమంలోనే ప్రస్తుత ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఒక ఠాణాలో ఆమె విధులు నిర్వహిస్తున్న సమయంలో, సహోద్యోగి కానిస్టేబుల్ కప్పా స్వప్నిల్(27)తో పరిచయమైంది. పెళ్లి పేరుతో ఆమెకు స్వప్నిల్ దగ్గరయ్యాడు. పలుమార్లు ఆమె ఇంటికి వెళ్లాడు. దీంతో బాధితురాలు రెండుసార్లు గర్భవతి కాగా, అబార్షన్‌కు మాత్రలు ఇచ్చాడు. ఇదిలా ఉండగా పెళ్లి ప్రస్తావన తెస్తే కులం పేరుతో అవమానించాడు. దీనికితోడు మరో యువతితో సంబంధం పెట్టుకున్నాడు. బాధితురాలిని మానసికంగా వేధిస్తూ, ఆత్మహత్యకు ప్రేరేపించాడు. కృష్ణానగర్ ప్రాంతంలో పెళ్లి విషయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. స్వప్నిల్ పెళ్లికి నిరాకరించడంతో మహిళా కానిస్టేబుల్ ఒకేసారి 14 నిద్రమాత్రలను వేసుకోవడంతో అపస్మారకస్థితికి చేరగా ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఏడు రాష్ట్రాల్లోనే డిఎన్‌టి సర్టిఫికెట్లు జారీ

### సీడ్ పథకంలో అర్హులను గుర్తించడానికి సర్టిఫికెట్లు

### తెలంగాణ బిసి కమిషన్‌తో జాతీయ డిఎన్‌టి బోర్డు భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన డినోటిఫైడ్, సంచార, అర్ధసంచార జాతుల అభివృద్ధి సంక్షేమ బోర్డు(జాతీయ డిఎన్‌టి బోర్డు) సభ్యులు తెలంగాణ బీసీ కమిషన్‌తో సమావేశం నిర్వహించారు. జాతీయ డిఎన్‌టి బోర్డు ఆధ్వర్యంలో సంచార, అర్ధ సంచార జాతుల కొరకు చేపడుతున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా బోర్డు సభ్యులు భారత్‌భాయ్, బాబుభాయ్ పాట్ని, ప్రవీణ్ శివాజీరావ్ ఘుగే శనివారం తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మితో డిఎన్‌టి బోర్డు సభ్యులు సమావేశమై కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సీడ్ పథకంలో అర్హులను గుర్తించడానికి డిఎన్‌టి సర్టిఫికేట్ల జారీ గురించి చర్చించారు.

ఈ సందర్భంగా బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని డిఎన్‌టి, సంచార, అర్ధసంచార కులాలను సమగ్ర అధ్యయనం ద్వారా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం తర్వాత ఆయా కులాల వారికి డిఎన్‌టి సర్టిఫికేట్లు జారీ చేయనున్నట్లు చైర్మన్ తెలిపారు. జాతీయ డిఎన్‌టి బోర్డు సభ్యులు మాట్లాడుతూ... దేశంలో ఇప్పటివరకు 7 రాష్ట్రాలలో మాత్రమే డిఎన్‌టి సర్టిఫికేట్లు జారీ చేస్తున్నారని, మిగిలిన రాష్ట్రాలలో కూడా డిఎన్‌టి సర్టిఫికేట్లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని, ఆయా రాష్ట్రాలను సందర్శించి సంబంధిత అధికారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలుచేస్తున్న ఈ పథకంలో విద్యార్థులు వివిధ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ సంబంధిత పరీక్షల కొరకు శిక్షణ పొందడానికి స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దాంతోపాటు ఉపాధికల్పన, గృహ నిర్మాణం తదితర అంశాల కొరకు లబ్దిదారులకు ఆర్థిక సహాయం అందిచనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ కుల సంఘాల నాయకులు జాతీయ డిఎన్‌టి బోర్డు సభ్యులను, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను కలిసి రాష్ట్రంలో సాధ్యమయినంత త్వరగా ఈ పథకాన్ని ప్రారంభించాలని కోరారు.

# తమిళనాడులో మళ్లీ డిఎంకె కూటమిదే అధికారం

### లౌకికవాదం కోసం తమిళ ప్రజలు ముందుంటారు

### తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 18:** ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ నాయకత్వంలోని కూటమి తమిళనాడులో తిరిగి మంచి మెజారిటీతో అధికారంలోకి రాబోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన తమిళనాడు రాష్ట్రంలోని రాణిపేట జిల్లా షోలింగేర్ సర్కిల్ సమీపంలోని పండియానల్లూర్ లో ఏర్పాటుచేసిన రాహుల్ గాంధీ సభలో పాల్గొన్నారు. సభ ఏర్పాట్ల ముందు శనివారం ఉదయం రాణి పేట జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ప్రసంగించారు. లౌకిక వాదాన్ని బలోపేతం చేయడంలో సంరక్షించడంలో తమిళనాడు ప్రజలు ముందుంటారని తెలిపారు. వీరగడ్డకు, ఆత్మగౌరవానికి తమిళనాడు మారుపేరు అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని తపించే ఒక సామాన్య కార్యకర్తగా మీ అందరి ముందుకు వచ్చానని డిప్యూటీ సీఎం తెలిపారు. తమిళనాడు అంటే కేవలం ఒక రాష్ట్రం కాదు అదొక సిద్ధాంతం. పెరియార్, అన్నాదురై, కలైంజర్ కరుణానిధి వంటి గొప్ప నేతలు ఇక్కడ సామాజిక న్యాయానికి పునాది వేశారని గుర్తు చేశారు.

ప్రస్తుతం ఢిల్లీ పీఠంపై కూర్చున్న పెద్దలు తమిళనాడు సంస్కృతిని, భాషను, హక్కులను కాల రాయాలని చూస్తున్నారని వారిని ఎదుర్కోవాలి అంటే సెక్యులర్ శక్తుల ఐక్యత అవసరం అన్నారు. సీఎం. ఏంకే స్టాలిన్ నాయకత్వంలో తమిళనాడు అభివృద్ధి పథంలోకి దూసుకుపోతుంది, రాహుల్ గాంధీ ప్రేమ సందేశం స్టాలిన్ అభివృద్ధి నినాదం ఒకటి అయ్యాయి, డీఎంకే కూటమి గెలుపు కేవలం తమిళనాడుకే కాదు దేశానికి దిక్సూచిగా మారబోతుంది అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 కే గ్యాస్ సిలిండర్, రెండు లక్షల వరకు ఒకేసారి రైతులకు రుణమాఫీ, తెల్ల రేషన్ కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి సన్నబియ్యం, 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం వంటి హామీలను అమలు చేసి చూపించామని వివరించారు.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ డిఎంకె కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి, తమిళ ప్రజలు వేసే ఓటు కేవలం ఒక గుర్తుపై వేసే ముద్ర కాదు అది విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా వేసే ఓటు అది నియంతృత్వానికి వ్యతిరేకంగా వినిపించే ప్రజాస్వామ్య గొంతుక అన్నారు. మరోసారి తమిళనాడు తన ఆత్మ గౌరవాన్ని చాటుకోవాలి ఇక్కడ విద్వేషానికి చోటు లేదు కేవలం ప్రేమ, సమధర్మానికి మాత్రమే చోటు ఉందని నిరూపించాలి డీఎంకే కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.



# త్వరలోనే భూముల మార్కెట్ విలువ పెంపు

### అసైన్ట్ భూములపై ఫిర్యాదులను పరిష్కరిస్తాం

### నామినేటెడ్ పోస్టుల భర్తీ త్వరలో చేపడతాం:

### మీడియాతో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 18:** త్వరలోనే భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ల్యాండ్ వ్యాల్యూ పెంపు జరగలేదని, త్వరలో ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మిడియాతో చిట్‌చాట్‌లో పలు కీలక అంశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భూముల ధరల పెంపు, రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు, రెవెన్యూ పాలసీ వంటి విషయాలపై స్పష్టత ఇచ్చారు. ధరణి పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు.

భూముల రిజిస్ట్రేషన్‌ను మ్యాప్‌తో అనుసంధానం చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి కొత్త విధానం ప్రారంభమవుతుందని చెప్పారు. మ్యాప్‌తో కూడిన తొలి రిజిస్ట్రేషన్ పాలేరు ప్రాంతంలో ప్రారంభం కానుందని తెలిపారు. రెవెన్యూ శాఖలో కొత్త పాలసీ తీసుకురావడానికి కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు. అలాగే కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతోందని, అది విడతల వారీగా జరిగే అవకాశం ఉందని తెలిపారు.

మంత్రివర్గ విస్తరణలో పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండబోతున్నాయని జరుగుతున్న ప్రచారంపై సైతం ఆయన స్పందించారు. ఏ శాఖ ఎవరికి శాశ్వతం కాదని ఆయితే శాఖలపై ఆశలు పెట్టుకోవడం సహజం అన్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. అసైన్డ్ భూములపై వచ్చిన ఫిర్యాదులను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే నాలుగు రకాల ఫిర్యాదులను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. ఏ శాఖ ఎవరికీ శాశ్వతం కాదని, శాఖలపై ఆశలు పెట్టుకోవడం సహజమని మంత్రి వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో తనపై ప్రతిపక్షం విమర్శలు చేసినప్పుడు ఇతర మంత్రులు తనకు మద్దతుగా నిలిచారని తెలిపారు.

ప్రతిపక్షం ట్రాప్‌లో పడకుండా ఓపికగా సమాధానాలు ఇచ్చానని అన్నారు. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై లిస్ట్ తయారు అవుతోందని, సరైన సమయంలో అన్ని విషయాలు బయటకు వస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పండి

### కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 18:** బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ (ఉక్కు పరిశ్రమ) ఏర్పాటు చేయాలని ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఉక్కు కొరత తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు కలుగుతుందని తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం కేంద్ర మంత్రులకు వివరించారు. తెలంగాణలో పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులను సీఎం కోరారు. అందుబాటులో ఉన్న సాంకేతికత, భారీ పరిశ్రమలు, పారిశ్రామిక ఉత్పత్తికి ఉన్న అనుకూలతల వలన దేశ పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యాలకు హైదరబద్ కేంద్రంగా నిలవగలదని కేంద్ర మంత్రులకు సీఎం వివరించారు. హైదరాబాద్‌లో హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఆటో, రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అలాగే మెషిన్ టూల్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక పరికరాల తయారీకి ప్రత్యేక పార్క్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులకు సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌ను 2034 నాటికి కాలుష్యం లేని నగరంగా మార్చే లక్ష్యంతో వాహనాలను ఈవీలుగా మార్చేందుకు సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు నేర్పే జాతీయ స్థాయి సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులకు సీఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, కేంద్ర ప్రాజెక్టుల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

# సిఎం నివాసం ముట్టడికి బిజెపి యత్నం

### 50 మందికిపైగా అరెస్ట్ చేసిన పోలీసులు

### ఎక్కడికక్కడ పార్టీ నేతల గృహనిర్బంధం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** పార్లమెంటులో మహిళా సాధికారత కోసం చట్టసభల్లో 33 శాతం బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ బీజేపీ, బీజేపీ మహిళామోర్చ ఆధ్వర్యంలో చేపట్టిన సీఎం నివాస ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. ముఖ్యమంత్రి నివాస ముట్టడి నేపథ్యంలో డీసీపీ రమణారెడ్డి, అదనపు డీసీపీ శ్రీకాంత్, ఏసీపీ సామల వెంటకరెడ్డి, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం నివాసం వద్ద దాదాపు 250 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం నివాసానికి వచ్చే మార్గాలన్నింటిని తమ ఆధీనంలోకి తీసుకొన్నారు. బారికేడ్లు ఏర్పాటుచేసి బలగాలను మొహరించారు. మరోవైపు రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుతోపాటు ముఖ్య నేతలను, నియోజకవర్గ నేతలను అందరిని గృహనిర్బంధం చేశారు. సీఎం నివాస ముట్టడికి తొలుత వెంగళ్‌రావునగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ మహిళా మోర్చ నాయకురాలు సుప్రియ పెద్దమ్మ గుడి సమీపానికి చేరుకున్నారు. ఇది గమనించిన పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి మధురానగర్ ఠాణాకు తరలించారు. అనంతరం బీజేపీ మహిళా మోర్చ శ్రేణులు బృందాలుగా సీఎం నివాస వద్దకు చేరుకొనేందుకు ప్రయత్నించాయి. ఇందులో భాగంగానే పలు మార్గాల నుంచి వచ్చిన మహిళా మోర్చ నాయకులు బారికేడ్లను దాటుకొని ముందుకు వెళ్లామని ప్రయత్నిం చాయి. దీంతో పోలీసులు వారిని అడ్డుకొన్నారు. దాదాపు 50 మందికిపైగా బీజేపీ నేతలను అరెస్ట్ చేసి నగరంలోని వివిధ ఠాణాలకు తరలించారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు ఇందిరా రాజారెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షురాలు రాధ, మహిళా మోర్చ అధ్యక్షురాలు లిఖిత, నాయకురాళ్లు శైలజ, రేఖ, విమలా బాయి, స్వాతి, స్వప్న, సురేఖ, సరళ, సుప్రియ, మాజీ కార్పొరేటర్లు సురేఖ, సరళ తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరంతా రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల నుంచి విచ్చేశారు. అరెస్ట్ అయిన వారందరిని సాయంత్రం 4 గంటల వరకు ఠాణాలోనే అదుపులో ఉంచుకున్నారు. సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.



బంజారాహిల్స్ ఠాణాలో బిజెపి మహిళా నేతలు.

### 20 నుంచి బిసి గురుకుల డిగ్రీ కాలేజీల్లో

# అడ్మిషన్లకు దరఖాస్తులు

### 30 డిగ్రీ కాలేజీల్లో బిబిఎ, యానిమేషన్‌సహా 31 కోర్సులు.. 9,260 సీట్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలో బీసీ సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ఈ నెల 20 దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఎంజేపీ బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగుల సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు 2026-27 విద్యా సంవత్సరానికి ఎంజేపీబీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ ఫలితాల్లో ఎంజెపి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించిన వారిని కార్యదర్శి అభినందించారు. బీసీ గురుకులాల్లో ఇంటర్ చదివిన విద్యార్థులు తమ సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని సెక్రటరీ సైదులు సూచించారు. ఎంజేపీలో కాకుండా ఇతర విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ చదివి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు బీసీ గురుకుల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలలో (ఇంగ్లీష్ మీడియం) మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సులో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా బీసీ గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20 నుంచి మే 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ మార్కులను పరిగణలోకి తీసుకుని వారు కోరుకున్న కోర్సులో సీటు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 30 బీసీ డిగ్రీ కాలేజీలు అందుబాటులో ఉన్నాయని, రెగ్యులర్ కోర్సులు బీఎస్సీ, బీకామ్, బీఏతో పాటు బీఎస్సీ(ఫిజికల్ అండ్ లైఫ్ సైన్సెస్) బీబీఏ, బీఎఫ్‌టీ, యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్ మొదలైన ఆధునిక కోర్సులు అందిస్తున్నామని సైదులు తెలిపారు. గతంలో డిగ్రీ పూర్తి చేసిన ఎందరో విద్యార్థులకు ప్లేస్ మెంట్‌లు వచ్చాయని గుర్తుచేశారు. ఎంజెపి విద్యాసంస్థల్లో చేరిన ప్రతి విద్యార్థి తనకు ఆసక్తి ఉన్న ఏ రంగంలోనైనా రాణించేలా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు అత్యున్నత విద్య అభ్యసించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. క్రీడల్లోనూ ఎంజెపి విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. డిగ్రీ విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని పుస్తకాలు కాలేజీ లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయాలనుకుంటే గురుకుల విద్యాసంస్థల్లో చేర్చాలని, చదువుతో పాటు క్రమశిక్షణ నేర్చుకుంటారని అన్నారు. ఈ ఏడాది ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 20వ తేదీ నుంచి మే 10వ తేదీ వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం ఫోన్ నెం. 040-23328266లో సంప్రదించాలని కార్యదర్శి సైదులు సూచించారు.

# గిరిజన మహిళలకు శిక్షణ

### ట్రైబల్ రీసెర్చ్ డైరెక్టర్ సముజ్వల

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని గిరిజన మహిళలకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇవ్వాలని ట్రైబర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఫ్యాబ్రిక్ పెయింటింగ్, బ్లాక్ ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్ వంటి ఆధునిక కళలతో పాటు, సంప్రదాయ గిరిజన కళలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రైబల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ సముజ్వల శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇందుకు గాను ఈనెల 20 నుంచి 24 వరకు హైదరాబాద్‌లోని మసాబ్ ట్యాంక్ డీఎస్ఎస్ భవన్ లో ఉన్న ట్రైబల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ క్యాంపస్ లో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో పాల్గొనే మహిళలు రూ.2,500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ పూర్తయిన తర్వాత తెలంగాణ ట్రైబల్ డిపార్ట్ మెంట్ తరఫున సర్టిఫికెట్స్ అందజేస్తామని వెల్లడించారు. పూర్తి వివరాల కోసం తమ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో మానవరహిత విద్యుత్ రీడింగ్

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలో మానవ రహిత విద్యుత్ మీటర్ల రీడింగ్ అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతున్నట్లు విద్యుత్ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా విద్యుత్ మీటర్ రీడింగ్ తీసే సమయాల్లో తరచూ ఏర్పడుతున్న పొరపాట్లు, తప్పిదాలతో భారీ మొత్తంలో బిల్లులు రావడాన్ని నియంత్రించడంతో పాటు, బిల్లులను అంద చేయడాన్ని వేగవంతం చేసేందుకు పంపిణీ సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో మానవ రహితంగా ఆటోమేటిక్ మీటర్ రీడింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నాయి. మీటరు రీడింగ్ నమోదులో రోజులు ఆలస్యమైతే స్లాబ్ రేటు మారిపోతుంది. ఈ కారణంగా కరెంటు బిల్లు ఎక్కువగా వస్తోందన్న ఫిర్యాదులు తరచూ వస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ఏఎంఆర్ విధానాన్ని సంస్థ ఎంచుకుంది. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాలను అధికారులు ఎంపిక చేస్తున్నారు. మొదటి దశలో 400 హైటెన్షన్ విద్యుత్ సర్వీసులకు ఏఎంఆర్ (ఆటోమేటిక్ మీటర్ రీడింగ్)ను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. పరిశ్రమల్లో మీటరు రీడింగ్‌ను హెచ్‌టి విద్యుత్తు వాడుకునే కేటగిరీలో 55 హెచ్‌పీకి మించి సార్థం ఉంటే ఏడీఈ స్థాయి అధికారి, 55 హెచ్‌పీలోపు ఉంటే ఏఈ స్థాయి అధికారి సేకరిస్తారు. నాన్ స్లాబ్ రీడింగ్‌ని లైన్ ఇన్‌స్పెక్టర్లు, స్టాఫ్ రేడర్లను ప్రైవేట్, జూనియర్ లైన్‌మెన్లు సేకరిస్తారు.

18-04pg10exH.qxd:18-04pg10exH.qxd 1/1/02 5:57 AM Page 1






# వైభవ్, జైస్వాల్‌పైనే ఫోకస్

**కోల్‌కతా:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా నేడు జరిగే తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో రాజస్థాన్ రాయల్స్ తలపడనుంది. తొలి విజయం కోసం ఎదురుచూస్తున్న కేకేఆర్... సొంత గడ్డ ఈడెన్‌లోనైనా ఆ లోటు పూడ్చుకోవాలని చూస్తోంది. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ కూడా ఓటమితో ఇక్కడకు వచ్చింది. వరుస విజయాలతో జోరు మీదున్న రాజస్థాన్.. ఉప్పల్‌లో బోల్తా కొట్టింది. అయితే అయిదు మ్యాచ్‌ల్లో నాలుగింట గెలుపొందిన రికార్డుతో ఉంది.

ఈ సీజన్‌లో ఒక్క విజయం కూడా సాధించని ఏకైక జట్టుగా కోల్‌కతా ఉంది. ఆడిన 5మ్యాచ్‌ల్లో అయిదింటిలో ఓడగా, మరోమ్యాచ్ వర్షం వల్ల రద్దయింది. గత మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ చేతిలో ఐదు వికెట్ల తేడాతో ఓటమి పాలైన తర్వాత ఈ మ్యాచ్ బరిలోకి దిగుతున్నారు. ఖరీదైన ప్లేయర్ కామరూన్ గ్రీన్ పరుగుల వేటలో పడడం ఒక్కటే కేకేఆర్‌కు ఊరటనిచ్చే అంశం. కెప్టెన్ రహానే, రఘువంశీ సహా ప్రతి ఒక్కరూ నిరాశపరుస్తుండడం కేకేఆర్‌కు ఆందోళన పరుస్తోంది. బౌలింగ్‌లో వరుణ్ లాంటి మేటి స్పిన్నర్ ఉన్నా ప్రభావం చూపలేకపోతున్నాడు. ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ మెరుగుపడితేనే గెలుపు అవకాశాలు ఉంటాయి.

మరోవైపు రాజస్థాన్ రాయల్స్.. గత ఓటమి నుంచి బౌన్స్ బ్యాక్ కావాలని ఉవ్విళ్లూరుతోంది. హార్డ్ హిటర్ వైభవ్ సూర్యవంశీ 40 గంటలతో ఐదు ఇన్నింగ్స్‌లో 200 రన్స్ చేశాడు. రెండు హాఫ్ సెంచరీలతో పాటు 263కు పైగా స్ట్రయిక్ రేట్‌తో కొనసాగుతున్నాడు. గత మ్యాచ్‌లో గోల్డెన్ డక్ అయిన వైభవ్.. కేకేఆర్‌పై పరుగులు సాధించాలని ఆశిస్తున్నాడు. బ్యాటింగ్‌కు స్వర్గధామమైన ఈడెన్‌లో సిక్స్‌లమోత కోసం ఎదురుచూస్తున్నాడు. మరో ఓపెనర్ యశస్వీ జైస్వాల్, రియాన్ పరాగ్, ధృవ్ జురేల్ బ్యాట్ ఝుళిపిస్తే తిరుగుండదు. గత మ్యాచ్‌లో జడేజా, ఫెరీరా, తుషార్ రాణించడంతో బ్యాటింగ్ పటిష్టంగా మారింది. జోఫ్రా అర్చర్, బర్గర్, జడేజా, రవి బిష్ణోయ్ రూపంలో రాయల్స్‌కు వైవిధ్యభరిత బౌలింగ్ అటాక్ ఉంది.

**హెడ్ టు హెడ్ :** ఇరుజట్లు 32 మ్యచ్‌ల్లో తలపడగా ఓవరాల్‌గా కేకేఆర్ పైచేయిగా ఉంది. కోల్‌కతా 16 మ్యాచ్‌ల్లో, రాజస్థాన్ 14 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. రెండు మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు. చివరి సారి ఇరు జట్లు తలపడినప్పుడు కేకేఆర్ గెలుపొందింది. **పిచ్ రిపోర్ట్:** ఈడెన్ పిచ్‌పై చక్కని బౌన్స్ ఉంటుంది. ఈ సీజన్‌లో ఇక్కడ జరిగిన రెండు మ్యాచ్‌ల్లో సగటున మొదటి ఇన్నింగ్స్ స్కోరు 204గా నమోదైంది. చిన్న బౌండరీలు, ఫాస్ట్ అవుట్ ఫీల్డ్ వల్ల పరుగుల వరద పారనుంది.

**కోల్‌కతా నైట్ రైడర్స్:** అజింక్యా రహానే (కెప్టెన్), టిమ్ సీఫెర్ట్ (వికెట్ కీపర్), కామెరాన్ గ్రీన్, రఘువంశీ, రోవ్‌మన్ పావెల్, రింకూ సింగ్, రమణదీప్ సింగ్, అనుకూల్ రాయ్, సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి, కార్తీక్ త్యాగి; **ఇంపాక్ట్ ప్లేయర్:** వైభవ్ అరోరా

**రాజస్థాన్ రాయల్స్:** యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్ (కెప్టెన్), ప్రిటోరియస్, డోనోవన్ ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్; **ఇంపాక్ట్ ప్లేయర్:** తుషార్ దేశ్‌పాండే.

# వందో మ్యాచ్‌లో ఆర్సీబీకి షాక్

## ఢిల్లీని గెలిపించిన స్టబ్స్, మిల్లర్

**బెంగళూరు:** చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జైత్రయాత్ర ముగిసింది. వందో మ్యాచ్‌లో విజయంతో మురవాలనుకున్న ఆర్సీబీకి ఢిల్లీ క్యాపిటల్స్ చెక్ పెట్టింది. 176రన్స్ ఛేదనలో భువనేశ్వర్(3/26) ధాటికి కష్టాల్లో పడిన ఢిల్లీని ట్రిస్టన్ స్టబ్స్(60 నాటౌట్), కేఎల్ రాహుల్(57)అర్ధశతకాలతో ఆదుకున్నారు. ఆఖరి ఓవర్లో 14 రన్స్ అవసరమవ్వగా.. డేవిడ్ మిల్లర్ (22 నాటౌట్) రెండు సిక్సర్లు, ఫోర్‌తో గెలిపించాడు. ఆరు వికెట్ల తేడాతో గట్టెక్కిన ఢిల్లీ క్యాపిటల్స్ మూడో విజయం నమోదు చేసింది.



మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 8 వికెట్లకు 175 రన్స్ చేసింది. ఫిల్ సాల్ట్(38 బంతుల్లో 63) మొదటి వికెట్‌కు కోహ్లీ(19)తో కలిసి 52 రన్స్..పడిక్కల్(18)తో కలిసి రెండో వికెట్‌కు 47రన్స్ జోడించాడు.అయితే 6పరుగుల తేడాతో 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. మిడిల్ ఓవర్లలో వేగంగా వికెట్లు కోల్పోయింది. ఎంగిడి, కుల్‌దీప్, అక్షర్ పటేల్ తలా రెండేసి వికెట్లు తీసి ఆర్సీబీని కట్టడి చేశారు.

176 రన్స్ టార్గెట్‌తో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి భువనేశ్వర్ ఝలక్ ఇచ్చాడు. నిస్సాంక(1), కరుణ్ నాయర్(5), సమీర్ రిజ్వీ(2)లను వెంటవెంటనే అవుట్ చేయడంతో ఢిల్లీ 18 రన్స్‌కే మూడు టాప్ ఆర్డర్ వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిది.

**నిలబడిన రాహుల్, స్టబ్స్**

కేఎల్ రాహుల్(57), ట్రిస్టన్ స్టబ్స్(60 నాటౌట్) ఆదుకున్నారు. హేజిల్‌వుడ్ వేసిన ఓవర్లో రెచ్చిపోయిన రాహుల్ 6, 4, 4 బాదాడు. పవర్ ప్లేలో ఢిల్లీ మూడు వికెట్ల నష్టానికి 50 పరుగులు చేసింది. సుయాశ్ శర్ ఓవర్లో వరస బౌండరీ లతో.. ఈ ద్వయం 31 బంతుల్లో 50 రన్స్ జోడించింది. అర్ధ శతకం తర్వాత స్పీడ్ పెంచాలనుకున్న రాహుల్‌ను కృనాల్ పాండ్యా తెలివిగా ఔట్ చేశాడు. అనంతరం గెలుపు బాధ్యత తీసుకున్న స్టబ్స్.. సుయాశ్ ఓవర్లో బౌండరీలతో చెలరేగాడు. అయితే.. అక్షర్ పటేల్(26) రిటైర్ట్ హర్ట్‌గా వెనుదిరిగడంతో క్రీజులోకి వచ్చిన డేవిడ్ మిల్లర్(22 నాటౌట్).. భువీ ఓవర్లో సిక్సర్, ఆపై రసిక్ ఓవర్లో బౌండరీలు బాదాడు. దీంతో 10 బంతుల్లో 20 పరుగులుగా మారింది. షెపర్డ్ సంధించిన మూడు, నాలుగు బంతులను సిక్సర్లుగా మలిచిన మిల్లర్ ఐదో బంతికి బౌండరీ రాబట్టాడు. అంతే.. సొంతగడ్డపై ఆర్సీబీ చిత్తవ్వగా.. ఢిల్లీ క్యాపిటల్స్ విజయంతో మురిసింది.



# ఉప్పల్‌లో అభిషేక్ పరుగుల ఉప్పెన



**హైదరాబాద్, ఏప్రిల్18:** సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ(22 బంతుల్లో 59)... ఉప్పల్ స్టేడియంలో పరుగుల ఉప్పెన సృష్టించాడు. కేవలం 15బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీ సాధించాడు. సింగిల్‌తో పరుగుల ఖాతా తెరిచిన అభిషేక్... ముకేష్ చౌదరికి సిక్స్‌తో స్వాగతం పలికాడు. మాథ్యూ షార్ట్ మూడో ఓవర్లో కూడా ఫ్రంట్‌ఫుట్‌పై వచ్చి భారీ సిక్స్ బాదాడు. కంబోజ్ మరో ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో అలరించాడు. ఇక మాథ్యూ షార్ట్ వేసిన 5వ ఓవర్లో అభిషేక్ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. వరుసగా మూడు బౌండరీలు బాదిన అభిషేక్... చివరి రెండు బంతులపై రెండు సిక్సర్లతో విధ్వంసం సృష్టించాడు. చివరి బంతిని స్టాండ్స్‌లోకి పంపిన ఈచిచ్చరపిడుగు కేవలం 15 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ ఓవర్లో ఏకంగా 25రన్స్ సాధించాడు. తద్వారా సన్ రైజర్స్ తరఫున ఐపీఎల్‌లో వేగవంతమైన హాఫ్ సెంచరీ బాదిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. మొత్తంగా ఉప్పల్ మైదానంలో తన స్టయిల్ విధ్వంసంతో పూనకాలు తెప్పించాడు. అయితే.. ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ యశస్వీ జైస్వాల్ పేరిట ఉంది. 2023 సీజన్‌లో కేవలం 13 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించాడు.

# ఐపీఎల్ తరహాలో తెలంగాణ టీ20 లీగ్

**హైదరాబాద్, ఏప్రిల్18:** ఐపీఎల్ తరహాలో తెలంగాణ టీ20 లీగ్‌ను నిర్వహించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సన్నద్ధమైంది. జూన్‌లో జరగనున్న ఈటోర్నమెంట్‌లో జట్ల యాజమాన్యం కోసం టెండర్ ప్రక్రియను హెచ్‌సీఏ ప్రారంభించింది. జట్టు యాజమాన్య హక్కులు మొదటి 5ఏళ్ల కాలానికి ఇవ్వబడతాయి. ఆ తర్వాత ప్రతి 3 ఏళ్లకు ఒకసారి రెన్యూవల్ చేస్తారు. ఒక్కో జట్టుకు కనీస బిడ్ ధర 3 కోట్లుగా నిర్ణయించారు. ఆటగాళ్ల జీతాలు, సిబ్బంది ఖర్చులు, వసతి, జెర్సీల ఖర్చులను ఫ్రాంచైజీ యజమానులే భరించాలి. కొత్త జట్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు ఏప్రిల్ 28లోపు టెండర్ పత్రాలు సమర్పించాలి. ఏప్రిల్ 30న షార్ట్‌లిస్ట్ చేసిన ఫ్రాంచైజీలను ప్రకటించనున్నారు. ఈ టోర్నీలో మొత్తం 8 ఫ్రాంచైజీలు పాల్గొనున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మెదక్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతాలను ప్రాతిపాదించారు. ఆఖరికి బిడ్డింగ్ ద్వారా 8 జట్లను ఖరారు చేస్తారు. ఈ టోర్నీ 21 రోజులు పాటు ఉప్పల్ మైదానం వేదికగా జరగనుంది. మొత్తంగా 32 మ్యాచ్‌లు జరుగుతాయి.



# పంజాబ్ జైత్రయాత్రకు బ్రేక్ పడేనా?

**న్యూచండీఘర్:** శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో పంజాబ్ కింగ్స్.. ఈ ఐపీఎల్ సీజన్‌లో విజయవంతమైన జట్టుగా కొనసాగుతోంది. నేడు జరిగే రెండో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. ముంబైపై ఛేజింగ్‌లో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్ ఈ మ్యాచ్‌కు ఫుల్‌జోష్‌తో సిద్ధమైంది. ఆడిన 5మ్యాచ్‌ల్లో నాలుగింట గెలుపొందగా, ఓ మ్యాచ్ వర్షార్పణం అయింది. మరోవైపు లక్నో వరుసగా రెండో మ్యాచ్ పరాజయాలతో ఉంది. చివరి మ్యాచ్‌లో ఆర్సీబీ చేతిలో 5 వికెట్ల తేడాతో ఓడింది. మార్క్‌రమ్, మిచెల్ మార్ష్, రిషబ్ పంత్ తమ స్థాయికి తగ్గ బ్యాటింగ్ కనబరచడంలో విఫలమవుతున్నారు. ముకుల్ చౌదరీ ఆశాకిరణంగా ఉన్నాడు. మహ్మద్ షమీ ప్రభావవంతంగా బౌలింగ్ చేస్తూన్నా మిగతా బౌలర్లు విఫలమవుతున్నారు. ఈఏడాదివరుస విజయాలతో జోరుమీదున్న పంజాబ్‌ను లక్నో నిలువరించాలంటే బ్యాటింగ్, బౌలింగ్‌లో బ్రహ్మండంగా రాణించాల్సి ఉంటుంది.

**ఐపీఎల్‌లో నేటి మ్యాచ్**

| | |
|---|---|
| పంజాబ్ కింగ్స్ V/S లక్నో సూపర్ జెయింట్స్ | రాత్రి 7.30 గం.లకు |

2025లో స్వల్ప తేడాతో రన్నరప్‌గా నిలిచిన పంజాబ్ ఈసారి ట్రోఫీ అందుకోవాలనే దృఢ సంకల్పంతో కనిపిస్తోంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని ఈ జట్టు మరోసారి ఆధిపత్యాన్ని చాటాలని భావిస్తోంది. ప్రభుసిమ్రాన్ సింగ్, ప్రియాన్ష్ ఆర్యా ఫ్లయింగ్ స్టార్టలు అందిస్తున్నారు. సర్పంచ్ సాబ్ శ్రేయాస్ అయ్యర్ మూడు హాఫ్ సెంచరీలతో సహా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 203 రన్స్ చేశాడు. కూపర్ కానోలీ, మార్కస్ స్టోయినీస్, శశాంక్ సింగ్ కూడా పరుగుల వేటలో ఉన్నారు. అర్షదీప్ సింగ్, వైశాక్, చాహల్, బార్ట్‌లెట్, మార్కో జాన్సెన్ రూపంలో ప్రత్యర్థిని కట్టడిచేసే బౌలింగ్ సొంతం.

# 19వేల 221కోట్లకు పెరిగిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లాభాలు




**ముంబయి, ఏప్రిల్ 18:** ప్రైవేటురంగంలోని రెండో అతిపెద్ద బ్యాంకు అయిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నాలుగోత్రైమాసికంలో నికరలాభం 9 శాతం వృద్ధి సాధించింది. తక్కువ కేటాయింపుల కారణంగా నికరలాభాలు రూ.19,221 కోట్లకు పెరిగాయి. గత ఏడాది ఇదేకాలంలో 18,663.75 కోట్లు సాధించిన బ్యాంకు ఈసారి 19 కోట్ల పైచిలుకు నికరలాభం ఆర్జించింది. నికరవడ్డీ ఆదాయం కూడా పెరిగింది. 3.2శాతం పెరిగి 33,080 కోట్లుగా ఉంది. అదే గత ఏడాది ఇదే కాలంలో 32,070 కోట్లు మాత్రమే.

బ్యాంకు ఇతర రాబడులు నాలుగో త్రైమాసికంలో 13,200 కోట్లుగా ఉన్నాయి. వార్షిక పద్ధతిలోచూస్తే 9.7శాతంగా ఉన్నాయి. ఫీజులు, కమిషన్ల రూపంలో 8.1శాతం వార్షిక వృద్ధితో 9220 కోట్లు ఆర్జించింది. విదేశీ కరెన్సీ ఇతర డెరివేటివ్‌ల విభాగంలో రాబడులు 3.5శాతం పెరిగి 1490కోట్లుగా ఉంది. మార్కెట్ లాభాల పరంగా కూడా రెట్టింపు వృద్ధిని నమోదుచేసింది. 390 కోట్లనుంచి 820 కోట్ల రూపాయలు ఆర్జించి 110.3శాతం వృద్ధి నమోదుచేసింది. ఇక రికవరీలు, డివిడెండ్లరూపంలో రాబడులు రూ.1670 కోట్లవరకూ ఉన్నాయి. నిర్వహణ వ్యయాలు కూడా 5.2 శాతంపెరిగి 17,560 కోట్లనుంచి రూ.18,480 కోట్లకు పెరిగాయి. రాబడి వ్యయం నిష్పత్తిపరంగాచూస్తే 39.9 శాతంగా ఉన్నాయి బ్యాంకు నికరవడ్డీ ఆదాయం 3.38శాతంపెరిగింది. నికరవడ్డీ మార్జిన్ బ్యాంకు లాభదాయకతను నిర్దేశిస్తుంది. ఇక బ్యాంకు తక్షణ కేటాయింపులు ఈత్రైమాసికంలో 18శాతం తగ్గాయి. గత ఏడాది ఇదేకాలంలో 2837.86 కోట్లుకేటాయిస్తే ఈసారి నాలుగోత్రైమాసికంలో 2609,.57 కోట్లు కేటాయించింది. మొత్తం రుణ నిష్పత్తి వ్యయం 0.35శాతంగా ఉంది. బ్యాంకు స్థూల నిరర్ధక ఆస్తులు 1.15శాతంగా ఉన్నాయి. బ్యాంకు డిపాజిట్లు రూ.28.51 లక్షలకోట్లుగా ఉన్నాయి. డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే 3.6శాతంపెరిగాయి. కాసా డిపాజిట్లు కూడా రూ.9.18 లక్షలకోట్లుగా ఉన్నాయి. మొత్తం మార్చి 31వ తేదీనాటికి డిపాజిట్లు రూ.31.05 లక్షలకోట్లు కాగా 14.4శాతం వృద్ధినిసాధించింది. కాసా డిపాజిట్ నిష్పత్తికూడా 12.3శాతం పెరిగింది. సేవింగ్స్ ఖాతా డిపాజిట్లు రూ.7.05 లక్షలకోట్లు, కరెంటుఖాతా డిపాజిట్లు రూ.3.54 లక్షలకోట్లుగా ఉన్నాయి. కాలపరిమితి డిపాజిట్లు రూ.20.45 లక్షలకోట్లుగా ఉన్నాయి. బ్యాంకు సగటు అడ్వాన్సులు రూ.29.64 లక్షలకోట్లుగా ఉన్నాయి. స్థూల అడ్వాన్సులు రూ.29.60 లక్షల కోట్లుగా ఉన్నట్లు బ్యాంకుప్రకటించింది.

# ఐసిఐసిఐ నికరలాభం 12,630 కోట్లు

**ముంబయి, ఏప్రిల్ 18:** ప్రైవేటురంగంలోని బ్యాంకింగ్ దిగ్గజం ఐసిఐసిఐ బ్యాంకు నాలుగో త్రైమాసికంలో నికరలాభం 8.5శాతం వృద్ధిని నమోదుచేసింది. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.13,701.7 కోట్ల లాభం ఆర్జించినట్లు ప్రకటించింది. గత ఏడాది ఇదేకాలంలో 12,629.58కోట్ల నుంచి 8.5శాతం వృద్ధిని నమోదు చేసింది. బ్యాంకు నికరవడ్డీ ఆదాయం ఈ త్రైమాసికంలో 8.4 శాతం ఎరిగి రూ. 22,979 కోట్లకు పెరిగింది. అదే గత ఏడాది ఈ కాలంలో రూ.21,193 కోట్లు ఉంది. నికర వడ్డీ మార్జిన్‌కూడా 4.30శాతంనుంచి 4.32శాతానికి పెరిగింది. నికరవడ్డీ ఆదాయంలో ట్రెజరీ రాబడులు మినహాయిస్తే ఆ మొత్తం 5.6శాతంపెరిగి రూ.7415 కోట్లకు చేరింది.




బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా మాట్లాడుతూ ట్రెజరీ నష్టాలు అనేవి మార్కెట్ కదలికలను బట్టి ఉంటాయన్నారు. ఆన్‌షోర్ మార్కెట్‌లో బ్యాంకు ఆర్బీఐ మార్గదర్శకాలను అనుసరించి తగ్గించిందని, దీనివల్ల ట్రెజరీ రాబడి రూ.109 కోట్లు తగ్గిందని చెప్పారు. అలాగే బ్యాంకు కేటాయింపులు కూడా తగ్గాయి. నాలుగో త్రైమాసికంలో గత ఏడాది 891 కోట్లనుంచి 96 కోట్లకు తగ్గాయి. దీనివల్ల స్థిరాస్థి ప్రమాణాలు కూడా పెరిగి రికవరీలు మెరుగు పడ్డాయి. మార్చి 31వ తేదీనాటికి బ్యాంకు తక్షణ కేటాయింపులు కింద రూ.13,100 కోట్లు చూపించింది. రిజర్వు బ్యాంకు మార్గదర్శకాలను అనుసరించి మూడో త్రైమాసికంలోనే రూ.1283 కోట్లు అదనపు స్థిరాస్థిప్రమాణాల కేటాయింపులు చేసింది. ఈ కేటాయింపులు ప్రాధాన్యతారంగాల్లో వ్యవసాయ రంగ పోర్టుఫోలియోకింద ఉన్నాయి.

బ్యాంకు డిపాజిట్లు కూడా 11.4శాతంపెరిగి 17.95 లక్షల కోట్ల రూపాయలకు చేరాయి. కరెంటు ఖాతా సేవింగ్స్ ఖాతాల నిష్పత్తి 38.6 శాతంగా ఉంది. అలాగే బ్యాంకు అడ్వాన్సులు కూడా 15.8శాతంపెరిగి రూ.15.54లక్షలకోట్లకు చేరాయి. రిటైల్ రుణరంగం 9.5శాతం వృద్ధిచెందింది. మొత్తం రుణపోర్టుఫోలియోలో 50.4 శాతం రిటైల్‌రుణాలే ఉన్నాయి. బ్యాంకు స్థిరాస్థి ప్రమాణాలు కూడా మెరుగయ్యాయి. స్థూల నిరర్థక ఆస్తులు 1.4శాతంగా ఉన్నాయి. నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తికూడా ఈ త్రైమాసికంలో 0.33శాతం మాత్రమే ఉన్నట్లు తెలిపింది. ఏడాది మొత్తానికి ఐసిఐసిఐ నికరలాభం రూ.50,147 కోట్లకు పెరిగింది. బ్యాంకు బోర్డు డైరెక్టర్లు ప్రతి ఈక్విటీ వాటాకు రూ.12 డివిడెండ్ చెల్లింపులు సిఫారసుచేసారు. అలాగే దేశీయ మార్కెట్లనుంచి రూ.25వేలకోట్లు ప్రైవేట్ ప్లేస్‌మెంట్‌క ఇంద నిధుల సమీకరణకు కూడా ఆమోదం లభించింది. విదేశీ మార్కెట్లకు డిపాజిట్‌పత్రాల రూపంలో రూ.1.50 బిలియన్ డాలర్లు జారీచేయాలని నిర్ణయించారు. అలాగే ఐసిఐసిఐ గ్రూప్ రిస్క్ అధికారి కింద ఉన్న శ్రీనివాస్ పదవీకాలాన్ని 2028 జులై31వరకూ పొడిగిస్తూ నిర్ణయించారు.

## ఒక్క నెలలోనే కస్టమ్స్ వద్ద నిలిచిపోయిన

# 5 టన్నుల పసిడి, 8 టన్నుల వెండి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** కస్టమ్స్ విభాగం అధికారులవద్ద ఈనెల 1వ తేదీనుంచి ఇప్పటివరకూ ఐదు టన్నుల బంగారం, ఎనిమిది టన్నుల వెండి చిక్కుకునిపోయి ఉన్నట్లు తేలింది. డిజిఎఫ్‌టి అధికారుల అలసత్వంకారణంగాను, దిగుమతి అనుమతులు జాప్యం వల్ల టన్నులకొద్దీ విలువైన ఖనిజాలు కస్టమ్స్ అధీనంలోనే ఉండిపోయాయి. బులియన్ దిగుమతులకు ప్రభుత్వ అనుమతుల్లో జాప్యం వల్లనే ఇలా నిలిచిపోయినట్లు చెపుతున్నారు. అక్షయ తృతీయ కారణంగా బులియన్ రంగానికి భారీ స్థాయిలో దిగుమతులు వస్తుంటాయి. బ్యాంకులకు దిగుమతులుచేసుకునేందుకు కేంద్రం 15 బ్యాంకులకు అనుమతులిచ్చింది. దీనితో ఇపుడు ఈకస్టమ్స్ అధీనంలో ఉన్న బంగారం, వెండినిల్వలకు విముక్తి లభిస్తుందని అంచనావేస్తున్నారు.

గతనెలాఖరు వరకూ మాత్రమే బ్యాంకులకు బంగారం వెండి దిగుమతులకు అనుమతులున్నాయి. ప్రభుత్వ అనుమతి జాప్యం కారణంగా ఈనెలలో మొత్తం ఐదు టన్నుల బంగారం, ఎనిమిది టన్నుల వెండినిల్వలు కస్టమ్స్‌వద్దనే నిలిచిపోయాయి. దీనికితోడు దేశంలోని వివిధ పోర్టుల్లో కూడా దిగుమతులు నిలిచిపోయాయి. ఈ జాప్యాంపై అటు డిజిఎఫ్‌టి, కస్టమ్స్ అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకొస్తున్నారని తేలింది. వాణిజ్యశాఖ నోటిఫికేషన్‌ప్రకారం 15 బ్యాంకులు దిగుమతులు చేసుకునేందుకు అనుమతులు పెందాయి. ఏప్రిల్ ఒకటినుంచి 2029 మార్చి 31వ తేదీవరకూ ఈ అనుమతులు అమలులో ఉంటాయి. సెజ్‌లు, లేదా ఎగుమతి ఆధారిత యూనిట్లనుంచి కాకుండా దిగుమతులు నిర్వహిస్తున్న వారికి ప్రత్యేక ప్రభుత్వ లైసెన్సులు తీసుకోవాలిసి ఉంటుందని కూడా వెల్లడించింది. అక్షయతృతీయ కారణంగా చేసుకున్న దిగుమతులు నిలిచిపోవడంతో బ్యాంకులు కూడా ఆందోళన వ్యక్తంచేసాయి. ప్రభుత్వ అనుమతులతో ఇపుడు కస్టమ్స్ వద్ద ఉన్న ఈ దిగుమతులకు విముక్తి లభించనున్నది.

# జియో ఫైనాన్షియల్స్ రాబడులు 1020 కోట్లు




**ముంబయి, ఏప్రిల్ 18:** జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ నాలుగోత్రైమాసికంలో 14శాతం నికరలాభాలు తగ్గాయి. లాభాలు మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.272.2 కోట్లుగా ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. గత ఏడాది ఇదేకాలంలో కంపెనీకి రూ.316 కోట్లు లాభాలు వచ్చాయి. మొత్తం ఆదాయం కూడా 1020 కోట్లుగా ఉంది. అయితే గత ఏడాది వచ్చిన రాబడులు 518 కోట్లకు రెట్టింపుస్థాయిలో రాబడులు వచ్చాయి. మొత్తంవ్యయం మాత్రం 169కోట్లనుంచి ఒక్కసారిగా 720కోట్లకుపెరిగింది. ప్రతి ఈక్విటీ వాటాకు రూ.0.60 చొప్పున డివిడెండ్‌ప్రకటించింది. గ్రూపు చీఫ్ ఫైనాన్షియల్ అధికారిగా అన్నపూర్ణ వెంకటరమణన్‌ను నియమించింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు రూ.243.95 వద్ద వారాంతంలో కొనసాగాయి. మొత్తం నిర్వహణ రుణ ఆస్తుల విలువలు రూ.25 వేల కోట్లుగా ఉన్నాయి. జియో పేమెంట్ సొల్యూషన్స్ మొత్తం చెల్లింపుల విలువలు రూ.50వేల కోట్లుగా ఈ ఏడాదిలోనమోదయ్యాయి. జియోఫైనాన్స్ యాప్‌లో 23 మిలియన్లమంది వినియోగదారులున్నారు. బిజినెస్‌ద్వారా రూ.1390 కోట్లు ఆర్జించింది. 54శాతం నికర ఆదాయాల్లో వృద్ధినమోదుచేసింది. దేశంలోమొత్తం 19వేల పిన్‌కోడ్‌ప్రాంతాలకు తమ సేవలు అందుతున్నట్లు ఎండి సిఇఒ హితేష్ సేథియా వెల్లడించారు. జియో పేమెంట్స్ బ్యాంకు డిపాజిట్‌బేస్ 544 కోట్లుగా ఉంది. 84శాతం వార్షిక వృద్ధిని సాధించింది.

# మెటాలో 8 వేల మందికి ఉద్వాసన

**శాన్‌ఫ్రాన్సిస్కో, ఏప్రిల్ 18:** ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా మరోసారి భారీ ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది చేపట్టనున్న తొలగింపుల ప్రక్రియలో భాగంగా తొలి విడత లేఆఫ్స్‌ను మే 20న నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ మొదటి రౌండ్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 శాతం అంటే దాదాపు ఎనిమిదివేల మంది ఉద్యోగులను తొలగించనున్నారని తెలుస్తోంది. కంపెనీ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై వందల బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెడుతున్నారు. ఏఐ ఆధారంగా కంపెనీ పనితీరును సమూలంగా మార్చాలన్న ఆయన వ్యూహంలో భాగంగానే ఈ లేఆఫ్స్ చోటుచేసుకుంటున్నాయి. ఏఐ సాయంతో తక్కువ మంది ఉద్యోగులతో ముఖ్యంగా మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించి, అధిక సామర్థం సాధించాలని కంపెనీ భావిస్తోంది.

# గ్లోబల్ మార్కెట్‌లో టెక్కీల కలవరం

## ఐదేళ్లలో 10 లక్షల మందికి ఉద్వాసన




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** గ్లోబల్ టెక్ మార్కెట్‌లో లేఆఫ్స్ కలకలం రేపుతోంది. మల్టీనేషనల్ కంపెనీ ఒరాకిల్ ఏకంగా 25వేలమంది ఉద్యోగులను తొలగించడం ఆందోళన కలిగించింది. భారత్‌లోనే 12వేల మంది బాధితులు ఉన్నారు. ఈక్రమంలో ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్ తాజా నివేదిక ఐటీ నిపుణులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తాజా నివేదిక ప్రకారం 2021 నుంచి ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో సుమారు 10 లక్షల మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనే 80వేల మందిని కంపెనీలు ఇంటికి పంపాయి. 2026 చివరి నాటికి ఈ సంఖ్య 3 లక్షలు దాటే అవకాశం ఉందని ఒక అంచనా. ఒరాకిల్ 25వేలమందికిపైగాఉద్యోగుల తొలగించగా, అమెజాన్ దాదాపు 16వేల మందికి ఉద్వాసన పలికింది. ఇక మెటా విషయానికి వస్తే ఈ కంపెనీ సుమారు 2400 మందికిపైగా తొలగించింది. ఈ మొత్తం లేఆఫ్స్‌లో 61వేలకు పైగా ఉద్యోగాలు అమెరికాలోనే పోయాయి. అమెరికా వెలుపల ఆస్ట్రేలియాలో 4,450,భారత్ 2,000 పైగా, ఉద్యోగాల కోతను ఎదుర్కొన్నాయి. ప్రధానంగా క్లౌడ్ కంప్యూటింగ్, సాఫ్ట్‌వేర్‌యాజ్‌ఏసర్వీస్ రంగాల్లో 28 వేలమంది, ఈకామర్స్ రంగంలో 19వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు.

ఈ భారీ లేఆఫ్స్‌కు కృత్రిమమేథ కారణమని నిపుణులు అంచనావేస్తున్నారు. 2026లో జరిగిన లేఆఫ్స్‌లో సగం ఎఐ, ఆటోమేషన్ వల్లే జరిగాయని నివేదికలు వచ్చాయి. కంపెనీలు లాభాల్లో ఉన్నప్పటికీ, భవిష్యత్తులో ఎఐపై పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ఖర్చులను తగ్గించుకోవడమే లక్ష్యంగా లేఆఫ్ నిర్ణయాలు తీసుకుంటున్నాయని విశ్లేషకులు అంచనా. ప్రముఖ ఐటీ నిపుణుల అభిప్రాయాలు చూస్తే ఉద్యోగులు, కంపెనీలు ఎఐ ప్రభావాన్ని ముందుగానే గుర్తించడంలో విఫలమయ్యారని అన్నారు. కేవలం మల్టీ టాస్కింగ్ మాత్రమే సరిపోదు. ఐటీ నిపుణులు కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం పై దృష్టి పెట్టాలని సూచించారు. కంపెనీలు భారీ లాభాల్లో ఉండి కూడా ఉద్యోగులను తొలగించడంపై ఉద్యోగ సంఘాలు తీవ్రనిరసన వ్యక్తంచేస్తు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్‌చేస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.